PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 42 సంచిక : 352 | విజయవాడ, శనివారం 22 జులై 2023 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Saturday 22 July 2023 | Rs

మహిళలపై హింసను
నివారించేలా చర్యలు

- సిఎస్‌కు మహిళా సంఘాల ఐక్యవేదిక వినతి
- నిపుణులతో కమిటీకి డిమాండ్

లోపలి పేజీలో..



56 అంగుళాల మందం వున్న చర్మానికి బాధ,
అవమానం తెలియడానికి 79 రోజులు పట్టింది.

- ది టెలిగ్రాఫ్ సౌజన్యంతో...

టన్నెల్ వద్ద నిరసన తెలుపుతున్న కార్మికులు (ఇన్‌సెట్‌లో) మృతి చెందిన ఇద్దరు బీహార్ కూలీలు

డబుల్ ఇంజిన్ దారుణాలపై నిరసనాగ్రహాలు

మణిపూర్‌లో అమానుష ఘటనలపై దేశవ్యాప్తంగా ఆందోళనలు

- రెండో రోజూ స్తంభించిన పార్లమెంటు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

మణిపూర్‌లో చోటుచేసుకుంటున్న అమానుష దారుణాలపై దేశవ్యాప్తంగా నిరసనాగ్రహాలు వెల్లువెత్తుతున్నాయి. ఆడ తల్లులపై అఘాయిత్యాలకు పాల్పడి నగ్నంగా ఊరేగించిన దారుణాలపై సర్వత్రా ఆగ్రహం పెల్లుబుకుతోంది. 'డబుల్ ఇంజిన్' సుపరిపాలన అంటే ఇదేనా అంటూ కేంద్ర, రాష్ట్రాల్లోని బిజెపి ప్రభుత్వాల తీరుపై సామాన్య ప్రజానీకం మండిపడుతోంది. ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద డివైఎఫ్‌ఐ, ఎస్‌ఎఫ్‌ఐ తదితర ప్రజాసంఘాల నేతృత్వంతో పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించారు. దేశ రాజధానితో పాటు అసేతుహిమచలం వివిధ రూపాల్లో ప్రజలు తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ తమ ప్రభుత్వమే ఉంటే సుపరిపాలన అందిస్తామంటూ 'డబుల్ ఇంజిన్' గొప్పలు చెప్పిన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మణిపూర్‌లో హింసాకాండ మొదలైన 79 రోజుల తర్వాత పార్లమెంటు వెలుపల మొసలి కన్నీరు కార్చడం సిగ్గుచేటు అని ఆందోళనల్లో పాల్గొన్న ప్రజలు నినదించారు. బిజెపి కుట్రలకు బలైపోతున్న మణిపూర్ ప్రజానీకానికి సంఘీభావం తెలియజేశారు. కాగా మణిపూర్ మారణకాండపై పూర్తిస్థాయిలో చర్చ చేపట్టాలని పార్లమెంటులో రెండో రోజూ ప్రతిపక్షాల సభ్యులు పట్టుబట్టారు. అయితే అందుకు ససేమిరా అంటూ మోడీ సర్కార్ వెన్నుచూపింది.

పార్లమెంట్ వర్షాకాల సమావేశాలను మణిపూర్ అంశం కుదిపేస్తోంది. మణిపూర్ అల్లర్లు, తాజాగా వెలుగులోకి వచ్చిన మహిళలపై అమానుషం ఘటనపై చర్చించాలని ప్రతిపక్షాలు ఆందోళనలకు దిగడంతో ఉభయసభలు అట్టుడికాయి. ప్రతిపక్షాలు వెనక్కి తగ్గకపోవడంతో ఉభయసభలు ఎలాంటి కార్యకలాపాలు జరగకుండానే వాయిదా పడ్డాయి. మంగళవారం ఉభయసభలు ప్రారంభానికి ముందే మణిపూర్ హింసపై చర్చించాలని కాంగ్రెస్, సిపిఎం, సిపిఐ, బిఆర్ఎస్, టిఎంసి సహా ఇతర పార్టీలు వాయిదా తీర్మాన నోటీసులిచ్చాయి. లోక్‌సభ స్పీకర్, రాజ్యసభ ఛైర్మన్ అనుమతించ లేదు. లోక్‌సభ ప్రారంభం కాగానే ప్రతిపక్షాలు ఈ అంశంపై చర్చకు పట్టుబట్టాయి. వెల్‌లోకి దూసుకెళ్లి ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్దపెట్టున నినదించాయి. ఈ అంశంపై చర్చకు ప్రతిపక్షాలు సహకరించాలని, దీనిపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా సభలో ప్రకటన చేస్తారని స్పీకర్ ఓం బిర్లా తెలిపారు. ప్రధాని మోడీ సభలో సమాధానం చెప్పాలని ప్రతిపక్ష సభ్యులు డిమాండ్ చేశారు. సభలో గందరగోళ పరిస్థితులు నెలకొనడంతో నిమిషాల వ్యవధిలోనే లోక్‌సభ మధ్యాహ్నం 12 గంటలకు

మిగతా 7లో

ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఆందోళన చేస్తున్న డివైఎఫ్‌ఐ, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు, కార్యకర్తలు, మణిపూర్ యువత

మణిపూర్ ముఖ్యమంత్రి తప్పుకోవాల్సిందే

- సిపిఎం డిమాండ్
- దేశవ్యాప్తంగా నిరసనలకు పిలుపు

7

వందలు జరిగాయి

- సిఎం బీరేన్ సింగ్

ఇంఫాల్ : మణిపూర్‌లో ఇద్దరు గిరిజన మహిళల్ని నగ్నంగా ఊరేగించిన ఘటన దేశాన్ని దిగ్భ్రాంతి గురిచేస్తుంటే.. మరోవైపు ఇలాంటి సంఘటనలు రాష్ట్రంలో కొన్ని వందలు జరిగాయని, అందుకే ఇంటర్నెట్‌ను నిషేధించామని ఆ రాష్ట్ర సిఎం ఎన్.బిరేన్‌సింగ్ చెప్పడం మరింత దిగ్భ్రాంతికి గురిచేస్తోంది. దోషులపై ఇంకా చర్యలు ఎందుకు తీసుకోలేదన్న ప్రశ్నకు ఆయనపై విధంగా బదులిచ్చారు. ఇద్దరు మహిళల్ని ఊరేగించి, అందులో ఒకరిపై సామూహిక అత్యాచారం జరిగిన దారుణ ఘటన మే 4న జరగ్గా, మే 18న ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. రెండు నెలల తరువాత, గురువారం ఈ కేసులో మొదటి అరెస్టు జరిగింది. 'ఈ ఘటనపై ఇంతకుముందు మీకు సమాచారం లేదా..? ఈ ఘటన మే4న జరగ్గా మే 18న ఎఫ్ఐఆర్ నమోదు చేశారు?' అని ఒక వార్తా సంస్థకు చెందిన ప్రతినిధి ఫోన్‌లో ముఖ్యమంత్రి బీరేన్ సింగ్‌ను ప్రశ్నించారు. ఈ ప్రశ్నకు అసౌకర్యంగా ఫీలవుతూ సిఎం 'హింసాకాండలో అనేకమంది మరణించారు. వెయికి పైగా ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి' అని సమాధానం ఇచ్చారు. 'మీరు క్షేత్రస్థాయిలో పరిస్థితిని తెలుసుకోవాలి. కేసులు వందల సంఖ్యలో నమోదయ్యాయి. అందుకే ఇంటర్నెట్‌ను నిషేధించాం' అని సిఎం అసహనంతో సమాధానం ఇచ్చి, ఫోన్‌ను డిస్‌కనెక్ట్ చేశారు.

'గ్రీన్‌కో'లో ప్రమాదం

- ఇద్దరు కార్మికులు మృతి
- పరిశ్రమ వద్ద ఆందోళన

ప్రజాశక్తి- పాణ్యం/కర్నూలు హాస్పిటల్

నంద్యాల జిల్లా పాణ్యం మండలం పిన్నాపురంలో నిర్మాణంలో ఉన్న గ్రీన్‌కో పరిశ్రమలో శుక్రవారం జరిగిన ప్రమాదంలో ఇద్దరు బీహార్ కార్మికులు మృతి చెందారు. మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. తోటి కార్మికుల కథనం ప్రకారం... గ్రీన్‌కో పరిశ్రమలో నాలుగో టన్నెల్ సాల్డ్ జోన్ పరిధిలో టన్నెల్ లోపలి భాగంలో పనులు జరుగుతుండగా ఒక్కసారిగా టన్నెల్ పైభాగం కుప్పకూలింది. ఈ సమయంలో టన్నెల్ లోపల పనులు చేస్తున్న బీహార్ రాష్ట్రం లవలాంగ్‌కు చెందిన మునేరిక్ (33), కర్నిబార్ గ్రామానికి చెందిన సోనుకుమార్ (20) మృతి చెందారు. మరో ముగ్గురు కార్మికులకు తీవ్ర గాయాలవ్వగా, వారిని నంద్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రమాదం జరిగిన సమయంలో టన్నెల్ ప్రాంతంలో పది మంది కార్మికులు ఉన్నట్లు సమాచారం. ఈ ఘటన పట్ల కార్మికులు తీవ్ర ఆగ్రహానికి గురయ్యారు. టన్నెల్ వద్ద నిరసన తెలిపారు. గ్రీన్‌కోకు చెందిన వాహనాలను ధ్వంసం చేశారు. కంపెనీ ప్రతినిధులు మీడియాను పరిశ్రమలోకి అనుమతించలేదు. గురువారం రాత్రి కూడా ఒక కార్మికుడు పొక్లెయినర్ తగిలి చనిపోయినట్లు సమాచారం. సరైన వసతులు కార్మికులకు కల్పించకుండా వారి ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న కంపెనీపై చర్యలు తీసుకోవాలని సిఐటియు నాయకులు భాస్కర్ డిమాండ్ చేశారు. నంద్యాల డిఎస్‌పి మహేశ్వర్‌రెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. పాణ్యం, గడివేముల ప్రాంతాల నుండి పోలీసులు, స్పెషల్ పార్టీ పోలీసులు ఘటనా ప్రాంతానికి చేరుకొని బందోబస్తు నిర్వహించారు.

రూ.50 లక్షల చొప్పున పరిహారం ఇవ్వాలి : సిపిఎం

ప్రమాదంలో మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు రూ.50 లక్షల చొప్పున పరిహారం ఇవ్వాలని సిపిఎం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని కోరింది. ప్రమాదంలో కార్మికుల మృతి పట్ల దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. యాజమాన్యం కనీస భద్రతా ప్రమాణాలు పాటించడం లేదని పేర్కొంది. బలవంతంగా భూములు తీసుకొని ఒకవైపు రైతులను బలిచేసి, మరోవైపు కార్మికులను పొట్టన పెట్టుకుంటున్న యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఒక ప్రకటన విడుదల చేశారు.

బిజెపితో పొత్తు... టిడిపితో కాపురం!

- చంద్రబాబుకు పదేళ్లుగా వలంటీర్ 'దత్తపుత్రుడు'
- వెంకటగిరి బహిరంగ సభలో సిఎం జగన్
- 'నేతన్న నేస్తం' రూ.194 కోట్లు జమ

ప్రజాశక్తి- తిరుపతి బ్యూరో

'నీతిమాలిన రాజకీయాలు చేసేవారు కూడా వలంటీర్ వ్యవస్థను విమర్శిస్తున్నారు. చంద్రబాబుకు పదేళ్లుగా వలంటీర్‌గా దత్తపుత్రుడు పనిచేస్తున్నాడు. బిజెపితో పొత్తు పెట్టుకుని టిడిపితో కాపురం చేస్తున్నారు. వీరి జీవితమంతా వెన్నుపోట్లు, వంచన' అంటూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి దుయ్యబట్టారు. రేణిగుంట విమానాశ్రయానికి శుక్రవారం ఉదయం 9.30 గంటలకు చేరుకున్న సిఎం... ప్రత్యేక హెలికాప్టర్‌లో వెంకటగిరికి పది గంటలకు వచ్చారు. చేనేత కార్మికులతో కలిసి నేత నేశారు. చేనేత రంగంలో రాష్ట్రపతి అవార్డు పొందిన పది మందితో ఫొటోలు తీసుకున్నారు. అనంతరం బహిరంగ సభ ప్రాంగణానికి చేరుకున్నారు. ఐదో విడత వైఎస్ఆర్ నేతన్న నేస్తం పథకం కింద 80,806 మందికి రూ.194 కోట్లను బటన్ నొక్కి వారి ఖాతాలకు జమ చేశారు. ఈ సందర్భంగా వెంకటగిరిలో జరిగిన బహిరంగ సభలో సిఎం మాట్లాడుతూ టిడిపి, జనసేన పార్టీలను ఎండగడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. బిసిలంటే బ్యాక్‌వర్డ్ క్లాస్ కాదని, బ్యాక్ బోన్ క్లాస్‌గా మార్చామన్నారు. నవరత్నాల పథకంలో భాగంగా చేనేత కార్మికులను ఆదుకునేందుకు వైఎస్ఆర్ నేతన్న హస్తం పథకాన్ని తీసుకొచ్చామని పేర్కొన్నారు. 50 నెలల కాలంలో రూ.970 కోట్లు నేతన్న నేస్తం ద్వారా అందించామన్నారు. చంద్రబాబు పాలనలో చేనేతలు ఆత్మహత్యలు చేసుకున్నా పట్టించుకోలేదని విమర్శించారు. 77 నేతన్న కుటుంబాలకు చంద్రబాబు హయాంలో నష్టపరిహారం ఇవ్వలేదని, తాము అధికారంలోకి వచ్చాక ఒక్కో కుటుంబానికీ రూ.5 లక్షలు చొప్పున ఎక్స్‌గ్రేషియో అందించామని తెలిపారు. 2014-19లో ఎన్నికల్లో చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీలన్నీ మూలన పడేశారని విమర్శించారు. క్యారెక్టర్ లేని వ్యక్తులు వలంటరీ వ్యవస్థపై మాట్లాడడం ఆశ్చర్యంగా ఉందన్నారు. కులం, మతం అని చూడకుండా పార్టీలకతీతంగా అందరినీ ఆప్యాయంగా పలకరించే మనవూరి పిల్లలపైన వలంటీర్లపై తప్పుడు మాటలు మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. రాష్ట్రంలోని 2.65 లక్షల మంది వలంటీర్లలో 65 శాతం మంది తన చెల్లెమ్మలేనన్నారు. వెంకటగిరి టౌన్‌లో మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి కాంస్య విగ్రహాన్ని సిఎం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సిఎం నారాయణస్వామి, రాష్ట్ర మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, గుడివాడ అమరనాథ్, కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఎంపి మద్దిల గురుమూర్తి, ఎంఎల్‌ఎలు బియ్యపు మధుసూదన్‌రెడ్డి, సంజీవయ్య, వరప్రసాద్, అనిల్‌కుమార్ యాదవ్, కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి, వెంకటగిరి ఇన్‌ఛార్జి నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వెంకటగిరి సభలో ప్రసంగిస్తున్న జగన్

ఆర్కే భార్య అరెస్టు

- విజయవాడలో దుడ్డు ప్రభాకర్..
- రాష్ట్రంలో ఎన్ఐఎ సోదాలు

పర్యావరణాన్ని పరిరక్షిద్దాం.. ఆదివాసీలను రక్షిద్దాం

- గిరిజన అధికార రాష్ట్రీయ మంచ్ జాతీయ చైర్మన్ మిడియం బాబూరావు

లోపలి పేజీలో..

'మణిపూర్'పై మౌనమేల?

- రాష్ట్ర ప్రయోజనాలను కేంద్రం వద్ద తాకట్టు
- బిజెపి అంటే వైసిపి, టిడిపి, జనసేనలకు భయమెందుకు?
- మీడియాతో వి శ్రీనివాసరావు

ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో

మణిపూర్‌లో ఇద్దరు మహిళలను వివస్త్రలను చేసి ఊరేగించడంతోపాటు అత్యాచారానికి ఒడిగట్టిన ఘటనపై అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపి, జనసేన పార్టీలు కనీసం స్పందించకపోవడం శోచనీయమని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. మహిళలు, ఆదివాసీల హక్కులపై నిత్యం ప్రగల్భాలు పలికే వీరు అసలు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రయోజనాలను కేంద్రం వద్ద తాకట్టు పెడతారా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. విశాఖలోని ఎన్‌పిఆర్ భవన్‌లో శుక్రవారం విలేకరుల సమావేశంలో శ్రీనివాసరావు మాట్లాడారు.

పవన్ కల్యాణ్ వారానికి రెండుమూడుసార్లు ఢిల్లీ వెళ్లి వస్తూ అంతా రాష్ట్రం మంచి కోసమే చర్చిస్తున్నట్టు మీడియాకు చెబుతున్నారన్నారు. గతేడాది ప్రధాని మోడీ విశాఖ వచ్చిన సందర్భంగా సమావేశమైన పవన్...రాష్ట్రానికి మేలు చేస్తానని ప్రధాని మోడీ తనకు హామీ ఇచ్చినట్టు చెప్పారని, గడిచిన తొమ్మిది నెలల కాలంలో ఆయన ఏం చేశారో చెప్పాలని ప్రశ్నించారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ, రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విశాఖకు రైల్వే జోన్, గిరిజన విశ్వవిద్యాలయం, పోలవరం ప్రాజెక్టుకు, ఉత్తరాంధ్ర సుజల స్రవంతికి నిధులు వంటి అనేక సమస్యలపై ఒక్క మాట కూడా మాట్లాడకుండా పవన్ కల్యాణ్ ఎందుకోసం ఈ పర్యటనలు సాగిస్తున్నారని ప్రశ్నించారు. ఇటీవల అనంతపురానికి చెందిన మహిళ కార్మికురాలు పనులు చేస్తూ పిహెచ్‌డి సాధించినా రాష్ట్ర ప్రభుత్వం కనీసం ఆమెను అభినందించలేదన్నారు. ఒంగోలులో గిరిజనుడిపై మూత్రం పోసిన ఘటన సభ్య సమాజం తలదించుకునేలా ఉందని తెలిపారు. కేంద్రంలోని బిజెపి, రాష్ట్రంలోని వైసిపికి గిరిజనులకు మేలు చేయాలని ఏ కోశానా లేదని విమర్శించారు. పార్వతీపురం మన్యం, అల్లూరి

మిగతా 2లో

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వి.శ్రీనివాసరావు, చిత్రంలో లోకనాథం, జగ్గునాయుడు

సర్వీస్ ఇనామ్ భూములు క్రమబద్ధీకరణ

- దేవాదాయ, ఛారిటీ భూముల మినహాయింపు
- జీఓఎంఎస్ 310 విడుదల

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా సర్వీస్ ఇనామ్ భూములను క్రమబద్ధీకరిస్తూ ప్రభుత్వం జీఓ ఎంఎస్ నెంబరు 310ని విడుదల చేసింది. ఇందుకు సంబంధించి ఇటీవల జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. తాజా జిఓలో మతపరమైన, దేవాదాయశాఖకు సంబంధించిన ఇనామ్ భూములు, భూదాన్ కింద ఉన్నటువంటి ఛారిటీ భూములను క్రమబద్ధీకరణ నుంచి మినహాయించారు. క్షౌర వృత్తిదారులు, వడ్రంగి, కమ్మరి, కుమ్మరి, రజక వంటి గ్రామాల్లో చేతి వృత్తిదారులకు చెందిన గ్రామ సర్వీస్ ఇనామ్ భూములకు తాజా నిర్ణయంతో లబ్ధి చేకూరుతుంది. 1956లో ఇనామ్ చట్టం రావడంతో అప్పటి వరకు ఇనామ్ కింద ఉన్న భూములను రద్దు చేసి వారికి రైత్వారీ పట్టాలు ఇచ్చారు. 16/2013 ద్వారా సవరించిన ఆంధ్రప్రదేశ్ ఇనామ్‌ల (రద్దు, రైత్వారీగా మార్చడం) చట్టం 1956లోని నిబంధనలు గ్రామ కళాకారులు/ గ్రామసేవ ఇనామ్‌కు వర్తించవని ప్రభుత్వం స్పష్టం చేసింది. వృత్తిదారులు, గ్రామ సేవా ఇనామ్‌ల విషయంలో ఇప్పటికే మంజూరు చేసిన రైత్వారీ పట్టాలు చెల్లుబాటు అవుతాయని, అటువంటి పట్టాదారు వారి చట్టపరమైన వారసులు/కొనుగోలు దారులు అన్ని రెవెన్యూ రికార్డుల్లో పట్టాదారుగా నమోదు చేయబడతారని రెవెన్యూ సిబ్బంది గమనించాలని జీఓలో ప్రభుత్వం పేర్కొంది. కొందరు రైతులు తమ అవసరాల కోసం ఆయా భూములను అమ్ముకోగా, మరికొందరు వారసులకు ఆయా భూములును ఇచ్చారు. 2013లో ఈచట్టానికి సవరణ చేశారు. దేవాలయాలు, ధార్మిక సంస్థలకు ఇచ్చిన ఇనామ్ భూములను ఉద్దేశించి సవరణ జరిగింది. వీటి ద్వారా లబ్ధి పొందిన వారు ఆ సర్వీసును అందించినంత కాలం ఆ భూమిపైన వచ్చే ఫలసా యాన్ని అనుభవించడమే తప్ప అమ్ముకునేందుకు వీలు లేదని స్పష్టం చేశారు. ఇందుకు అనుగుణంగా దేవాదాయ భూములను 22 (ఎ)లో పెట్టారు. ఇదే సందర్భంలో గ్రామాల్లో చేతి వృత్తులు చేసుకుని జీవనం సాగిస్తున్న వారి ఇనామ్ భూములను కూడా 22(ఎ)లో చేర్చారు. గ్రామ సర్వీస్ ఇనామ్ భూములను క్రమబద్ధీకరించడంతో 1,68,603.71 ఎకరాలు నిషేధిత జాబితానుంచి విముక్తి కలుగుతుంది. భూముల రీసర్వే సమయంలో గ్రామ సేవా ఇనామ్‌లు, వారికి మంజూరైన రైత్వారీ పట్టాదారుల నుంచి భూములను కొనుగోలు చేసినట్లు రైతుల నుంచి ఫిర్యాదులందాయి. తమ పేర్లను రెవెన్యూ అధికారులు రికార్డుల్లో నమోదు చేయడం లేదని ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం సర్వీస్ ఇనామ్ భూములను క్రమబద్ధీకరిస్తూ నిర్ణయం తీసుకుంది.

జ్ఞానవాపి మసీదు ఆవరణలో శాస్త్రీయ సర్వే

- వారణాసి కోర్టు ఆదేశం

న్యూఢిల్లీ : జ్ఞానవాపి మసీదు ఆవరణలో గతంలో మూసివేసిన ప్రాంతాన్ని మినహాయించి మిగిలిన ప్రాంతంలో భారత పురావస్తు శాఖ శాస్త్రీయ సర్వే నిర్వహించేందుకు వారణాసి కోర్టు శుక్రవారం ఆమోదం తెలిపింది. కోర్టు ఆదేశాలతో జరిగిన వీడియో సర్వేలో హిందూ మహిళలు చెబుతున్న శివలింగం లేదా ముస్లిములు చెబుతున్న ఫౌంటేన్ వున్నట్లు కనుగొనడంతో మసీదు ఆవరణలో ఆ స్థలాన్ని మూసివేయాలని కోర్టు గతంలో జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించింది. ఈ ఏడాది మేలో ఐదుగురు మహిళలు వేసిన పిటిషన్‌ను విచారించిన న్యాయస్థానం తన తీర్పును వెలువరించింది. అంతకుముందు ఈ మహిళలే మసీదు ఆవరణలోని శృంగార గౌరి స్థల్ వద్ద ప్రార్థనలు చేసుకోవడానికి అనుమతించాలని కోర్టును కోరారు. ఆ పిటిషన్‌పై స్పందించిన వారణాసి సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వీడియో సర్వే చేయాలని ఆదేశించారు. అది గతేడాది మే 16తో పూర్తయింది.

వివేకా హత్య కేసులో వెలుగులోకి కీలక సాక్ష్యాలు

- స్వీకరించిన సిబిఐ కోర్టు

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు దర్యాప్తులో కీలక సాక్ష్యాలను సిబిఐ నమోదు చేసింది. కీలక వ్యక్తుల వాంగ్మూలాలను గత నెల 30న సిబిఐ కోర్టుకు సమర్పించింది. వీటిని కోర్టు విచారణకు స్వీకరించడంతో ఈ వివరాలు శుక్రవారం వెలుగులోకి వచ్చాయి. వివేకా హత్య కేసులో సిఎం జగన్ ఓఎస్‌డి పి.కృష్ణమోహన్‌రెడ్డి, విశ్రాంత సిఎస్ అజేయ కల్లం, వైసిపి నేత ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, జగన్ అటెండర్ గోపరాజు నవీన్‌కుమార్, వైఎస్ షర్మిల సాక్షులుగా ఉన్నట్లు కోర్టుకు సిబిఐ తెలిపింది. వివేకా హత్య జరిగిన 2019 మార్చి 15న జగన్ లోటస్‌పాండ్‌లో ఉన్నట్లు సాక్షులు తెలిపారని పేర్కొంది. వైసిపి ఎన్నికల మేనిఫెస్టోపై చర్చించేందుకు తెల్లవారుజామునే సమావేశమైనట్లు సిబిఐ కోర్టుకు నివేదించింది. సిబిఐకి ఇచ్చిన వాంగ్మూలాలు ఈ కింద విధంగా ఉన్నాయి.

అవినాషే చెప్పారు : కృష్ణమోహన్‌రెడ్డి

2019 మార్చి 15 తెల్లవారుజామున లోటస్‌పాండ్‌లో జగన్‌తో సమావేశంలో ఉన్నప్పుడు ఆయన అటెండర్ నవీన్ వచ్చి ఎంపి అవినాష్ ఫోన్ లైన్‌లో ఉన్నారని, బయటకు రావాలని పిలిచారు. వివేకా మరణించారని అవినాష్ నాకు ఫోన్‌లో చెప్పారు. ఎలా జరిగిందని అవినాష్‌రెడ్డిని అడిగాను. బాత్‌రూమ్‌లో రక్తపు మడుగులో పడి ఉన్నారని చెప్పారు. జగన్‌కు సమాచారం ఇవ్వండని అవినాష్ చెప్పారు. వివేకా మరణం విషయం, అవినాష్ చెప్పిన సమాచారం జగన్‌కు చెప్పాను. తర్వాత జగన్ పులివెందుల వెళ్లారు. జగన్ పర్యటన విషయం మాట్లాడేందుకు ఆ సమయంలో అవినాష్‌కు ఐదుసార్లు ఫోన్ చేశాను'

'బాబాయ్ ఇక లేరు' అని జగన్ చెప్పారు : అజేయ కల్లం

లోటస్‌పాండ్‌లో జగన్‌తో సమావేశంలో ఉండగా ఉదయం 5.30 గంటల సమయంలో అటెండర్ తలుపు కొట్టారు. వైఎస్ భారతి మేడపైకి రమ్మంటున్నారని అటెండర్ జగన్‌కు చెప్పారు. జగన్ బయటకు వెళ్లి పది నిమిషాల

మిగతా 7లో

వివేకానంద రెడ్డి (ఫైల్)

రాజకీయ కారణాలతోనే హత్య : వైఎస్ షర్మిల

రాజకీయ కారణాలతోనే బాబాయ్ హత్య జరిగింది. హత్యకు కుటుంబ, ఆర్థిక వ్యవహారాలు కారణాలు కాదు. పెద్ద కారణం ఉంది. అవినాష్ కుటుంబానికి వ్యతిరేకంగా వివేకా నిలబడడమే కారణం కావొచ్చు. వారికి అడ్డొస్తున్నారని మనసులో పెట్టుకోవచ్చు. హత్యకు కొన్ని నెలల ముందు బెంగళూరులోని మా ఇంటికి వివేకా వచ్చారు. కడప ఎంపిగా పోటీ చేయాలని ఆయన నన్ను అడిగారు. ఎంపిగా అవినాష్ పోటీ చేయొద్దని కోరుకుంటున్నట్లు చెప్పారు. అవినాష్‌కు టికెట్ ఇవ్వకుండా ఎలాగైనా జగన్‌ను ఒప్పిద్దామన్నారు. జగన్‌కు వ్యతిరేకంగా నేను వెళ్లనని వివేకా ఆలోచించారు. కచ్చితంగా ఒప్పించగలననే ధీమాతో ఆయన మాట్లాడారు. జగన్ నాకు మద్దతివ్వరని తెలుసు కాబట్టి ఎంపిగా పోటీకి మొదట ఒప్పుకోలేదు. బాబాయ్ పదేపదే ఒత్తిడి చేయడంతో సరే అన్నాను. ఎమ్మెల్సీగా బాబాయ్ ఓటమికి అవినాష్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, కొందరు సన్నిహితులే కారణం. కుటుంబంలో అంతా బాగున్నట్లు బయటకు కనిపించినా, లోపల కోల్డ్‌వార్ ఉండేది.

బుద్ధిలేని, నీతిమాలిన చర్య

- పవన్‌పై కేసు పెట్టడాన్ని ఖండించిన చంద్రబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

జనసేన అధినేత పవన్ కల్యాణ్‌పై రాష్ట్ర ప్రభుత్వం పరువు నష్టం కేసు పెట్టడం బుద్ధిలేని, నీతిమాలిన చర్య అని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు విమర్శించారు. దీనిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు శుక్రవారం ట్విట్టర్‌లో చంద్రబాబు పేర్కొన్నారు. తప్పులు చేస్తున్న ప్రభుత్వాన్ని ప్రశ్నించడం కూడా నేరం అనే పరిస్థితి రాష్ట్రంలో నెలకొందని అన్నారు. ప్రజలు తమ సమస్యలను ప్రస్తావిస్తే దాడులు, రాజకీయ పక్షాలు ప్రశ్నిస్తే కేసులు అనేది రాక్షస ప్రభుత్వ విధానమైందని విమర్శించారు. ప్రభుత్వం అంటే జవాబుదారీగా ఉండాలని, ఈ అణచివేత ధోరణి మానుకోవాలని సూచించారు. ప్రజల వ్యక్తిగత వివరాలు, కుటుంబ వ్యవహారాలపై ప్రభుత్వం సమాచారం సేకరించడమే తప్పు అని అన్నారు. ప్రభుత్వ వ్యవస్థలను దుర్వినియోగం చేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిపై ముందు కేసు పెట్టి విచారణ జరపాలని డిమాండ్ చేశారు. పవన్ కల్యాణ్‌పై కేసులు పెట్టడం జగన్ అరాచకాలకు పరాకాష్ట అని, పవన్‌పై కక్షసాధింపేనని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కె అచ్చెన్నాయుడు మరో ప్రకటనలో విమర్శించారు. ప్రశ్నించే గొంతుకను ప్రభుత్వం నొక్కుతుండటం చాలా దుర్మార్గమని అన్నారు

ఎంపి రఘురామ పిటిషన్ కొట్టివేత

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వంపై నరసాపురం ఎంపి రఘురామ కృష్ణరాజు దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టేసింది. ఎపి బేవరేజ్ కార్పొరేషన్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం రుణాలు సేకరించడం రాజ్యాంగ విరుద్ధమంటూ రఘురామరాజు తొలుత హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టులో తీర్పు అనుకూలంగా రాకపోవడంతో సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. ఈ పిటిషన్ శుక్రవారం సిజెఐ జస్టిస్ డివై చంద్రచూడ్, జస్టిస్ జెబి పార్డీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రతో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. హైకోర్టు తీర్పు తరువాత ఎనిమిది నెలలు ఆలస్యంగా పిటిషన్ దాఖలు చేసినట్లు ధర్మాసనం గుర్తించింది. ఈ నేపథ్యంలో తాము జోక్యం చేసుకోబోమని స్పష్టం చేసిన ధర్మాసనం పిటిషన్ కొట్టేసింది.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501కు కానీ
editorprajasakthi@gmail.comకు పంపవచ్చు.

ధ్రువీకరణ తరువాత కౌలు చెల్లింపు

- సిఆర్‌డిఎ ప్రకటన

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

గుంటూరు జిల్లా కలెక్టరు ధ్రువీకరణ జరిగిన వెంటనే రైతులకు కౌలు చెల్లిస్తామని సిఆర్‌డిఎ భూ వ్యవహారాల స్పెషల్ డిప్యూటీ కలెక్టరు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మే 5న రూ.240 కోట్లు రైతుల కౌలు నిమిత్తం విడుదల చేశామని తెలిపారు. 24,521 మంది రైతులకు ఇప్పటి వరకు 28,491 ఎకరాలకు సబంధించి రూ.185.68 కోట్లు విడుదలకు పంపిన ప్రతిపాదన మేరకు 23,398 మంది భూ యజమానులకు 26,927 ఎకరాలకు గాను రూ.175.97 కోట్లు చెల్లించేందుకు సిఎఫ్‌ఎంఎస్ అప్‌లోడు చేసిందని పేర్కొన్నారు.

అసైన్డ్ భూములకు సంబంధించి సిఐడి విచారణలో 1,751 ఎకరాల భూమి వివరాలు తెలియాల్సి ఉందని తెలిపారు. దీనికి సంబంధించిన పత్రాలు లేకపోవడంతో రైతులను సంప్రదించామని వివరించారు. వాటిని ధ్రువీకరించాల్సి ఉందని, అనంతరం కౌలు చెల్లించేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

ఆల్మట్టిలోకి 70వేల క్యూసెక్కులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కృష్ణానదిపైన ఆల్మట్టి డ్యామ్‌కు వరద నీరు వస్తోంది. శుక్రవారం నాటి గణాంకాల ప్రకారం ఆల్మట్టి డ్యామ్‌లోకి 70 వేల క్యూసెక్కుల నీరు వస్తున్నాయి. ఆల్మట్టి పూర్తి స్థాయి సామర్థ్యం 129.72 టిఎంసీలు కాగా ప్రస్తుతం 38.40 టిఎంసీల నీరు వుంది. అలాగే తుంగభద్ర డ్యామ్‌లోకి 13,340 క్యూసెక్కులు వస్తోంది. తుంగభద్ర డ్యామ్ పూర్తి స్థాయి సామర్థ్యం 105.79 టిఎంసీలు కాగా ప్రస్తుతం 13.72 టీఎంసీల నీరు వుంది. శ్రీశైలం, నాగార్జునసాగర్‌లలో ఇప్పటికీ డెడ్ స్టోరేజ్ స్థాయిలోనే నీటి మట్టాలు వున్నాయి. శ్రీశైలం పూర్తి స్థాయి సామర్థ్యం 215 టీఎంసీలుకాగా ప్రస్తుతం 33.58 టీఎంసీలు, నాగార్జునసాగర్ 312 టీఎంసీలకు గాను 144టీఎంసీల నీరు మాత్రమే వుంది. అలాగే పులిచింతలలో 45.77టీఎంసీలకుగాను 16.88టీఎంసీలు మాత్రమే వున్నాయి. గత ఏడాది జూలై నాటికే కృష్ణానదిపై వున్న ప్రాజెక్టులన్నీ పూర్తిస్థాయి నీటి మట్టాలకు చేరుకోవడం గమనార్హం.

మహిళలపై హింసను నివారించేలా చర్యలు

- సిఎస్‌కు మహిళా సంఘాల ఐక్యవేదిక వినతి
- నిపుణులతో కమిటీకి డిమాండ్

సిఎస్‌కు వినతిపత్రం ఇచ్చేందుకు ర్యాలీగా వెళుతున్న మహిళాసంఘాల నాయకులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

దేశంలోనూ, రాష్ట్రంలోనూ చిన్నారులు, మహిళలపై హింస రోజురోజుకూ విపరీతంగా పెరుగుతోందని, దీన్ని నివారించేందుకు చర్యలు తీసుకోవాలని సిఎస్‌ను మహిళా సంఘాల ఐక్యవేదిక కోరింది. ఈ మేరకు శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డిని ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, ఐద్వా కార్యదర్శి డి రమాదేవి, మహిళా సమాఖ్య కార్యదర్శి పి దుర్గాభవాని, పిఒడబ్ల్యు నాయకులు పి పద్మ, ఐద్వా నాయకులు కె శ్రీదేవి, డి శ్రీనివాస కుమారి కలిసి వినతిపత్రం సమర్పించారు. దీనిపై స్పందించిన సిఎస్ చట్టపరిధిలో అన్ని చర్యలూ తీసుకుంటామని, అలాగే మహిళా సంఘాలతో పోలీసు విభాగం అధికారులు చర్చిస్తారని హామీనిచ్చారు. అనంతరం రమాదేవి మాట్లాడుతూ.. ఢిల్లీలో శ్రద్ధావాకర్, బొంబాయిలో సరస్వతీ వైద్య, చెరుకుపల్లిలో అమరనాథ్ హత్య, మణిపూర్‌లో కుకీ మహిళల నగ్న ప్రదర్శన, అతిక్రూరంగా జరిగిన హత్యలు దేశానికి, సమాజానికి అప్రతిష్టని అన్నారు. దేశంలో ఏదో ఒకమూల నిముషానికో అఘాయిత్యం జరుగుతోందని, వెలుగులోకి వస్తున్నవి కొన్ని మాత్రమేనని పేర్కొన్నారు. బిజెపి కేంద్రంలో అధికారంలోకి వచ్చిన తరువాత ఇవి మరింత పెరిగాయని వివరించారు. హైదరాబాద్‌లో జరిగిన దిశ ఘటన ప్రజలను కలిచి వేసిందని, దిశ చట్టం ఇంతవరకు ఆమోదం పొందలేదని పేర్కొన్నారు. రాష్ట్రంలో నేరాలు పెరిగాయని, కృష్ణానది తీరంలో యువజంటపై దాడి చేశారని, గుంటూరులో డెంటల్ విద్యార్థి హత్య, రమ్యహత్య, విశాఖలో వరలక్ష్మి హత్య సంచలనం కలిగించాయని పేర్కొన్నారు. రేపల్లె రైల్వేస్టేషన్‌లోనూ, విజయనగరంలోనూ ఇద్దరు పిల్లల తల్లి ఇంటిలోనే గ్యాంగ్ రేప్‌కు గురికావడం రాష్ట్రంలో నేర స్థితికి దర్పణమని ఆవేదన వ్యక్తం చేశారు. 2020 కంటే 2021లో మహిళలపై నేరాలు 25 శాతం పెరిగాయని, (14603-17736). 'నిర్భయ, దిశ' ప్రచారానికి పరిమితమయ్యాయని, అనేక మంది బాధిత మహిళలకు పునరావాస చర్యలు చేపట్టలేదని, మద్యం, మత్తు మందులు ఈ నేరాలు పెరగడానికి కారణమని అనేక సర్వేలు తెలుపుతున్నప్పటికీ వాటిని అరికట్టే చర్యలు ప్రభుత్వం చేపట్టలేదని పేర్కొన్నారు. గుజరాత్‌లో అదానీ పోర్టు, రాష్ట్రంలో అరకు ఏజెన్సీ మత్తుమందుల వ్యాపారులకు అడ్డాగా మారాయని వివరించారు. బెల్టు షాపులు పెరిగాయని అన్నారు. అన్ని రాజకీయ పక్షాలూ మహిళలపై హింసను నివారించడానికి ఏమి చేయనున్నాయో ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరచాలని ఇప్పటికే మహిళా సంఘాలు ప్రచారం నిర్వహిస్తున్నాయని వివరించారు. మహిళలపై దాడులను నివారించేందుకు నిపుణులతో కమిటీ వేయాలని కోరారు. దాడుల నివారణకు స్వచ్ఛంద సంస్థలను ఆహ్వానించి కార్యాచరణ రూపొందించాలన్నారు. చిన్నారులకు రక్షణ కల్పించే చట్టాలను కఠినంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల ద్వారా విచారణ జరిపించాలని, చెరుకుపల్లి మండలంలో అమరనాథ్ హత్య కేసు ఫాస్ట్ ట్రాక్‌కు అప్పగిస్తూ ఆదేశాలు జారీ చేయాలని కోరారు. ప్రభుత్వం మీడియా మానిటరింగ్ కమిటీ ఏర్పాటుచేయాలని, హింస, అశ్లీలత, అసమానతలను ప్రేరేపించే చలనచిత్రాలు, టివి సీరియల్స్, ఇంటర్‌నెట్ కార్యక్రమాలను నిషేధించాలని కోరారు. సోషల్ మీడియాలో ట్రోలింగ్‌లపై చర్యలు తీసుకోవాలని, బాలబాలికల మధ్య స్నేహపూర్వక అవగాహనను కల్పించాలని కోరారు. మద్యం, మత్తు మందులకు వ్యతిరేకంగా ప్రభుత్వం విస్తృత ప్రచారం చేపట్టాలన్నారు. నిర్బంధ విద్య 19 ఏళ్ల వరకూ పొడిగించాలన్నారు. ఒంటరి మహిళలు, వారి కుటుంబాల్లో పిల్లలకు అదనపు రక్షణ సదుపాయాలు ఏర్పాటు చేయాలని, అనాథ బాలలు, ఆడ పిల్లలు ఉన్న హాస్టళ్లలో గెస్ట్‌హౌస్‌లు ఉండరాదని, పురుష సిబ్బందిని ఉంచకూడదని కోరారు. పోలీసులకు జెండర్ సెన్సిటివిటీ పెంచడానికి క్రమబద్ధంగా శిక్షణ కార్యక్రమాలు ఉండాలన్నారు. సక్రమంగా లేని పోలీసు ఆఫీసర్లపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. పై సమస్యలు పరిష్కరించాలని కోరుతూ.. ఆగస్టు 8న విజయవాడలో భారీ మహిళా సభ నిర్వహించనన్నట్లు పేర్కొన్నారు.

కౌలు సమస్యలపై 3 నెలలకోసారి సమావేశం

- సిసిఎల్‌ఎ అధికారులకు కౌలు రైతు సంఘం వినతి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అన్నదాతలు ఎదుర్కొంటున్న సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు, క్షేత్రస్థాయి ఇబ్బందులను ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు వీలుగా ప్రతి మూడు నెలలకోసారి వ్యవసాయ, రెవెన్యూ, బ్యాంకర్లు, రైతు సంఘాలను భాగస్వామం చేస్తూ సమీక్షా సమావేశం నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆంధ్రప్రదేశ్ కౌలురైతు సంఘం డిమాండ్ చేసింది. రైతాంగ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళగిరిలోని సిసిఎల్‌ఎ కార్యాలయంలో శుక్రవారం సిసిఎల్‌ఎ సంయుక్త కార్యదర్శి ఎన్ ప్రభాకర్‌రెడ్డి, అసిస్టెంట్ కార్యదర్శి టి వేణుగోపాల్‌తో ఎపి కౌలురైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం హరిబాబు నేతృత్వంలోని ప్రతినిధుల బృందం భేటీ అయ్యింది. ఈ సందర్భంగా కౌలురైతు సంఘం నాయకులు మాట్లాడుతూ.. భూ యజమాని సంతకంతో సంబంధం లేకుండా గ్రామసభల ద్వారా పంట సాగు హక్కు పత్రాలు ఇవ్వాలని, (సిసిఆర్‌సి కార్డులు), భూ యజమాని సంతకం లేకపోయినా గ్రామ సచివాలయాల్లో కౌలురైతుల అర్జీలు స్వీకరించాలని సిసిఎల్‌ఎ అధికారులకు రైతు సంఘం నేతలు విజ్ఞప్తి చేశారు. భూ యజమాని సంతకం తప్పనిసరి అనే ఆప్షన్‌ను తీసేయాలని నేతలు కోరారు. ఆలయ భూములు సాగుచేసుకుంటున్న కౌలు రైతులు, ఇనామ్ భూములు సాగు చేస్తున్న వాస్తవ సాగుదారులకు వారి పేరుతోనే సిసిఆర్‌సి కార్డులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఆలయ భూములు వేలంపాటలో పాడుకుని కొంతమంది ఇతరులకు సబ్‌లీజుకు ఇస్తున్నారని, అలాంటి వారి పేరు మీదనే ఇ-క్రాప్ చేయాలని అన్నారు. లంక భూములకు లీజులను రెన్యువల్ చేసి వాస్తవ సాగుదారుల పేర్లను నమోదు చేయాలన్నారు. సిసిఆర్‌సి కార్డున్న ప్రతి రైతుకూ స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం పంటరుణాలు ఇవ్వాలని కార్డు లేనివారికి కూడా జెఎల్ గ్రూపుల ద్వారా ఇతోధికంగా రుణాలివ్వాలని కోరారు. కొన్ని బ్యాంకుల్లో ఎంత భూమి సాగు చేసినా, సిసిఆర్‌సి కార్డున్నా రూ.50 వేలకు మించి రుణాలు ఇవ్వకపోవడం అన్యాయమని, దానిని సరిదిద్దాలని అన్నారు. రుణాల రికవరికీ ఆ గ్రామ సచివాలయ సిబ్బందికి మండల రెవెన్యూలో ఒక అధికారిని, జిల్లా స్థాయిలో మరొక అధికారిని నియమించి సమన్వయంతో రుణాలు ఇప్పించేందుకు, రికవరీ చేసేందుకు ప్రత్యేక యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ భేటీలో కౌలురైతు సంఘం గుంటూరు, పశ్చిమగోదావరి, ఎన్‌టిఆర్ జిల్లాల కార్యదర్శులు బి శ్రీనివాసరావు, ఎం రామాంజనేయులు, సైదులు, బాపట్ల జిల్లా అధ్యక్షులు టి సురేష్, కృష్ణా జిల్లా కమిటీ సభ్యులు ఎం నాగేశ్వరరావు పాల్గొన్నారు.

బాలికపై సామూహిక అత్యాచారం

ప్రజాశక్తి - మండవల్లి (ఏలూరు జిల్లా)

బాలికపై సమీప బంధువే ఇతరులతో కలిసి సామూహిక అత్యాచారానికి పాల్పడిన ఘటన ఏలూరు జిల్లా మండవల్లి శుక్రవారం వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కృష్ణా జిల్లా పరిధిలోని నందివాడ మండలానికి చెందిన ఒక కుటుంబం చేపల చెరువుపై కాపలా ఉంటూ జీవనం సాగిస్తోంది. వారి కుమార్తె (10) హాస్టల్‌లో ఉంటూ సమీపంలోని జడ్‌పి హైస్కూల్లో ఐదో తరగతి చదువుతోంది. బాలికకు వరుసకు సోదరుడయ్యే కుటుంబం ఆ ప్రాంతంలోనే ఉండడంతో అప్పుడప్పుడు సోదరుని ఇంటికి వెళ్లేది. ఈ క్రమంలోనే సదరు ప్రబుద్ధుడు బాలికకు మాయమాటలు చెప్పి అత్యాచారానికి ఒడిగట్టాడు. అంతటితో ఆగకుండా సోదరుడి కుటుంబం అద్దెకు ఉంటున్న ఇంటి యజమానికి కుటుంబానికి చెందిన మరో బాలుడు (13), మరో లారీ డ్రైవర్ (45) గత నాలుగు నెలలుగా బాలికపై అఘాయిత్యానికి పాల్పడుతున్నారు. బాలిక అనారోగ్యంగా ఉండడంతో హాస్టల్ సిబ్బంది ఆరా తీయగా విషయం వెలుగుచూసింది. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. డిఎస్‌పి శ్రీనివాసులు బాలిక చదువుతున్న హాస్టల్‌ను, బాలికపై అఘాయిత్యానికి పాల్పడిన నివాసాన్ని పరిశీలించారు.

జీడిమామిడి గింజలను ఆర్‌బికెల ద్వారా కొనుగోలు చేయాలి

- సిఎంకు సిపిఎం లేఖ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

జీడిమామిడి గింజలను ఆర్‌బికెల ద్వారా కొనుగోలు చేసి రైతులను. కార్మికులను ఆదుకోవాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు కోరారు. ఈ మేరకు ముఖ్యమంత్రికి రాసిన లేఖను శుక్రవారం మీడియాకు విడుదల చేశారు. దేశంలో జీడిమామిడి సాగు విస్తీర్ణంలో (197.92 వేల హెక్టార్లు), ఉత్పత్తిలో (127.72 వేల టన్నులు) ఆంధ్రప్రదేశ్ రెండవ స్థానంలో ఉందని, జీడి పప్పు ప్రాసెసింగ్‌లోనూ కేరళ తరువాత స్థానం రాష్ట్రానిదేనని సిఎం దృష్టికి ఆయన తీసుకువచ్చారు. తొలుత తీర ప్రాంత జిల్లాల్లో సాగు చేస్తుండగా, అనంతర కాలంలో గిరిజన ప్రాంతాల్లోనూ సాగు పెరిగిందని వివరించారు. వాటిలో కొన్ని అటవీశాఖ వేసిన తోటలు కాగా ఎక్కువ భాగం గిరిజనులు, కొండవాలు ప్రాంతాల్లో దళితులు, ఇతర పేదలు సాగు చేస్తున్నవి గణనీయంగా ఉన్నాయని పేర్కొన్నారు. వీటిపై ఆధారపడిన ఐదు లక్షలకుపైగా రైతు కుటుంబాలను, లక్షన్నర మంది కార్మికులను ఆదుకునేందుకు జీడి పరిశ్రమకు చేయూతనివ్వడానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాల్సిన అవసరం ఎంతో ఉందని తెలిపారు. గతంలో రూ.15,000, 18,000 అమ్మిన 80 కిలోల జీడి గింజల బస్తా ధర గడచిన రెండుమూడేళ్లుగా దిగజారుతూ ప్రస్తుతం రూ.7,000 నుండి 8,000 మధ్యలో వుందని తెలిపారు. ధర ఘోరంగా పడిపోవడంతో జీడి గింజలు రైతుల ఇళ్లలోనే పేరుకుపోయాయని, ఆర్‌బికెల ద్వారా బస్తా రూ. 16,000 చొప్పున కొనుగోలు చేయాలని రైతులు ఆందోళనలు చేస్తున్నారని వివరించారు. 'విత్తు నుండి విక్రయం వరకూ అంతా ఆర్‌బికె ద్వారానే' అని ప్రకటించిన ప్రభుత్వం జీడి పంట విషయంలో ఆ ఊసెత్తకపోవడం ధర్మం కాదని పేర్కొన్నారు. కొన్నేళ్ల క్రితం జీడి గింజలను గిరిజన కార్పొరేషన్ కొనుగోలు చేసి, ప్రాసెస్ చేయించి మార్కెటింగ్ చేసిందని, ఇప్పుడు అది కూడా లేదని, రాష్ట్రంలో జీడి గింజలను ప్రభుత్వ సంస్థ ఏదీ కొనుగోలు చేయడం లేదని వివరించారు. జీడి గింజలపై ఐదుశాతంగా ఉన్న దిగుమతి సుంకాన్ని కేంద్ర ప్రభుత్వం 2018 ఫిబ్రవరి నుండి 2.5 శాతానికి తగ్గించిందని, జీడిపప్పు కనీస దిగుమతి ధర (మినిమమ్ ఇంపోర్ట్ ప్రైస్ ఎంఐపి) 2023 ఫిబ్రవరిలో సడలించి విచ్చలవిడి దిగుమతులకు తలుపులు బార్లా తెరిచి దేశీయ పరిశ్రమకు, రైతాంగానికి నష్టం కలిగిస్తోందని పేర్కొన్నారు. గత ఆరేడేళ్లుగా కేరళ ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం పంట విస్తీర్ణం, దిగుబడి పెంచడానికి వివిధ చర్యలు, పథకాలు చేపట్టిందని వివరించారు. పంట అభివృద్ధికి ప్రత్యేకంగా ఒక రాష్ట్ర స్థాయి బోర్డు, పరిశ్రమలకు అవసరమైన ముడి సరుకు సరఫరాకు , ఇతర రాష్ట్రాల్లో విదేశాలనుండి కొనుగోలు చేసేందుకు ఒక కార్పొరేషన్‌నే ఏర్పాటు చేసిందని, పరిశ్రమలను నిర్వహించడం, జీడిపప్పు మార్కెటింగ్ కోసం మరో రెండు వేర్వేరు కార్పొరేషన్లు కేరళలో ఉన్నాయని తెలిపారు. ఊఐఎ,ఊఐఇన్ని విధాలుగా అక్కడి ప్రభుత్వం రైతులకు, కార్మికులకు చేదోడుగా నిలుస్తోందని, ఒడిషా, మహారాష్ట్ర, కర్ణాటకల్లో పంట అభివృద్ధికి సంస్థ లేదా ప్రభుత్వ బోర్డులున్నాయని వివరించారు.

ఎపిలో మాత్రం ఉద్యానవన శాఖ అన్ని పంటలతోపాటే జీడి గురించి 'కూడా' పని చేస్తోందని తెలిపారు. ఇప్పటికైనా రాష్ట్రంలో జీడి రైతును, కార్మికులను ఆదుకునేందుకు, పరిశ్రమను నిలబెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణం రైతుల నుండి బస్తా జీడి గింజలను రూ. 16,000 ఆర్‌బికెల ద్వారా కొనుగోలు చేయాలని, జీడి పంటను రికార్డుల్లో నమోదు చేసి, పంట రుణాలు ఇవ్వాలని, బీమా వర్తింపజేయాలని కోరారు. జీడి పంట అభివృద్ధి, పరిశోధనకు వెంటనే ప్రభుత్వం ప్రత్యేక బోర్డు లేదా కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని సూచించారు. టిటిడితో సహా అన్ని దేవస్థానాలూ రాష్ట్రంలో ప్రాసెస్ చేసిన జీడి పప్పు మాత్రమే కొనుగోలు చేయాలని విజ్ఞప్తి చేశారు. దిగుమతి సుంకాన్ని తిరిగి ఐదుశాతానికి పెంచేలా, జీడిపప్పు ఎంఐపి సడలింపులు ఎత్తివేసేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని కోరారు.

ఆర్కే భార్య అరెస్టు

- విజయవాడలో దుడ్డు ప్రభాకర్..
- రాష్ట్రంలో ఎన్‌ఐఎ సోదాలు

ప్రజాశక్తి- టంగుటూరు, విజయవాడ

రాష్ట్రంలో ఎన్‌ఐఎ అధికారుల బృందం శుక్రవారం సోదాలు చేపట్టింది. ప్రకాశం జిల్లాలో మావోయిస్టు అగ్రనేత ఆర్కే భార్య శిరీషను, విజయవాడలో కుల నిర్మూలనా పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు దుడ్డు ప్రభాకర్‌ను అరెస్టు చేసింది. గత ఏడాది జులై 19న శిరీష స్వగ్రామం ప్రకాశం జిల్లా టంగుటూరు మండలం ఆలకూరపాడు గ్రామానికి ఎన్‌ఐఎ బృందం వచ్చింది. ఆ సమయంలో ఆమె ఇంట్లో లేకపోవడంతో వెనుదిరిగింది. సరిగ్గా ఏడాది తర్వాత మళ్లీ ఎన్‌ఐఎ అధికారులు వచ్చారు. నేరుగా శిరీష ఇంటి వద్దకు వెళ్లి ఆమెను అరెస్టుచేసి జీపులోకి ఎక్కించారు. అక్కడి నుంచి నేరుగా టంగుటూరు పోలీస్ స్టేషన్ వద్ద వాహనాలను ఆపినట్లే ఆపి జాతీయ రహదారిపైకి మళ్లించారు. ఈ అరెస్టుపై తమకు ఎలాంటి సమాచారమూ లేదని టంగుటూరు పోలీసులు తెలిపారు. విజయవాడ సింగ్‌నగర్‌లోని కుల నిర్మూలన పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు దుడ్డు ప్రభాకర్‌ను ఎన్‌ఐఎ అధికారులు అరెస్టు చేశారు. ఎటువంటి నోటీసు ఇవ్వకుండానే ఆయనను అరెస్టు చేసి నెంబర్ లేని వాహనాల్లో తరలించారు.

అక్రమ అరెస్టులపై ఖండన

అక్రమ అరెస్టులను విప్లవ రచయితల సంఘం నేత, ఆర్కే తోడల్లుడు జి.కల్యాణ్‌రావు, పౌర హక్కుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం.ఆంజనేయులు, విప్లవ రచయితల సంఘం అరసవిల్లి కృష్ణ, ఐఎఫ్‌టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.పోలారి, పిడిఎస్‌యు నాయకులు ఎ.రవిచంద్ర, కుల నిర్మూలన పోరాట సమితి జిల్లా అధ్యక్షులు శ్రీరాములు ఖండించారు.

నేతన్నలపై జగన్ నీతిలేని రాజకీయం

- టిడిపి ఎమ్మెల్సీ అనూరాధ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

నేతన్నలపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నీతిలేని రాజకీయం చేస్తున్నారని టిడిపి ఎమ్మెల్సీ పంచుమర్తి అనూరాధ విమర్శించారు. సబ్సిడీలు, స్వయం ఉపాధి రుణాలు, ప్రోత్సాహకాలు రద్దు చేసి బటన్ నొక్కి జీవితాలు మార్చేస్తున్నా అనడం సిగ్గుచేటని శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గతేడాది 81 వేల మందిని అర్హులుగా పేర్కొని, ఈసారి 80 వేల మందికి మాత్రమే ఇచ్చారని తెలిపారు. ఏడాదిలో వెయ్యి మగ్గాలు ఏమయ్యాయని ప్రశ్నించారు. జగన్ నాలుగేళ్ల పాలనలో వంద మందికిపైగా చేనేత కార్మికులు అప్పుల బాధతో ఆత్మహత్యలు చేసుకున్నారని తెలిపారు.

పోలవరం ప్రాజెక్టును సిఎం జగన్ గోదాట్లో ముంచేశారని టిడిపి నేత ధూళ్లిపాళ్ల నరేంద్రకుమార్ విమర్శించారు. కక్షపూరిత వైఖరి, కమీషన్ల కోసం నిర్మాణ పనులు చేస్తున్న ఏజెన్సీలను మార్చారని టిడిపి కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో విమర్శించారు. పోలవరం నిర్వాసితుల్ని ఆదుకోకుండా కొండలు, గుట్టలపాలు చేయడంతో వారు తెలంగాణకు వెళ్తామంటున్నారని తెలిపారు. ప్రత్యేక విమానాల్లో ఢిల్లీ వెళ్లడం తప్ప, పోలవరం నిర్మాణానికి కేంద్రం నుంచి జగన్ ఏం సాధించారని ప్రశ్నించారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్‌పై ప్రభుత్వం డిఫమేషన్ సూట్ వేయడం కక్షసాధింపేనని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య విమర్శించారు. ప్రశ్నించే గొంతుకను ప్రభుత్వం నొక్కుతుండటం చాలా దుర్మార్గని అన్నారు.

హైకోర్టు తీర్పు ప్రభుత్వానికి చెంపపెట్టు

- ఎపి చెరుకు రైతుల సంఘం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో సహకార రంగంలోని కో-ఆపరేటివ్ షుగర్ ఫ్యాక్టరీలను లిక్విడేట్ చేస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని హైకోర్టు తప్పుపడుతూ తీర్పును ఇవ్వడం రాష్ట్ర ప్రభుత్వానికి చెంపపెట్టులాంటిదని ఎపి చెరుకు రైతుల సంఘం పేర్కొంది. చిత్తూరు, రేణిగుంట, కడప, కోవూరు, జంపని (తెనాలి), అనకాపల్లి షుగర్ ఫ్యాక్టరీలను రాష్ట్ర ప్రభుత్వం లిక్విడేటర్‌లను నియమించడం చెల్లదని రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన తీర్పు పట్ల ఎపి చెరుకు రైతుల సంఘం హర్షం వ్యక్తం చేసింది. ఈ మేరకు శుక్రవారం సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కర్రి అప్పారావు, మర్రాపు సూర్యనారాయణ ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలోని పలు షుగర్ ఫ్యాక్టరీలను 2022లో రాష్ట్ర ప్రభుత్వం లిక్విడేట్ చేసిందని తెలిపారు. దీంతో రేణిగుంట ఫ్యాక్టరీ పరిధిలో చెరుకు రైతులు కోర్టులో కేసు వేస్తే హైకోర్టు రైతులకు అనుకూలమైన తీర్పు ఇచ్చిందని తెలిపారు. సహకార చట్టం ప్రకారం రైతుల జనరల్ బాడీ ఆమోదం లేకుండా ప్రభుత్వం లిక్విడేటర్లను నియమించడం చెల్లదని తీర్పు చెప్పడం రాష్ట్ర ప్రభుత్వానికి చెంపపెట్టు అని అన్నారు. సహకార ఫ్యాక్టరీలను పునరుద్ధరణ చేస్తామని ఎన్నికలకు ముందు వాగ్దానానికి భిన్నంగా రాష్ట్ర ప్రభుత్వం షుగర్ ఫ్యాక్టరీలను అమ్మకాలకు పెట్టిందని తెలిపారు. హైకోర్టు తీర్పుతోనైనా రాష్ట్ర ప్రభుత్వం షుగర్ ఫ్యాక్టరీల విషయంలో పునరాలోచన చేయాలని కోరారు. గతంలో చేసిన వాగ్దానం మేరకు కో-ఆపరేటివ్ షుగర్ ఫ్యాక్టరీలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.

మహిళా సంరక్షణ కార్యదర్శులను పోలీస్ విధుల్లో వినియోగించొద్దు

- డిజిపి కెవి రాజేంద్రనాథ్ రెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలోని గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న మహిళా సంరక్షణ కార్యదర్శులను రెగ్యులర్ పోలీసు విధుల్లోకి వినియోగించొద్దని రాష్ట్ర డిజిపి కెవి రాజేంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం రాష్ట్రంలోని పోలీస్ కమిషనరేట్లు, రేంజ్ డిఐజి, జిల్లా ఎస్‌పిలకు ఆదేశాలు జారీ చేశారు. గ్రామాల్లోని మహిళలు, చిన్నారులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించేందుకు ఇతర శాఖలతో సమన్వయం చేసుకుని వారికి కావాల్సిన పూర్తి సహాయ, సహకారాలు అందించడం మహిళా సంరక్షణ కార్యదర్శుల ముఖ్య ఉద్దేశమన్నారు. వీరిని పోలీస్ శాఖలోని సాధారణ విధులైన బందోబస్తు, రిసెప్షన్, శాంతి భద్రతలకు వినియోగించరాదని తెలిపారు. అలాగే వారిని తరచూ పోలీస్ స్టేషన్‌కు పిలిపించడం వంటివి ఎట్టి పరిస్థితుల్లో చేయకూడదని ఆదేశించారు. ఎక్కడైనా ఇందుకు విరుద్ధంగా మహిళా సంరక్షణ కార్యదర్శులను పోలీస్ స్టేషన్ విధులకు వినియోగించినట్లయితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రౌండ్ టేబుల్ సమావేశంలో అభివాదం చేస్తున్న నాయకులు, మేధావులు

'ఉక్కు' పరిరక్షణకు త్వరలో పాదయాత్రలు

- రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు

ప్రజాశక్తి - సీతమ్మధార (విశాఖపట్నం)

వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా మరింత ఉధృతంగా ఉద్యమించాల్సిన అవసరముందని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. నాడు స్టీల్‌ప్లాంట్ ఏర్పాటు కోసం ఎలాంటి ఉద్యమాలు, త్యాగాలు చేశారో, దానిని పరిరక్షించుకోవడానికి అదే తరహాలో కేంద్రంలోని మోడీ సర్కారుపై ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ క్రమంలోనే త్వరలో పాదయాత్రలు చేపట్టాలని నిర్ణయించారు. విశాఖ ఉక్కు కర్మాగారం ప్రయివేటీకరణపై నగరంలోని పౌర గ్రంథాలయంలో మేధావులు, డాక్టర్లు, లాయర్లు, పాత్రికేయుల రౌండ్ టేబుల్ సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌ను కావాలనే కేంద్ర ప్రభుత్వం నష్టాల్లోకి నెట్టేసి ప్రయివేటీకరణ చేయాలని కుట్ర పన్నిందన్నారు. దీనిలో భాగంగానే సొంత గనులను నేటికీ కేటాయించలేదని తెలిపారు. ప్లాంట్‌లోని బ్లాస్ట్ ఫర్నేస్‌లు మూతపడేలా చేస్తోందన్నారు. ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ మాట్లాడుతూ పాదయాత్రలు, కళారూపాలతో ఉక్కు ఉద్యమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. విశాఖలోని అన్ని వార్డుల్లో ఉక్కు పరిరక్షణ ప్రచారం మార్మోగాలని కోరారు. ప్రజా పోరాటాలతోనే పాలకులు వెనక్కు తగ్గుతారంటూ గతంలో జరిగిన పోరాటాలను ఉదహరించారు. ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ మాట్లాడుతూ ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లో రాష్ట్రంలోని ఎంపిలు స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణపై నోరు మెదపడం లేదని తెలిపారు. రైటర్స్ అకాడమీ చైర్మన్, లీడర్ సంపాదకులు వివి.రమణమూర్తి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఎన్ని పన్నాగాలు పన్నినా ఉక్కు కర్మాగారాన్ని కాపాడుకుని తీరుతామని స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరూ ఇంటింటికీ తిరిగి ప్రజలను చైతన్యపరిచి ఉక్కు ప్రాధాన్యతను తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ ఎం రాజశేఖర్, కో కన్వీనర్ జె.అయోధ్యరాం, మాజీ విసి జార్జ్ విక్టర్, బార్ అసోసియేషన్ సభ్యులు చింతపల్లి రాంబాబు, ఎపి హెచ్ఆర్ కౌన్సిల్ సభ్యులు సత్యనారాయణమూర్తి, న్యాయవాదులు విష్ణువర్ధన్, రామాంజనేయులు, నాయకులు పడాల రమణ, లాలా లజపతిరాయ్ పాల్గొన్నారు.

మహిళలకు తీవ్ర అవమానాలు

- తెలుగు యువత మహిళా అధ్యక్షులు అనిత

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మణిపూర్, ఆంధ్రప్రదేశ్‌లో మహిళలు తీవ్ర అవమానాలకు గురవుతున్నారని తెలుగు మహిళా రాష్ట్ర అధ్యక్షులు వంగలపూడి అనిత అన్నారు. మణిపూర్‌లో మహిళను అత్యంత హోరంగా అవమానించిన ఘటన సోషల్ మీడియా వేదికగా బయటకు వచ్చిందన్నారు. ఎపిలో మహిళలపై సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు పెట్టి వైసిపి నేతలు అవమానిస్తున్నారని విమర్శించారు. టిడిపి ఆధ్వర్యాన మహిళా ఆత్మగౌరవ దీక్ష విజయవాడలోని ధర్నా చౌక్‌లో శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా అనిత మాట్లాడుతూ.. రాష్ట్రంలో మహిళలపై 1.14 లక్షల నేరాలు, 490 దాడులు జరిగాయని తెలిపారు. ప్రశ్నిస్తే కేసులు, బూతులు, అవమానాలు ఎదుర్కోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయని పేర్కొన్నారు. మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ ఎక్కడ దాక్కుంటున్నారో అర్థం కావడం లేదన్నారు. సోషల్ మీడియాలో తమపై పోస్టులు పెట్టిన వాళ్ల ఇళ్లకు వెళ్లి దేహశుద్ధి చేయక తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి పీతల సుజాత, మాజీ ఎంపి కొనకళ్ల నారాయణ, ఎపి మహిళా సమాఖ్య ప్రధాన కార్యదర్శి పి దుర్గాభవాని, జనసేన నాయకులు రావి సౌజన్య, లోక్‌సత్తా నాయకులు మాలతి, టిడిపి నాయకులు ఆచంట సునీత, గద్దె అనూరాధ, తంగిరాల సౌమ్య, సుగుణమ్మ తదితరులు పాల్గొన్నారు.

'మణిపూర్'పై మౌనమేల?

మొదటి పేజి తరువాయి

సీతారామరాజు జిల్లాల్లో ఉద్యోగాలు లేక ఉన్నత చదువులు చదివిన గిరిజన యువత ఖాళీగా ఉన్నా స్పెషల్ డిఎస్‌సి తీసి వారికి న్యాయం చేయలేదన్నారు. ఎటువంటి ఉపాధి అవకాశాలూ కల్పించలేదని తెలిపారు. గిరిజనులకు వంద శాతం ఉద్యోగాలు కల్పించే జిఒ నెంబర్ 3 రద్దుపై రాష్ట్ర ప్రభుత్వం కనీసం స్పందించలేదన్నారు. ఆర్గానిక్ ఉత్పత్తులపై గొప్పలు చెప్పుకునే ప్రభుత్వాలు అరకు కాఫీ రైతులకు కనీస మద్దతు ధర చెల్లించడం లేదని విమర్శించారు.

పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం మాట్లాడుతూ విశాఖ భూ కుంభకోణాలపై వేసిన రెండు సిట్‌ల నివేదికలనూ ప్రభుత్వం బయట పెట్టాలని డిమాండ్ చేశారు. భూములను లూటీ చేసిన వారిలో ధర్మాన ప్రసాదరావు లాంటి పెద్దలున్నారని విమర్శించారు. ఇటీవల విశాఖపట్నం ఎంపి ఎంవివి సత్యనారాయణ కుటుంబం కిడ్నాప్‌కు గురైనా ప్రభుత్వం కళ్లు తెరవలేదన్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో స్మార్ట్ విలేజీ ఉద్యోగాల పేరుతో బిజెపి నేతలు నిరుద్యోగులను దోచుకున్నారని, మాజీ ఎమ్మెల్సీ మాధవ్ హస్తం కూడా దీనిలో ఉందని, ఈ వ్యవహారమంతా కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు కూడా తెలుసని వార్తలు వచ్చాయని గుర్తు చేశారు. ప్రభుత్వం బాధ్యత తీసుకుని నిరుద్యోగులకు న్యాయం చేయాలని, డబ్బులను వెనక్కు ఇప్పించాలని డిమాండ్ చేశారు. అదానీ గంగవరం పోర్టు యాజమాన్యం కార్మికుల శ్రమను దోచుకుంటోందని విమర్శించారు. ఈ సమావేశంలో పార్టీ విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు పాల్గొన్నారు.

గిరిజనుడిపై దాడి ఘటనలో ఆరుగురి అరెస్టు

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలులో గిరిజన యువకుడిపై దాడి, మూత్రం పోసిన ఘటనలో ఆరుగురిని అరెస్ట్ చేశామని, మిగతా ముగ్గురి కోసం ప్రత్యేక బృందాలను నియమించామని, త్వరలోనే అరెస్టు చేస్తామని హోం మంత్రి తానేటి వనిత తెలిపారు. ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి ఎంపి ల్యాడ్స్ కింద రూ.రెండు కోట్లతో ఒంగోలు జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్మించిన పోలీసు కల్చరల్ యాక్టివిటీస్ బిల్డింగ్, గెస్ట్‌హౌస్‌ను శుక్రవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడారు. బాధిత గిరిజన యువకుడికి పోలీసుశాఖ, ప్రభుత్వం అన్ని విధాల అండగా ఉంటాయని భరోసానిచ్చారు. ఫ్రెండ్లీ పోలీసింగ్, సేవా దృక్పథంతో సమాజానికి పోలీసులు అండగా నిలుస్తున్నారని తెలిపారు. ప్రజలకు సేవలందించడానికి పోలీసు శాఖ నిత్యం అందుబాటులో ఉంటుందన్నారు. కార్యక్రమంలో మంత్రి ఆదిమూలపు సురేష్, జడ్‌పిచైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, గుంటూరు రేంజ్ ఐజి జి.పాలరాజు, కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్, ఎస్‌పి మలికా గర్గ్ తదితరులు పాల్గొన్నారు.

వాల్తేరు డిఆర్‌ఎంగా సౌరవ్ ప్రసాద్ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ

ఈస్ట్ కోస్ట్ రైల్వేలోని వాల్తేరు డివిజనల్ రైల్వే మేనేజర్‌గా సౌరవ్ ప్రసాద్ శుక్రవారం సాయంత్రం డిఆర్‌ఎం ప్రధాన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. రైల్వే సర్వీసెస్ ఆఫ్ మెకానికల్ 1991 బ్యాచ్‌కి చెందిన ఆయన గతంలో పశ్చిమ మధ్య రైల్వే, కొంకన్ రైల్వేలలో పని చేశారు సెంట్రల్ రైల్వేస్‌లో పలు ప్రాజెక్టుల నిర్మాణాలలో ఆయనకు అనుభవం ఉంది. సెంట్రల్ రైల్వే చీఫ్ రోలింగ్ స్టాక్ ఇంజనీర్‌గా పని చేస్తూ బదిలీపై వాల్తేర్ డివిజన్‌కు వచ్చారు. ముంబయి నుంచి వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను ప్రారంభించిన ఘనత సౌరభ్ ప్రసాద్‌కు ఉంది. పశ్చిమ రైల్వేలో ముంబయికి అదనపు డివిజనల్ రైల్వే మేనేజర్‌గానూ వ్యవహరించారు.

అక్కడి సబర్బన్ స్టేషన్ల అప్‌గ్రేడేషన్, సుందరీకరణకు ప్రాధాన్యత ఇచ్చారు. బాధ్యతల స్వీకరణ సందర్భంగా పూర్వ డిఆర్‌ఎం అనూప్ సత్పతి ఆయనను అభినందించారు.

మణిపూర్ అమానుషంపై సర్వత్రా నిరసనలు

- మహిళలను వివస్త్రలను చేసిన వారిని కఠినంగా శిక్షించాలి
- రాష్ట్ర వ్యాప్తంగా ఐద్వా, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆందోళనలు

విశాఖలోని జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న ప్రజా సంఘాల నాయకులు

ప్రజాశక్తి-యంత్రాంగం

మణిపూర్‌లో ఇద్దరు మహిళలను వివస్త్రలను చేసి ఊరేగించడాన్ని ఖండిస్తూ ఐద్వా, సిఐటియు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం నిరసనలు తెలిపారు. మణిపూర్ మారణహోమాన్ని ఆపాలని, కేంద్ర ప్రభుత్వం మౌనం వీడాలని, మహిళలపై అమానుషకాండకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ... అల్లర్లతో మణిపూర్ అట్టుడుకుతుంటే ప్రధాని మోడీ స్పందించకపోవడం శోచనీయమన్నారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి, దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. విజయనగరంలో సిఐటియు ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె.సుబ్బరావమ్మ మాట్లాడుతూ.. దేశం తలదించుకునే విధంగా దేశంలో బిజెపి పాలన సాగుతోందన్నారు. అత్యంత దారుణంగా మహిళలను నగ్నంగా ఊరేగించి, వారిపై అత్యాచారం చేసి, హత్య చేయడం బిజెపి నియంతృత్వ పాలనకు నిదర్శనమని అన్నారు. అత్యంత పాశవికమైన చర్య పట్ల మోడీ నోరు మెదపకపోవడం దారుణమన్నారు. వెంటనే మణిపూర్ రాష్ట్ర ముఖ్యమంత్రిని పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. విజయనగరంలోని రామకృష్ణా నగర్ నుంచి రాజీవ్ నగర్ కాలనీ వరకు ప్రదర్శన చేశారు. కర్నూలులో గాంధీ విగ్రహం వద్ద కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. నందికొట్కూరులో మణిపూర్ సిఎం దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. నంద్యాలలో అంబేద్కర్ విగ్రహం వద్ద ధర్నా చేశారు. నెల్లూరు బాలాజీనగర్‌లోని సిపిఎం కార్యాలయం నుంచి జ్యోతిరావ్‌పూలే విగ్రహం వరకు ర్యాలీ చేశారు. ఆత్మకూరు బస్టాండ్ నుంచి సత్రం సెంటర్ వరకూ నిరసన ప్రదర్శన చేపట్టారు.

విశాఖలోని జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. తిరుపతిలోని కొర్లగుంటలో ధర్నా చేశారు. ప్రకాశం జిల్లా బాపట్లలో విద్యార్థినులు నిరసన తెలిపారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలోని సుందరయ్య నగర్‌లో ప్లకార్డులు పట్టుకుని నిరసన తెలిపారు.

విజయవాడ లెనిన్ సెంటర్‌లో నిర్వహించిన ధర్నాలో ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి మాట్లాడుతూ మణిపూర్‌లో అల్లర్లను అదుపుచేయడంలో మోడీ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని తెలిపారు. ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యు రాష్ట్ర కార్యదర్శి దుర్గా భవాని, పిఒడబ్ల్యు రాష్ట్ర అధ్యక్షురాలు గంగాభవాని తదితరులు పాల్గొన్నారు.

25న మణిపూర్ సంఘీభావ సభలు

- ప్రజా సంఘాలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మణిపూర్ మారణహోమాన్ని ఖండిస్తూ ఈనెల 25న గ్రామ గ్రామాన సంఘీభావ ప్రదర్శనలు, సభలు నిర్వహించనున్నట్లు సిఐటియు, ఎపి రైతు సంఘం, ఎపి కౌలు రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘాలు తెలిపాయి. అఖిల భారత కమిటీల పిలుపులో భాగంగా ఈ కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి వెంకటేశ్వర్లు, ఎపి రైతు సంఘం ప్రధాన కార్యదర్శి కె ప్రభాకరరెడ్డి, సిఐటియు ప్రధాన కార్యదర్శి సిహెచ్ నరసింగరావు, ఎపి కౌలు రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం హరిబాబు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఉమ్మడిగా ప్రకటన విడుదల చేశారు. ప్రపంచం ముందు భారత పరువు తీసే విధంగా జరిగిన హత్యాకాండను నిరోధించడంలో అక్కడి బిజెపి ప్రభుత్వం వైఫల్యం చెందిందని అన్నారు.

పోలీసుల సమక్షంలోనే గిరిజన తెగకు చెందిన మహిళలపై మరో తెగకు చెందిన ముష్కరులు దౌర్జన్యం చేసి అత్యాచారానికి తెగబడ్డా, కనీస చర్యలు తీసుకునేందుకు మణిపూర్ ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తోందని పేర్కొన్నారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తే చర్యలు తీసుకుంటారా? మేము తీసుకోవాలా అని ప్రశ్నించారంటే పరిస్థితి ఎంత ఘోరంగా ఉందో అర్థం చేసుకోవచ్చని వారు పేర్కొన్నారు. ఇప్పటికే 150 మంది చనిపోయారని, 50 వేలమంది పునరావాస శిబిరాల్లో ఉన్నారని తెలిపారు. ఈ మొత్తానికి కేంద్ర బిజెపి సర్కారు వైఫల్యమే కారణమని తెలిపారు.

35 మంది విద్యార్థినులకు అస్వస్థత

ప్రజాశక్తి - మందస, పలాస (శ్రీకాకుళం)

మలేరియా నివారణకు ఇచ్చిన క్లోరోక్విన్ మాత్రలు వికటించి 35 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. ఈ ఘటన శ్రీకాకుళం జిల్లా మందస మండలం బుడంబో గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో శుక్రవారం చోటుచేసుకుంది.

మలేరియా ప్రభావిత ప్రాంతం కావడంతో ఆశ్రమ పాఠశాలలో మూడు నుంచి పదో తరగతి వరకు చదువుతున్న 66 మంది బాలికల్లో 35 మందికి క్లోరోక్విన్ మాత్రలను పంపిణీ చేశారు. ట్యాబ్లెట్ వేసుకున్న కొద్దిసేపటికే విద్యార్థినులందరూ తీవ్ర అస్వస్థతకు గురుయ్యారు. దీంతో వీరందరినీ బుడంబో ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ఎనిమిదో తరగతి విద్యార్థిని సవర జ్యోత్స్నకు ఫిట్స్ లక్షణాలు రావడంతో మెరుగైన వైద్యం కోసం పలాస

ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రస్తుతం విద్యార్థినులందరి పరిస్థితి నిలకడగా ఉంది. సమాచారం తెలుసుకున్న ఎంపిపి సభ్యులు డొక్కరి దానయ్య, జడ్‌పిటిసి సభ్యులు సవర చంద్రమ్మ, తహశీల్దార్ పాపారావు, ఎంపిడిఒ వి.తిరుమలరావు, ఎంఇఒ ఎం.లక్ష్మణరావు, సర్పంచ్ సవర సంధ్యారాణి పిహెచ్‌సికి వెళ్లి విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు.

'పట్టిసీమ' ట్రయల్ రన్

ప్రజాశక్తి - పోలవరం

పట్టిసీమ ఎత్తిపోతల పథకం నుంచి కృష్ణా డెల్టాకు సాగునీటిని విడుదల చేసేందుకు జలవనరుల శాఖ అధికారులు సన్నాహాలు ప్రారంభించారు. శుక్రవారం ట్రయల్ రన్ కూడా నిర్వహించారు.

పట్టిసీమ నుంచి కృష్ణా, పశ్చిమ డెల్టాలకు పోలవరం కుడి కాలువ ద్వారా సాగునీటి పంపిణీకి రంగం సిద్ధం చేస్తున్నారు. గోదావరి నీటిమట్టం 14 మీటర్లకు పైబడి ఉండడంతో ట్రయల్ రన్ నిర్వహించామని పట్టిసీమ ఎత్తిపోతల పథకం డిఇ పెద్దిరాజు, జెఇ శ్రీలక్ష్మి తెలిపారు.

పర్యావరణాన్ని పరిరక్షిద్దాం.. ఆదివాసీలను రక్షిద్దాం

- గిరిజన అధికార రాష్ట్రీయ మంచ్ జాతీయ చైర్మన్ మిడియం బాబూరావు

ప్రజాశక్తి కురుపాం /గుమ్మలక్ష్మీపురం (పార్వతీపురం మన్యం జిల్లా)

'పర్యావరణాన్ని పరిరక్షిద్దాం... ఆదివాసీలను రక్షిద్దాం' అనే నినాదంతో ఆగస్టు 9న జరగబోయే ప్రపంచ ఆదివాసీ దినోత్సవం వేడుకలకు సిద్ధమవుతున్నట్లు ఆదివాసీ అధికార రాష్ట్రీయ మంచ్ జాతీయ చైర్మన్, మాజీ ఎంపి మిడియం బాబూరావు తెలిపారు. పార్వతీపురం మన్యం జిల్లా కురుపాంలో జరుగుతున్న ఎపి గిరిజన సంఘం ఏడో జిల్లా మహాసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బాబూరావు విలేకరులతో మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం నూతన చట్టాలను తీసుకొచ్చి ఆదివాసీ గిరిజన జీవన విధానంపై తీవ్రంగా దాడి చేస్తోందన్నారు. ప్రయివేట్ కంపెనీలకు ఇష్టారాజ్యంగా అనుమతులిస్తూ తరతరాల నుంచి అడవినే నమ్ముకుని జీవనం సాగిస్తున్న ఆదివాసీ గిరిజనులను బాక్సైట్ తవ్వకాల పేరుతో దూరం చేస్తున్నారని తెలిపారు. గిరిజనులకు వెన్నుముకగా ఉన్న జిఒ 3ను రద్దు చేసి ఉద్యోగ అవకాశాలు లేకుండా చేసిందని, 1/70 చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయడం లేదని పేర్కొన్నారు. గిరిజనుల అభివృద్ధి కోసం ఏర్పడ్డ ఐటిడిఎ, జిసిసి సంస్థలకు నిధుల్లేక అభివృద్ధి కుంటుపడిందన్నారు. అటవీ హక్కు, పీసా, ఉపాధి హామీ చట్టాలను ఎత్తివేసేందుకు కేంద్ర ప్రభుతం రంగం సిద్ధం చేస్తోందని విమర్శించారు. ఆదివాసీల వల్ల పర్యావరణం దెబ్బతింటుందని ప్రభుత్వం అనడం సరికాదన్నారు. ప్రభుత్వాలు కార్పొరేట్ కంపెనీలకు ఇష్టారాజ్యంగా అనుమతులిచ్చి అడవి నుంచి గిరిజనులను దూరం చేసేందుకే కుట్రలో భాగంగానే ఇటువంటి తప్పుడు ప్రకటనలు చేస్తోందని అన్నారు. మైనింగ్, గ్యాస్ తవ్వకాలతో పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుందని తెలిపారు. అటవీ సంరక్షణ, పరిరక్షణ సవరణ చట్టాన్ని పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. ఈ చట్టాలను ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. 1994 నుంచి ఆదివాసీ దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని, ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ఆదివాసీలంతా ఇందులో భాగస్వాములవుతున్నారని తెలిపారు. సమావేశంలో ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా నాయకులు బిడ్డిక అప్పారావు, సీదర అప్పారావు, మండంగి రమణ పాల్గొన్నారు.

జూనియర్ కాలేజీల్లో సమస్యలపై 24న రాష్ట్ర వ్యాప్త నిరసనలు : ఎస్‌ఎఫ్‌ఐ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో జూనియర్ కాలేజీలలో సమస్యలను పరిష్కరించాలని ఈ నెల 24న రాష్ట్ర వ్యాప్తంగా నిరసన దీక్షలు చేపట్టనున్నట్లు ఎస్‌ఎఫ్‌ఐ పేర్కొంది. శుక్రవారం విజయవాడలోని బాలోత్సవ్ భవన్‌లో జులై 24న జరిగే 8 గంటల దీక్షలను జయప్రదం చేసేందుకు ప్రచురించిన పోస్టరును ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షులు కె ప్రసన్నకుమార్, రాష్ట్ర సహాయ కార్యదర్శి సిహెచ్ వెంకటేశ్వరరావు, రాష్ట్ర నాయకులు ఎం సోమేశ్వరరావు, మన్మథ, కుమారస్వామి, రాజ్‌కుమార్ తదితరులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రసన్న కుమార్ మీడియాతో మాట్లాడుతూ.. ఇంటర్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని, కాలేజీలలో మౌలిక సదుపాయాలు కల్పించాలని పలు సందర్భాల్లో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా స్పందించడం లేదని విమర్శించారు. జూనియర్ కళాశాలలు ప్రారంభమై 49 రోజులైనా ప్రభుత్వం నేటికీ ఇంటర్మీడియట్ విద్యార్థులకు కనీసం పాఠ్య పుస్తకాలను కూడా అందించలేక పోయిందన్నారు. పాఠ్యపుస్తకాలు లేకుండా చదువులు ఎలా ముందుకు సాగుతాయో ప్రభుత్వం చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని జూనియర్ కాలేజీలలో 3,000 అధ్యాపక పోస్టులు ఖాళీగా ఉన్నాయని అన్నారు. ఈ నాలుగేళ్లలో ప్రభుత్వం ఒక్క పోస్టు కూడా భర్తీ చేయలేదని విమర్శించారు. పుస్తకాలు, అధ్యాపకుల కొరతతో గతేడాది ఇంటర్‌లో కేవలం 36 శాతం ఉత్తీర్ణత నమోదైందని అన్నారు. ఇంటర్ విద్యార్థులకు గత ప్రభుత్వం తీసుకొచ్చిన మధ్యాహ్న భోజన పథకాన్ని రద్దు చేయడం సరికాదన్నారు. తక్షణం జూనియర్ కాలేజీల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించాలని డిమాండ్ చేశారు. 24న జరిగే నిరసన దీక్షల్లో విద్యార్థులు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

కులమతాలకు అతీతంగా అభివృద్ధి

- యువగళం పాదయాత్రలో లోకేష్

ప్రజాశక్తి - కనిగిరి (ప్రకాశం జిల్లా)

టిడిపి అధికారంలోకి వస్తే కుల, మత, ప్రాంతాలకు అతీతంగా అభివృద్ధి చేస్తామని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ తెలిపారు. యువగళం పాదయాత్రలో భాగంగా శుక్రవారం కనిగిరి మండలంలోని యడవల్లి క్రాస్‌రోడ్డు వద్ద కమ్మ సామాజిక తరగతి ప్రతినిధులతో ఆయన ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ.160 రోజులుగా అన్ని సామాజిక తరగతుల ప్రజలను పాదయాత్రలో కలిసి వారి కష్టాలను తెలుసుకున్నానన్నారు. కులం పేరుతో రాజకీయం చేస్తూ రాష్ట్రాన్ని జగన్ నాశనం చేస్తున్నాడని విమర్శించారు. అసంబద్ధమైన నిర్ణయాలతో రాష్ట్ర ప్రజలను ఇబ్బందులు పెడుతున్నారని, అందులో భాగమే ఎన్‌టిఆర్ హెల్త్‌యూనివర్సిటీ పేరు మార్పు అని తెలిపారు. కక్ష సాధింపులకు పాల్పడుతున్న వారి వివరాలను రెడ్‌బుక్‌లో రాస్తున్నానని, తప్పక వారిలెక్క సరిచేసి గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. కనిగిరి ప్రజల దాహార్తి తీర్చేలా చర్యలు చేపట్టకపోతే 2029లో జరిగే ఎన్నికలకు ఈ ప్రాంతానికి తాను రానని ప్రకటించారు. వలసల నివారణ కోసం పరిశ్రమలను తీసుకువచ్చేందుకు పాటుపడతానన్నారు. పాదయాత్రలో మార్కాపురం నియోజకవర్గం పెద్దారికట్ల గ్రామస్తులు లోకేష్‌ను కలిసి తమ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. తాగునీటిలో ఫ్లోరైడ్ అధికంగా ఉండడంతో తాము కిడ్నీ సంబంధిత వ్యాధులతో బాధపడుతున్నామని వివరించారు. గత టిడిపి ప్రభుత్వ హయాంలో ఎన్‌టిఆర్ సుజల పథకం ద్వారా గ్రామాల్లో స్వచ్ఛమైన తాగునీరు అందించామని, మళ్లీ టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే వాటర్ గ్రిడ్ ద్వారా ప్రతి ఇంటికీ కుళాయి కనెక్షన్ ఇచ్చి తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని లోకేష్ హామీ ఇచ్చారు. కనిగిరి నియోజకవర్గం నుంచి మార్కాపురంలోకి పాదయాత్ర ప్రవేశించింది. కార్యక్రమంలో కనిగిరి నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జ్ డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

కమ్మ సామాజిక ప్రతినిధుల ముఖాముఖిలో మాట్లాడుతున్న లోకేష్

రూ.2 లక్షల కోట్ల సంపద ఆవిరి

సెన్సెక్స్ 888 పాయింట్ల పతనం

లాభాల స్వీకరణతో భారీ నష్టాలు

ముంబయి : వరుసగా ఆరు రోజులుగా ర్యాలీ చేసిన దేశీయ స్టాక్ మార్కెట్లు గురువారం కుప్పకూలాయి. లాభాల స్వీకరణతో సెన్సెక్స్, నిఫ్టీలు భారీ నష్టాలు చవి చూశాయి. ఒక్క పూటలోనే రూ.2 లక్షల కోట్ల మదుపర్ల సంపద ఆవిరయ్యింది. ఇన్ఫోసిస్, రిలయన్స్, టిసిఎస్, హిందుస్థాన్ యూనిలీవర్ తదితర ప్రధాన సూచీలు అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. ఈ నేపథ్యంలో బిఎస్‌ఇ సెన్సెక్స్ 888 పాయింట్లు లేదా 1.3 శాతం పతనమై 66,684కు పడిపోయింది. ఇంట్రాడేలో ఏకంగా 1,000 పాయింట్లు నష్టపోయింది. ఎన్‌ఎస్‌ఇ నిఫ్టీ 234 పాయింట్లు లేదా 1.17 శాతం కోల్పోయి 19,745 వద్ద ముగిసింది. ఇన్ఫోసిస్ షేర్ ఏకంగా 7.7 శాతం నష్టపోయింది. హిందుస్థాన్ యూనిలీవర్ 3.65 శాతం, హెచ్‌సిఎల్ టెక్నాలజీ 3.33 శాతం, రిలయన్స్ ఇండస్ట్రీస్ 3.19 శాతం, విప్రో 3.07 శాతం చొప్పున అధికంగా నష్టపోయిన వాటిలో ముందు వరుసలో ఉన్నాయి. బిఎస్‌ఇ మిడ్‌క్యాప్ 0.26 శాతం, స్మాల్ క్యాప్ 0.13 శాతం చొప్పున తగ్గాయి. నిఫ్టీలో ఐటి సూచీ ఏకంగా 4 శాతం పతనాన్ని చవి చూసింది. ఎఫ్‌ఎంసిజి 1 శాతం నష్టపోయింది. పిఎస్‌యు బ్యాంకింగ్, మీడియా, ఆటోమొబైల్ సూచీలు 0.5 శాతం మేర పెరిగాయి.

ఒక్క మాటతో మస్క్‌కు లక్షల కోట్ల దెబ్బ

అమెరికాలోని దిగ్గజ ఇవి కార్ల తయారీ సంస్థ టెస్లా అధినేత ఎలన్ మస్క్ మాట్లాడిన ఒక్క మాటా ఆయనకు లక్షల కోట్ల నష్టాన్ని తెచ్చి పెట్టింది.

టెస్లా కార్ల ధరలను తగ్గిస్తామని మస్క్ చేసిన ప్రకటనతో గురువారం నాస్‌డాక్‌లో ఆ కంపెనీ షేర్లు 9.7 శాతం పతనమై 262.90 డాలర్లకు పడిపోయాయి. దీంతో మస్క్ వ్యక్తిగత సంపద 20.3 బిలియన్ డాలర్లు ఆవిరయ్యింది. భారత కరెన్సీలో ఈ విలువ రూ.1.65 లక్షల కోట్లుగా ఉంటుంది.

మణిపూర్ మారణకాండపై జనకవనం : సాహితీస్రవంతి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

దేశంలో మతోన్మాదం పెట్రేగి మణిపూర్ అగ్నిగుండంగా మారిందని, సాహితీ స్రవంతి గౌరవాధ్యక్షులు తెలకపల్లి రవి, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కెంగార మోహన్, కె సత్యరంజన్ తెలిపారు.

దేశం ప్రమాదంలో పడిన సందర్భంగా కవులందరూ ఏకమై నిరసన వ్యక్తం చేయాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా జనకవనం, నిరసన సభలు నిర్వహించాలని రాష్ట్ర కమిటీ నిర్ణయించిందన్నారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాల బాధ్యులు, డివిజన్ కేంద్రాలు, ప్రాంతీయ కమిటీలు సభలు నిర్వహించి నిరసనలు తెలపాలని పిలుపునిచ్చారు.

తిరుమలలో కొనసాగుతున్న భక్తుల రద్దీ

ప్రజాశక్తి -తిరుమల

తిరుమలలో సందర్శకుల రద్దీ కొనసాగుతోంది. కంపార్ట్‌మెంట్లన్నీ నిండిపోయాయి. బాట గంగమ్మ ఆలయం వరకూ క్యూలైన్లలో బారులు తీరి ఉన్నారు. సర్వ దర్శనం టోకెన్లు ఉన్నవారు శ్రీవారిని దర్శించుకోవడానికి 24 గంటల సమయం పడుతోంది.

గురువారం 63,628 మంది సందర్శకులు శ్రీవారిని దర్శించుకున్నారు. 33,548 మంది తలనీలాలను సమర్పించుకున్నారు. హుండీ ద్వారా రూ. 4.26 కోట్లు ఆదాయం టిటిడికి వచ్చింది. అక్టోబర్‌కు సంబంధించిన రూ.300 శ్రీవారి ప్రత్యేక దర్శనం టికెట్ల కోటాను ఈ నెల 25వ తేదీన టిటిడి విడుదల చేయనుంది.

ధవళేశ్వరానికి వరద ఉధృతి

- మొదటి ప్రమాదస్థాయికి చేరులో ప్రవాహం
- భద్రాచలం వద్ద తగ్గుముఖం
- మెదటి ప్రమాద హెచ్చరిక ఉపసంహరణ
- పునరావాస కేంద్రాలకు లంక ప్రజలు

ఒడిశాకు వెళ్లాల్సిన వారిని పడవల్లో తరలిస్తున్న అధికారులు

ప్రజాశక్తి - యంత్రాంగం

ఎగువున కురుస్తున్న వర్షాల నేపథ్యంలో గోదావరి నది ఇంకా ఉధృతంగా ప్రవహిస్తోంది. ధవళేశ్వరంలోని కాటన్‌బ్యారేజీ వద్ద మొదటి ప్రమాద స్థాయికి చేరువలో ప్రవాహం కొనసాగుతోంది. భద్రాచలంలో శుక్రవారం సాయంత్రానికి వరద స్వల్పంగా తగ్గుముఖం పట్టింది. అక్కడ ప్రస్తుతం 40.70 అడుగుల నీటి మట్టం నమోదైంది. దీంతో మొదటి ప్రమాద హెచ్చరికను అధికారులు ఉపసంహరించారు. పోలవరం వద్ద 30.05 మీటర్ల నీటిమట్టం నమోదైంది. వరదతో దేవీపట్నం మండలం ఇంకా ముంపులోనే ఉంది. భద్రాచలం వద్ద వరద తగ్గుముఖం పట్టింది. ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ వద్ద నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. ప్రస్తుతం 11.70 అడుగులకు నీటి ప్రవాహం చేరుకుంది. దీంతో బ్యారేజీకి చెందిన 175 గేట్లను 0.4 మీటర్ల మేర పైకెత్తి 9,84,087 క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. ఈ రాత్రికి మొదటి ప్రమాదహెచ్చరికను జారీ చేసే అవకాశం ఉందని,ప్రవాహం మరింత పెరిగి తరువాత క్రమంగా తగ్గే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర కోనసీమ జిల్లా పి.గన్నవరంలోని అప్పనిరాములంక కాజ్‌వేపైకి నీరు చేరింది. వరద ఉధృతి కారణంగా కె.గంగవరం మండలం కోటిపల్లి రేవును మూసివేశారు.

16 గ్రామాలకు నిలిచిన రాకపోకలు

ఏలూరు జిల్లాలోని వేలేరుపాడు మండలంలో రుద్రమ్మకోట, వసంతవాడ, కన్నాయిగుట్ట, కొయిదా, వేలేరుపాడు, రేపాకగొమ్ము, బోళ్లపల్లి, యడవల్లి మధ్య దాదాపు 16 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. కుక్కునూరు మండలంలో గొమ్ముగూడెం గ్రామస్తులను ఇప్పటికే రావికుంట పునరావాస కాలనీకి తరలించారు. జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, ఎస్‌పి మేరీ ప్రశాంతి, జెసి లావణ్య, ఇతర జిల్లా అధికారులు వేలేరుపాడు మండలంలో పర్యటించి ఎంఇఒ కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. పశ్చిమగోదావరి జిల్లా ఆచంట మండలం కోడేరు వద్ద గోదావరి వరద ఉధృతి క్రమేపీ పెరుగుతోంది. యలమంచిలి మండలంలోని లోతట్టు ప్రాంతమైన కనకాయలంక గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారైన కాజ్‌వే పూర్తిగా వరద నీటిలో మునిగిపోయింది.

ఒడిశాకు రవాణా బంద్

మరోవైపు చింతూరు వద్ద శబరి నది నీటిమట్టం 33.7 అడుగులకు చేరింది. అల్లూరి సీతారామరాజు జిల్లాలోని కొయగురు వాగు పొంగడంతో వంతెన నీట మునిగింది. జాతీయ రహదారి-30 మీదుగా నీరు ప్రవహిస్తుండటంతో ఒడిశా వెళ్లాల్సిన లారీలన్నింటినీ ఎర్రంపేటలో నిలిపివేశారు. ఆంధ్ర నుంచి ఒడిశాకు అత్యవసర ప్రయాణాలు ఉన్నవారిని, ఆరోగ్య సమస్యలు ఉన్నవారిని అధికారులు నాటు పడవలపై పంపిస్తున్నారు. రెండు రోజులుగా జలదిగ్బంధంలో చిక్కుకున్న ఎటపాక మండలం వీరాయిగూడెం గ్రామాన్ని అధికారులు పట్టించుకోలేదని గ్రామస్తులు ఆరోపించారు. జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ మండలాల్లో పర్యటిస్తూ అధికారులను అప్రమత్తం చేశారు. గోదావరి చుట్టుముట్టిన విఆర్.పురం మండలం శ్రీరామగిరి, ఒడ్డుగూడెం గ్రామాలను సిపిఎం నాయకులు బోటులో వెళ్లి సందర్శించారు.

మునేరుకు వరద ప్రవాహం

ఎన్‌టిఆర్ జిల్లా కీసర వద్ద మునేరు వరద ప్రవాహం భారీగా పెరిగింది. కీసర బ్రిడ్జి వద్ద ఐదు మీటర్ల మేర వరద ప్రవాహం ఉందని సిడబ్ల్యుసి అధికారులు తెలిపారు.

VIJAYAWADA MUNICIPAL CORPORATION

'E' Procurement Notice No. 18/VMC/CDB/2023-24, Dt. 21-07-2023

GGMP. Roads, Drains, Steps, Water Supply, RCC, Repairs, HDPE, Pipe Line, Community Halls, Wall, Culverts, slabs, Greenery, lift (Box Tender) (87 works)- Est. Amount. 1759.64 Lakhs

All rights are reserved to the commissioner to cancel or Reject the tenders without assigning any reasons there of

Further details and any corrigendum can be seen @ www.tender.apeprocurement.gov.in

Sd/- For Commissioner

IBC-2016 క్రింద అమ్మకం ప్రకటన

కనకధార వెంచర్స్ ప్రైవేట్ లిమిటెడ్ (లిక్విడేషన్‌లో ఉన్నది)

లిక్విడేటర్ వారి ఆఫీస్ : బి-713, వెస్టన్ ప్లాజా, OU కాలనీ, H S దర్గా, హైదరాబాద్-500008.

ఇ-వేలం

మెసర్స్ కనకధార వెంచర్స్ ప్రైవేట్ లిమిటెడ్ (లిక్విడేషన్‌లో ఉన్నది) CIN No.U70102TG2005PTC047611 రిజిస్టర్డు ఆఫీస్ : హౌస్ నెం. 8-3-1114/1, కేశవనగర్, శ్రీనగర్ కాలనీ, హైదరాబాద్-500073 వారి ఆస్తులు గౌరవనీయ నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్, హైదరాబాద్ బెంచ్ వారి ఉత్వర్వు తేది. 13-08-2021 ననుసరించి నియమితులైన లిక్విడేటర్ వారిచే అమ్మకమునకు సంబంధించి బిడ్స్ కోరుతున్నట్లు యావన్మంది ప్రజానీకమునకు తెలియజేయడమైనది.

వ. సంఖ్య	స్థిరాస్థి వివరములు	రిజర్వుధర	ధరావత్తు	బిడ్ పెంపుదల
1	కార్పొరేట్ ఋణగ్రహీత ఒకే మొత్తంగా (సంబంధిత ప్రాతిపదికన కొనసాగుతుంది) (కార్పొరేట్ ఋణగ్రహీత యొక్క ఆస్తులు చేర్చబడిన మరియు మినహాయించిన వాటి గురించి పూర్తి వివరములకు దయచేసి ఇ-వేలం ప్రక్రియ డాక్యుమెంట్‌ను చూడగలరు.	రూ॥ 8.00 కోట్లు	రూ॥ 0.80 కోట్లు	రూ॥ 8.00 లక్షలు

1) అమ్మకం "ఎక్కడ ఎలా ఉన్నది", "అక్కడ అలా" మరియు "అక్కడ ఏమున్నదో అది" "నో రీకోర్స్" అనే ప్రాతిపదికన నిర్వహించబడుతుంది.
2) ఇ-వేలం వేదిక ద్వారా క్రింది సంతకందారునిచే అమ్మకం నిర్వహించబడుతుంది (ప్రతి 5 నిమిషాల అపరిమిత పొడిగింపుతో)
3) ఇ-వేలం అమ్మకం నియమ నిబంధనల వివరముల కొరకు ఆసక్తిగల దరఖాస్తుదారులు https://www.bankeauctions.com నందు లభించు పూర్తి ఇ-వేలం ప్రక్రియ డాక్యుమెంట్‌ను చూడవచ్చును లేదా లిక్విడేటర్ :kanakadhara.liq@gmail.com నకు ఇ మెయిల్ పంపడం ద్వారా పొందవచ్చును.
4) ఇ-వేలం వివరములకు సంప్రదించండి : శ్రీ ధరణీకృష్ణ, ఫోన్ నెం. 9948182222, ఇ-మెయిల్ : dharani.p@c1india.com లేదా telangana@c1india.com.
5) స్థలం తనిఖీ మరియు ఆస్తి సంబంధిత విచారణలు కొరకు దయచేసి ఇ-మెయిల్ kanakadhara.liq@gmail.com నకు పంపండి
6) బిడ్స్ దాఖలు చేయుటకు ఆసక్తిగల అర్హులైన బిడ్డర్స్ బ్యాంక్ ఇ-వేలముల వెబ్‌సైట్ https://www.bankeauctions.com చూడవలసిందిగా కోరుచున్నాము
7) ఇ-వేలం అంగీకరించుటకు లేదా రద్దుచేయుటకు లేదా పొడిగించుటకు లేదా ఏదైనా నియమ నిబంధన సవరించుటకు లిక్విడేటర్ హక్కు కలిగియున్నారు.
8) ఆసక్తిగల బిడ్డర్స్ తమ ఆసక్తి వ్యక్తీకరణ (EOI) దాఖలు చేయుటకు ఆఖరు తేది మరియు సమయం 16-08-2023న సా॥ 5.00 గం॥ల వరకు
9) అర్హులైన బిడ్డర్స్ ధరావత్తు చెల్లింపు మరియు ఇతర ఫారములు దాఖలు చేయుటకు ఆఖరు తేది మరియు సమయం 21-08-2023న సా॥ 5.00 గం॥ల వరకు
10) ఇ-వేలం తేది మరియు సమయం : 24-08-2023 ఉ॥ 11.00గం॥ల నుండి 11.30 మధ్యన

తేది. : 22-07-2023
ప్రదేశం : హైదరాబాద్

రాజేష్ చిల్లలే
IBBI/IPA-001/IP-P00699/2017-2018/11226
లిక్విడేటర్ కనకధార వెంచర్స్ ప్రైవేట్ లిమిటెడ్
ఇ-మెయిల్ : kanakadhara.liq@gmail.com

సంపాదకీయం

మొసలి కన్నీరు

మణిపూర్ మారణకాండపై ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఎట్టకేలకు నోరు మెదిపారు. సంకుచిత రాజకీయ ప్రయోజనాల కోసం గిరిజన తెగల మధ్య బిజెపి పెట్టిన చిచ్చుతో మణిపూర్ దాదాపు మూడు నెలలుగా నెత్తురోడుతోంది. బిజెపి గొప్పగా చెప్పుకునే 'డబుల్ ఇంజిన్' ప్రభుత్వాలు, సుపరిపాలనలోని డొల్లతనాన్ని ఇది మరోసారి బయటపెట్టింది. మణిపూర్ తగలబడుతుంటే అమెరికా, ఫ్రాన్స్ పర్యటనల్లో మునిగి తేలిన ప్రధానికి ఈ ఈశాన్య రాష్ట్రం వైపు తొంగి చూసే తీరికే లేకపోయింది. మణిపూర్‌లో మానవ హక్కులు హరించే వ్యక్తికి ఇక్కడ స్వాగతం లేదు అని అమెరికా, ఫ్రాన్స్‌లో సామాజిక కార్యకర్తలు, ప్రజాతంత్రవాదులు గళమెత్తినా, మణిపూర్‌లో మానవ హక్కుల హననంపై యూరోపియన్ పార్లమెంటు తీర్మానం చేసినా ఖాతరు చేయలేదు. మణిపూర్ మంటలను ఆర్పేందుకు అక్కడి ముఖ్యమంత్రిని వెంటనే మార్చాలని ప్రతిపక్ష పార్టీలు చేసిన డిమాండ్‌కు వీసమెత్తు విలువ కూడా ఇవ్వలేదు. చివరికి మే4న మణిపూర్ మహిళలపై జరిగిన అమానుషత్వానికి సంబంధించిన విజువల్స్‌తో కూడిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవడం, సుప్రీం కోర్టు గట్టిగా మొట్టికాయలేయడంతో ప్రధాని నోరు విప్పారు.

బిజెపి ప్రోద్బలంతో పట్టపగ్గాలు లేకుండా రెచ్చిపోతున్న మానవ మృగాలు.. కుకీ తెగకు చెందిన ముగ్గురు ఆడ తల్లులపై అఘాయిత్యాలకు పాల్పడడం, అడ్డుకోబోయిన కుటుంబ సభ్యుల్లో ఇద్దరిని హత్య చేయడం, ఇద్దరు మహిళలను నగ్నంగా ఊరేగించడం, మరో మహిళను ఆటబొమ్మను ఆడించినట్లు ఆడించి.. వీడియో తీసి సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేసిన కిరాతక చర్యపై సర్వత్రా నిరసనాగ్రహాలు వ్యక్తమయ్యాయి. మణిపూర్‌లో జరిగిన ఈ ఘోరాతిఘోరంపై ప్రధాని మొసలి కన్నీరు కార్చగా, ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి బీరేన్ సింగ్ ఒక టీవి చానెల్‌కిచ్చిన ఇంటర్వ్యూలో చేసిన వ్యాఖ్యలు అత్యంత జుగుప్సాకరంగా ఉన్నాయి. మణిపూర్‌లో ఇటువంటి ఘోరాలు బయటకు రాకూడదన్న ఉద్దేశంతోనే ఇంటర్నెట్‌ను నిషేధించామని ముఖ్యమంత్రి స్థాయిలో ఉన్న వ్యక్తి మాట్లాడడం హేయాతి హేయం. మణిపూర్‌లో మానవత్వాన్ని మంటగలిపిన ఆ దాష్టీకంపై సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి వై చంద్రచూడ్ సరిగానే స్పందించారు. ఈ అమానుష ఘటనకు కారకులైన వారిపై చర్య తీసుకుంటారా, లేక మమ్మల్నే ఆ పని చేయమంటారా అని కేంద్ర, మణిపూర్ ప్రభుత్వాలను భారత ప్రధాన న్యాయమూర్తి నిలదీసిన తరువాత కూడా ఏలికల తీరు మారలేదు. రెండు రోజులుగా పార్లమెంటు ఉభయ సభలు దీనిపై స్తంభించిపోయాయి. యావత్ భారత ప్రజానీకాన్ని కలచివేసిన మణిపూర్ దారుణాలపై చర్చకు మోడీ ప్రభుత్వం ససేమిరా అంటున్నది. మరో వైపు మహిళలకు వ్యతిరేకంగా నేరాలకు పాల్పడేవారిపై ముఖ్యమంత్రులు కఠిన చర్యలు తీసుకోవాలి' అంటూ పార్లమెంటు వెలుపల సుద్దులు చెబుతున్నది. ఇది వంచన కాదా?

ఈశాన్య రాష్ట్రాల్లో పర్యటించిన ప్రతిసారి పర్వత ప్రాంతాల ప్రగతికి ప్రత్యేక దృష్టిసారించామంటూ వాగాడంబర ప్రకటనలు చేసే మోడీ మణిపూర్‌ను రావణ కాష్టంలా మార్చుతున్న అరాచక శక్తుల పీచమణిచేందుకు ఎందుకు సిద్ధపడడం లేదు. రాజకీయ లబ్ధి కోసం హిందువులకు ప్రాతినిధ్యం వహించే మెజారిటీ మెయితీలకు ఆయుధాలు చేరవేసి క్రిస్టియన్ మైనార్టీలకు చెందిన కుకీ తెగలపై ఉసిగొల్పిన పాపం ఎవరిది? హిందూత్వ శక్తులది కాదా? కేంద్ర హోంమంత్రి అమిత్ షా పర్యటించిన తరువాత మణిపూర్‌లో మంటలు చల్లారకపోగా, మరింత పెరిగాయి. మణిపూర్‌లోశాంతిని పునర్దుధరించేందుకు ప్రధాన అడ్డంకి అక్కడి ముఖ్యమంత్రి బీరేన్‌సింగే కాబట్టి ఆయనను వెంటనే ఆ పదవి నుంచి తొలగించాలి. మే 4 నాటి దారుణానికి కారకులైనవారిని బోనులో నిలబెట్టాలి. మణిపూర్ హింసాకాండలో బాధితుల కుటుంబాలను అన్ని విధాలుగా ఆదుకోవాలి.

మహనీయుల మాట

విప్లవ సాశీల్యాన్ని పుణికి పుచ్చుకున్న వారు కష్టాలకు, కడగండ్లకు, వైఫల్యాలకు వెరవరు. తమ దీక్ష నుంచి వైదొలగరు. వెనుకంజ వేయరు. పార్టీ, విప్లవం, వర్గం, దేశం, తోటి మానవుల ప్రయోజనాల కోసం స్వంత ప్రయోజనాలను త్యాగం చేయడానికి కూడా తటపటాయించరు.

- హోచిమిన్

దళితుల భూములు పెత్తందార్లకు కట్టబెట్టడానికే

అసైన్డ్ చట్ట సవరణ

విశ్లేషణ

ఆమె పేరు నాగలక్ష్మి. అనంతపురం జిల్లా ముకుందా పురం గ్రామం దళిత మహిళ. 1987లో ప్రభుత్వం 5 ఎకరాల భూమి ఇచ్చింది. ఆమె భర్త అదే గ్రామంలోని ఒక భూస్వామి దగ్గర పాలేరుగా పని చేసేవాడు. ఆ సందర్భంగా కొంత అప్పు చేశాడు. అప్పు తీర్చనందుకు ఆ భూమిని భూస్వామి స్వాధీనం చేసుకున్నాడు. అప్పు తీర్చారు, కాని నేటికీ ఆ భూమిని నాగలక్ష్మికి అప్పజెప్పకుండా ఆ భూస్వామే అనుభవిస్తున్నాడు. ఇప్పుడు రాష్ట్ర క్యాబినెట్ దళితులను రైతులుగా మారుస్తామంటూ అసైన్డ్ చట్ట సవరణకు అనుమతించింది. దీనిప్రకారం పైన చెప్పుకున్న భూమికి యాజమాన్య హక్కు ఎవరికి కల్పిస్తారో ప్రభుత్వమే చెప్పాలి.

పేదలకు భూ పంపిణీ కోసం అసైన్డ్ భూములపై అధ్యయనం చేయడానికి రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు నాయకత్వంలో 13 మంది ఎమ్మెల్యేలతో 2022 అక్టోబర్‌లో కమిటీని నియమించింది ప్రభుత్వం. ఈ కమిటీ తమిళనాడు, కర్ణాటకలో అధ్యయనం చేసి 10 నెలల అనంతరం నివేదిక ఇచ్చింది. ఈ నివేదికను ఇప్పటికీ బహిరంగ పరచలేదు. 1954 నుండి 2002 మధ్య అసైన్డ్ భూములు పొందిన దళితులు, పేదలకు పూర్తి యాజమాన్యపు హక్కులు కల్పిస్తామని ఈ నెల 12వ తేదీన జరిగిన మంత్రివర్గ సమావేశం నిర్ణయించింది. ఈ భూమిని ఎవరికైనా అమ్ముకోవచ్చు, ఎవరైనా కొనుక్కోవచ్చన్న చట్ట సవరణకు క్యాబినెట్ ఆమోదించింది. ఈ నిర్ణయం వల్ల 15 లక్షల 21 వేల కుటుంబాల వారు పేదరికం నుండి బైటపడి సంపన్నులుగా మారతారని పాలక వర్గాలు ఊదర కొడుతున్నాయి. ఈ చట్ట సవరణ వల్ల ఎవరికి లాభం? ఎవరికి నష్టం? ఒకసారి పరిశీలిద్దాం.

వి.వెంకటేశ్వర్లు

స్వాతంత్ర్యానంతరం ఉమ్మడి రాష్ట్రంలో వామపక్ష పార్టీలు, ప్రజా సంఘాల ఉద్యమ పోరాటాల ఫలితంగా సుమారు 58 లక్షల ఎకరాల భూమిని ప్రభుత్వం పేదలకు అసైన్ (ఇచ్చింది) చేసింది. ఈ భూమిలో కొంత పెత్తందార్లు, పలుకుబడి కల్గినవారు దౌర్జన్యంగా పేదల నుండి లాగేసుకోసాగారు. ఈ దుర్మార్గాన్ని అరికట్టడానికి ఈ భూమిని తిరిగి పేదలకు చెందేలా 1977లో ఆనాడు సాంఘిక సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీగా ఉన్న ఎస్.ఆర్.శంకరన్ ప్రభుత్వాన్ని ఒప్పించి పిఒటి యాక్ట్ 9/77 అసైన్డ్ చట్టం తెచ్చారు. ఈ చట్టం ప్రకారం భూమి లేని పేదలు రెండున్నర ఎకరాల మాగాణీ, 5 ఎకరాల మెట్ట పొందవచ్చు. మించి ఉన్నవారు అసైన్డ్ భూములు పొందడానికి అనర్హులు. అసైన్డ్ భూములను పొందిన వారు, వారి వారసులు అనుభవించాలి కాని అమ్మకాలు, కొనుగోలు చేయరాదు. ఎవరైనా బలవంతంగా, దౌర్జన్యంగా అసైన్డ్ భూములను కొనుగోలు చేసినా, అన్యాక్రాంతం చేసినా అసైన్డ్ చట్టం సెక్షన్ 6 ప్రకారం శిక్షార్హులు. తిరిగి మా భూమి మాకు కావాలని భూమిని కోల్పోయిన వారు గాని, వారి వారసులు గాని ప్రభుత్వాన్ని కోరితే తిరిగి అప్పగించాలి. అలా చేయకపోతే చట్టరీత్య శిక్షార్హులు. చివరికి కోర్టుల ద్వారా పేదలు తిరిగి ఆ భూమిని పొందవచ్చు. ఈ భూములు సెక్షన్ 5 ప్రకారం రిజిస్ట్రేషన్ చేయకూడదు. ఒక్క మాటలో చెప్పాలంటే అసైన్డ్ చట్టం పేదల భూములకు కవచ కుండలం లాంటిది. ఇంతటి ప్రాధాన్యత కల్గిన చట్టాన్ని మరింత బలోపేతం చేసి అమలు చేయాల్సింది పోయి పాలక వర్గాలు భూస్వాముల ఒత్తిడికి తలొగ్గి పేదలకు తీవ్రమైన ద్రోహం చేస్తున్నాయి.

అసైన్డ్ చట్టం ఇంత పకడ్బందీగా ఉన్నప్పటికి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సుమారు 25 లక్షల ఎకరాలు అన్యాక్రాంతం అయినట్లు 2006లో కోనేరు రంగారావు భూ కమిటీ నివేదిక ఇచ్చింది. ఈ భూములను వారికి తిరిగి ఇప్పించాలని ప్రభుత్వాన్ని కోరింది. ఆనాడు ముఖ్యమంత్రిగా ఉన్న రాజశేఖర రెడ్డి 2006 మార్చిలో జరిగిన అసెంబ్లీ సమావేశంలో మాట్లాడుతూ తన తండ్రి రాజారెడ్డి తెలిసో, తెలియకో 300 ఎకరాలు అసైన్డ్ భూములు పొందారని, తక్షణమే ఈ భూములను తిరిగి ఆ పేదలకు అందజేస్తామని హామీ ఇచ్చారు. ఆయనతో పాటు ఆనాడు ప్రధాన ప్రతిపక్ష నాయకుడిగా ఉన్న చంద్రబాబు నాయుడు కూడా నెల్లూరు జిల్లా బాలాయిపాలెం మండలంలో సుమారు 500 ఎకరాలు బినామీ పేర్లతో అనుభవిస్తున్నారని ఇలాంటి అన్యాక్రాంతమైన భూములను గుర్తించి 6 నెలల లోపు తిరిగి కోల్పోయిన పేదలకు ఇస్తామని హామీ ఇచ్చారు. ఆ హామీ అమలు కాలేదు.

1954 నుండి 2002 మధ్య కాలంలో అసైన్డ్ భూములు పొందిన పేదలకు పూర్తి యాజమాన్య హక్కులు కల్పిస్తామని తాజాగా మంత్రి వర్గం నిర్ణయించింది. ఈ నిర్ణయం ప్రకారం అసైన్డ్ భూములు పొందిన లబ్ధిదార్ల కంటే అక్రమంగా, దౌర్జన్యంగా పొందిన భూస్వాములకే ప్రయోజనం జరుగుతుంది. ప్రస్తుతం ఉమ్మడిగా ఉన్న 13 జిల్లాల్లో 15,21,160 కుటుంబాలకు చెందిన 27,41,697 ఎకరాలకు యాజమాన్యపు హక్కులు కల్పిస్తామని ప్రభుత్వం చెబుతున్నది. మరోపక్క ఆనాడు ప్రభుత్వం నియమించిన కోనేరు రంగారావు భూ కమిటి లక్షలాది ఎకరాలు అన్యాక్రాంతమయ్యాయని చెప్పింది. నేడు అనేక జిల్లా అధికారులు కూడా అన్యాక్రాంతమైనట్లు ప్రభుత్వానికి నివేదికలు ఇచ్చినట్లు తెలుస్తుంది. మరి యాజమాన్యపు హక్కులను భూమి పొందిన నిజమైన పేదలకు కల్పిస్తారా? లేదా దౌర్జన్యంగా అనుభవిస్తున్న భూస్వాములకు హక్కులు కల్పిస్తారా? ప్రభుత్వం చెప్పాలి. భూమి వివరాలను బహిరంగ పర్చవలసిన అవసరం ఉంది.

రాష్ట్రంలో అనేక జిల్లాల్లో డెల్టా, పారిశ్రామిక, నేషనల్ హైవే, ఎస్ఇజెడ్, సముద్రతీర ప్రాంతంలో పేదల నుండి బలవంతంగానూ, పావలో పాతికో ఇచ్చి సారావంతమైన, విలువైన భూములను... భూస్వాములు, రాజకీయంగా పలుకుబడి కల్గినవారు సొంతం చేసుకొని...చేపలు, రొయ్యల చెరువులు, ఫామ్‌హౌస్‌లు కట్టుకొని అనుభవిస్తున్నారు. అసైన్డ్ చట్టం ప్రకారంగా తిరిగి మా భూములు మాకు కావాలని చాలా చోట్ల పేదలు తిరగబడుతున్నారు. తిరిగి భూములు స్వాధీనం చేసుకోవడానికి ఉద్యమిస్తున్నారు. అంతిమంగా కోర్టులను ఆశ్రయిస్తున్నారు. అనివార్యంగా అక్రమంగా అనుభవిస్తున్న వారు తిరిగి ఆ భూములను ఇవ్వక తప్పడం లేదు. అక్రమంగా ఆర్జిస్తున్న భూస్వాములు తిరిగి పేదలకు ఇవ్వకుండా ఉండడానికి ప్రభుత్వం మీద ఒత్తిడి తెచ్చారు. ఈ ఒత్తిడికి తలొగ్గి అసైన్డ్ చట్టం పీక నొక్కడానికే రాష్ట్ర క్యాబినెట్ చట్ట సవరణకు అంగీకరించింది. ఉదాహరణకు ఏలూరు జిల్లా దోసపాడు, అనంతపురం జిల్లా ముకుందాపురం, కృష్ణా జిల్లా ఇలపర్రు, కడప జిల్లా కాశినాయనా గ్రామాలకు చెందిన అసైన్డ్ భూములను విజయవాడ, హైదరాబాద్, చెన్నై, బెంగళూరు మొదలగు ప్రాంతాలకు చెందిన భూస్వాములు వందలాది ఎకరాలు అక్రమంగా అనుభవిస్తున్నారు. మరి ఈ భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకొని తిరిగి ఆ పేదలకు ఇచ్చి యాజమాన్యపు హక్కులు కల్పిస్తుందా? బినామీ పేర్లతో అనుభవిస్తున్న ఆ భూస్వాములకే కట్టబెడతారా? వాన్‌పిక్ కు ఇచ్చిన 13 వేల ఎకరాల అసైన్డ్ భూములను, అమరావతిలో అధికార, ప్రధాన ప్రతిపక్ష పార్టీలు అక్రమంగా అనుభవిస్తున్న 2 వేల ఎకరాల అసైన్డ్ భూములు తిరిగి పేదలకు ఇస్తారా? లేదా వారికే కట్టబెడతారా? అనేది ప్రశ్నార్థకం. కాని 2006లో నాటి ప్రభుత్వం ఏ రకంగా అయితే భూములను ఆక్రమించుకున్న పెద్దలకే అసైన్డ్ చట్టాన్ని సవరించిమరీ కట్టబెట్టిందో ప్రస్తుతం జరిగేది కూడా అంతే.

> **అసైన్డ్ చట్టం ప్రకారంగా తిరిగి మా భూములు మాకు కావాలని చాలా చోట్ల పేదలు తిరగబడుతున్నారు. తిరిగి భూములు స్వాధీనం చేసుకోవడానికి ఉద్యమిస్తున్నారు. అంతిమంగా కోర్టులను ఆశ్రయిస్తున్నారు. అనివార్యంగా అక్రమంగా అనుభవిస్తున్న వారు తిరిగి ఆ భూములను ఇవ్వక తప్పడం లేదు. అక్రమంగా ఆర్జిస్తున్న భూస్వాములు తిరిగి పేదలకు ఇవ్వకుండా ఉండడానికి ప్రభుత్వం మీద ఒత్తిడి తెచ్చారు. ఈ ఒత్తిడికి తలొగ్గి అసైన్డ్ చట్టం పీక నొక్కడానికే రాష్ట్ర క్యాబినెట్ చట్ట సవరణకు అంగీకరించింది.**

ప్రభుత్వం చెప్తున్న మాటలు నమ్మి మా భూములకు హక్కులు రావడంతో మేము అమ్ముకోవచ్చు. కోటీశ్వరులు కావచ్చు అని నమ్మేవారు ఉన్నారు. ఇది పచ్చి దగా, మోసం. ఎందుకంటే అసైన్డ్ చట్టం అమలులో ఉండగానే పెత్తందార్లు పేదల భూములను అనుభవిస్తున్నారు. భూములు కోల్పోయిన దళితులు, చైతన్య వంతమైన వారి వారసులు ఈ చట్టం ఉంది కాబట్టే పోరాడి తిరిగి సాధించుకుంటున్నారు, భూములను రక్షించుకుంటున్నారు. రేపు ఈ చట్ట సవరణ అమలులోకి వస్తే ఈ రాష్ట్రంలో ఒక్క దళితుడి చేతిలో చారెడు భూమి కూడా మిగలదు.

కాబట్టి మన రాష్ట్రంలో కోనేరు రంగారావు భూ కమిటి ఇచ్చిన నివేదిక ఆధారంగా, ప్రభుత్వ లెక్కలు, వామపక్ష పార్టీలు, ప్రజా సంఘాలు, దళిత సంఘాలు చెబుతున్న లెక్కల ప్రకారం సుమారు 15 లక్షల ఎకరాలు అన్యాక్రాంతమైనట్లు తెలుస్తుంది. ముందు ఈ వివరాలను బయట పెట్టాలి. చట్టానికి విరుద్ధంగా రెండున్నర ఎకరాల మాగాణీ, 5 ఎకరాలకు పైగా మెట్ట భూమిని అక్రమంగా అనుభవిస్తున్న వారి నుండి తిరిగి తీసుకోవాలి. ఒక వేళ అసైన్డ్ భూమి పొందిన దళితులు, బలహీన వర్గాలకు చెందిన పేదలు తమ అవసరాల కోసం అమ్ముకుంటే అటువంటి భూమిని ప్రభుత్వమే భూ కొనుగోలు పథకం కింద కొని అదే గ్రామంలో భూమి లేని పేదలకు పంచాలి. ఇది చెయ్యకుండా కూలీలను రైతులుగా మారుస్తానని చెప్పి తడి గుడ్డతో గొంతు కోసినట్లు చట్టాన్ని సవరించి అక్రమంగా అనుభవిస్తున్న వారికి యాజమాన్యపు హక్కులు కల్పించడం దళిత, బలహీన వర్గాల కుటుంబాలకు తీవ్రమైన ద్రోహం చేయడమే. కాబట్టి ప్రభుత్వం చెబుతున్న అసైన్డ్ చట్ట సవరణ వల్ల ఆక్రమణదారులకే ఎక్కువ మేలు జరిగి పేదలకు తీవ్రమైన అన్యాయం జరిగే అవకాశం కనిపిస్తుంది. ప్రభుత్వం ఈ సవరణలను ఉపసంహరించక పోతే పెద్ద ఎత్తున పోరాటాలకు సిద్ధం కావాల్సి వస్తుంది.

**/ వ్యాసకర్త వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి,
సెల్: 94900 98980 /**

★

యుసిసి ముసాయిదా ఎక్కడ ?

విశ్లేషణ

భారత లా కమిషన్ నోటిఫికేషన్, ఏకరూప పౌర స్మృతి (యూనిఫాం సివిల్ కోడ్-యుసిసి) కావాలంటూ ప్రధాని నరేంద్ర మోడీ గట్టిగా చేస్తున్న వాదనలు...ప్రజల మధ్య చీలికలు తీసుకొచ్చే విచ్ఛిన్నకర అంశంపై మరోసారి చర్చను లేవదీశాయి. యుసిసి అనేది బిజెపి ఎన్నికల మ్యానిఫెస్టోలన్నిటిలోనూ భాగంగా ఉంటోంది. 1996 నాటి ఆ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో నారీశక్తి (మహిళా శక్తి) అనే శీర్షికతో ఏకరూప పౌర స్మృతిని ప్రత్యేకంగా ప్రస్తావించింది. అయినప్పటికీ యుసిసి ముసాయిదాలో పొందుపరచాల్సిన అంశాలపై ఎన్నడూ దృష్టి పెట్టలేదు.

విడాకులు, భరణం, వారసత్వపు హక్కులు, పిల్లల సంరక్షణకు సంబంధించి యుసిసిలో ఎలాంటి చట్టాలున్నాయి? ఆలిండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు నుండి, యుసిసిని వ్యతిరేకిస్తున్న గుర్తింపు పొందిన మైనారిటీ సంస్థల నుంచి మాత్రమే ఇప్పటివరకు చెప్పుకోదగిన ప్రతిస్పందన వచ్చింది. ఈసారి యుసిసి ప్రతిపాదనపై ఆదివాసీలు, సిక్కు గ్రూపులు, ఇంకా ఇతర వర్గాల ప్రజల నుండి కూడా వ్యతిరేకత వస్తున్నది.

"వివాహం, విడాకులు, వారసత్వం, భూమి బదిలీకి సంబంధించిన మా సాంప్రదాయ చట్టాలను యుసిసి ఉల్లంఘిస్తుంది..." అని 'కేంద్రీయ సర్నా సమితి' కార్యకర్త సంతోష్ టిర్కీ అభిప్రాయపడ్డాడు. "మేము లా కమిషన్‌కు ఈ మెయిల్ ద్వారా నిరసన తెలియజేయడమే కాదు. క్షేత్రస్థాయిలో నిరసన ప్రదర్శనలు కూడా నిర్వహిస్తాం. మా వ్యూహాలను రూపొందించుకునేందుకు సమావేశాలు నిర్వహిస్తాం. రాజ్యాంగంలో పేర్కొన్న ఐదవ, ఆరవ షెడ్యూల్ లోని నిబంధనలను యుసిసి నీరుగార్చుతుంది..." అని జార్ఖండ్‌కు చెందిన ఆదివాసీ గ్రూప్ నాయకుడు రతన్ టిర్కీ పేర్కొన్నారు.



పొ॥ రామ్ పునియాని

నేషనల్ డెమోక్రటిక్ అలయన్స్ (ఎన్‌డిఎ) లోని భాగస్వామ్య పార్టీల్లో ఒకటైన శిరోమణి అకాలీదళ్, ఈశాన్య రాష్ట్రాలకు చెందిన కొంతమంది బిజెపి నాయకులు తాము ఈ యుసిసిని వ్యతిరేకిస్తున్నామని చెప్పారు. పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ చైర్మన్ బిజెపికి చెందిన సుశీల్ మోడీ, ఈశాన్య రాష్ట్రాలతో సహా గిరిజన ప్రాంతాల్లో యూనిఫాం సివిల్ కోడ్ అమలులోని సాధ్యాసాధ్యాలను ప్రశ్నించారు.

యుసిసిని రద్దు చేయమని అడగకుండా లా కమిషన్‌తో చర్చలు జరపాలని శిరోమణి అకాలీ దళ్ నేత గుర్జీత్ సింగ్ తల్వాండీ సిక్కు మత అత్యున్నత కమిటీ అయిన 'శిరోమణి గురుద్వారా ప్రబంధక్ కమిటీ'ని కోరారు. అలా అని ఒప్పందానికి ప్రయత్నించమన్నట్టుగా భావించరాదని, ఈ ప్రతిపాదనకు వ్యతిరేకతను తెలిపే అవకాశాన్ని వదులుకోకుండా వుండేందుకు ఈ చర్చలను చూడాలని చెప్పారు.

వ్యక్తిగత, కుటుంబ చట్టాలు పౌర, నేర చట్టాలకు చాలా భిన్నంగా వున్నాయనే విషయాన్ని మరోసారి తప్పక ప్రస్తావించుకోవాలి. భారతదేశంలో బ్రిటిష్ పాలకులు అన్ని మతాలకు చెందిన పెద్దలతో సంప్రదింపులు జరిపి, వ్యక్తిగత చట్టాలను రూపొందించారు. ఉదాహరణకు, హిందూ చట్టాలకు సంబంధించిన మితాక్షర, దయాభాగ స్రవంతులు ఇప్పటికీ కొనసాగుతున్నాయి. కాబట్టి హిందువుల పౌర చట్టాలలోను, చివరికి హిందువుల్లోను ఏకరూపత లేదు. వ్యక్తిగత చట్టాలలో అంతర్లీనంగా వున్న లింగ అన్యాయం పట్ల కలత చెందిన భారత ప్రథమ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ...హిందువుల కోసం హిందూ కోడ్‌లో సంస్కరణలను ప్రారంభించాలని తొలి న్యాయశాఖ మంత్రి డా.బి.ఆర్.అంబేద్కర్‌ను కోరారు. హిందూ వ్యక్తిగత చట్టాలన్నీ మహిళలపై పూర్తి ఆధిపత్యాన్ని చెలాయించేవిగా ఉన్నాయని గ్రహించిన అంబేద్కర్, సమానత్వాన్ని కోరుకునే వ్యక్తిగా ముందుగా హిందూ కోడ్ బిల్లు ముసాయిదాను రూపొందించారు. ముందుగా మెజారిటీ మత సంస్కరణలతో ప్రారంభించి తరువాత మిగిలిన మతాల్లో అలాంటి సంస్కరణలు చేపట్టాలనేది ఆయన ఆలోచన.

భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన వెంటనే ముస్లిం వ్యక్తిగత చట్టాల్లో సంస్కరణలను చేపట్టకపోవడానికి ఓ కారణముంది. దేశ విభజన సమయంలో జరిగిన అల్లర్ల నేపథ్యంలో...మైనారిటీ మతంపైన మెజారిటీ మతం తన అనుకూల విధానాలను రుద్దుతున్నట్లు కనిపించకూడదన్నదే కారణం. ఆ తరువాత ముస్లిం చట్టాల క్రోడీకరణను చేపట్టారు. ట్రిపుల్ తలాక్ రాజ్యాంగ విరుద్ధమని ప్రకటించడం ద్వారా ముస్లిం చట్టంలో ఒక సంస్కరణను చేపట్టడం కూడా జరిగింది (బిజెపి, అనవసరంగా ఈ విధానాన్ని నేరంగా పరిగణించింది. తద్వారా, ప్రజల్ని విభజించి, ముస్లింలు చట్టాల్ని ఉల్లంఘించే వారిగా చూపించింది). మరో ముఖ్యమైన విషయం ఏమంటే, ఇండియన్ ముస్లిమ్స్ ఫర్ సెక్యులర్ డెమోక్రసీ లాంటి కొన్ని ప్రగతిశీల ముస్లిం గ్రూపులు గతంలో కూడా మతపరమైన తటస్థ వ్యక్తిగత చట్టాల కోసం పిలుపునిచ్చాయి.

లింగ సమానత్వంపై ఆధారపడి, హిందూ కోడ్ బిల్లులో అంబేద్కర్ రూపొందించిన చట్టాలకు తీవ్రమైన వ్యతిరేకత వ్యక్తమైంది. బిల్లును దశలవారీగా ప్రవేశపెట్టాల్సి వచ్చింది. అంబేద్కర్ రాజీనామా చేయాలని మితవాద హిందువులను హిందూ జాతీయవాద శక్తులు రెచ్చగొట్టాయి. దీంతో మనస్తాపం చెందిన ఆయన క్యాబినెట్ మంత్రి పదవికి రాజీనామా చేశారు.

ఇటీవల మోడీ ప్రభుత్వం ద్వారా గాంధీ శాంతి బహుమతిని అందుకున్న గీతా ప్రెస్ ప్రచురించిన కల్యాణ్ మ్యాగజైన్...హిందూ కోడ్ బిల్లుపై వ్యతిరేకతను అప్పట్లో ఈ విధంగా వ్యక్తం చేసింది. "ఇన్నాళ్లకు హిందూ ప్రజానీకం అంబేద్కర్ మాటలను చాలా తీవ్రంగా పరిగణనలోకి తీసుకున్నారు. ఇప్పుడు, ఆయన రూపొందించిన హిందూ కోడ్ బిల్లు, హిందూ ధర్మాన్ని నాశనం చేయడానికి ఉద్దేశించిన కుట్రలో అత్యంత కీలకమైన అంశమని తేలిపోయింది. అలాంటి వ్యక్తి న్యాయశాఖ మంత్రిగా కొనసాగితే, అది హిందువులకు అవమానం, సిగ్గుచేటు, హిందూ ధర్మంపై ఒక మచ్చ."

యుసిసి కోసం మహిళా ఉద్యమాలు డిమాండ్ చేస్తూనే వున్నాయి. అయితే డెబ్భయ్యవ దశకం ప్రారంభంలో మధుర అత్యాచారం కేసు తరువాత యుసిసి డిమాండ్ చాలా బలంగా ముందుకొచ్చింది. ఏకరూప పౌర స్మృతి న్యాయం చేకూర్చుతుందని మహిళా ఉద్యమంలోని కొన్ని వర్గాలు విశ్వసించాయి. కానీ రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ రెండవ సర్సంఘ్ చాలక్ ఎం.ఎస్.గోల్వాల్కర్ అందుకు విరుద్ధంగా స్పందించారు. యుసిసి, భారతదేశ భిన్నత్వాన్ని దెబ్బతీస్తుందని 1972, ఆగస్ట్ 23న ఆర్గనైజర్ పత్రిక కోసం కె.ఆర్.మల్కానీకి ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పారు.

జాతీయ ఐక్యతను యుసిసి బలోపేతం చేస్తుందనేది ఏమాత్రం పసలేని వాదన. లింగ న్యాయం చేకూరాలంటే ఏకరూపతే మార్గం అనే ఆలోచన నుండి అనేక మహిళా గ్రూపులు తప్పుకున్నాయి. విడాకులు, వారసత్వం, పిల్లల సంరక్షణలో లింగ న్యాయం ఎలా ఉంటుందని వారు ప్రశ్నిస్తున్నారు. మరో ప్రశ్న ఏమంటే, యుసిసిని కేవలం అధికారిక ఉత్తర్వులతో రుద్దవచ్చా? యుసిసిని విధించడం ద్వారా సాంప్రదాయాలు, ఆచారాలు మటుమాయమైపోతాయా? అన్నది మిలియన్ డాలర్ల ప్రశ్న. సామాజిక మార్పు తేవాలన్నా, లింగ న్యాయం చేకూరాలన్నా సంబంధిత కమ్యూనిటీల్లో మార్పు కోసం చాలా కృషి జరగాలి. విభిన్న వర్గాల, మతాల, సమాజాల అధికార ప్రతినిధులుగా చెప్పుకునేవారు మొత్తంగా తమ కమ్యూనిటీల అభిప్రాయాన్ని... ముఖ్యంగా మహిళల అభిప్రాయాల్ని... ప్రతిబింబించకపోవచ్చు. మనం లింగ న్యాయం కోసం ఉన్నప్పుడు, సమాజంలో నాయకత్వ పాత్రను పోషించిన పురుషుల్ని ప్రశ్నించాల్సిన అవసరం ఉంది. వివిధ కమ్యూనిటీలకు చెందిన మహిళల్లో వున్న బలమైన భావాల్ని, వారి ఆగ్రహాన్ని గుర్తించి...చట్ట సవరణలు, చట్టాల మార్పుల్లో వారి భావాలకు పట్టం గట్టడమనేది కీలకంగా వుండాలి.



> **జాతీయ ఐక్యతను యుసిసి బలోపేతం చేస్తుందనేది ఏమాత్రం పసలేని వాదన. లింగ న్యాయం చేకూరాలంటే ఏకరూపతే మార్గం అనే ఆలోచన నుండి అనేక మహిళా గ్రూపులు తప్పుకున్నాయి. విడాకులు, వారసత్వం, పిల్లల సంరక్షణలో లింగ న్యాయం ఎలా ఉంటుందని వారు ప్రశ్నిస్తున్నారు. మరో ప్రశ్న ఏమంటే, యుసిసిని కేవలం అధికారిక ఉత్తర్వులతో రుద్దవచ్చా? యుసిసిని విధించడం ద్వారా సాంప్రదాయాలు, ఆచారాలు మటుమాయమైపోతాయా? అన్నది మిలియన్ డాలర్ల ప్రశ్న. సామాజిక మార్పు తేవాలన్నా, లింగ న్యాయం చేకూరాలన్నా సంబంధిత కమ్యూనిటీల్లో మార్పు కోసం చాలా కృషి జరగాలి.**

యుసిసి ద్వారా మహిళలకు సాధికారత కల్పించవచ్చనే బిజెపి వాదనలలో డొల్లతనం స్పష్టంగా బైటపడింది. నిజంగా శ్రద్ధ వుంటే గడచిన తన తొమ్మిదేళ్ళ పాలనలో బిజెపి భిన్న సమాజాలు, వర్గాలు, మతాల్లో సంస్కరణలకు చొరవ చూపి వుండాల్సింది. విభిన్న వర్గాలకు చెందిన మహిళలు ఆందోళన వ్యక్తం చేస్తున్నప్పటికీ అవి అంతగా ప్రభావం చూపలేకపోయాయి. మైనారిటీల్లో పెరుగుతున్న ఈ అభద్రతను తొక్కిపెట్టడం వల్ల తలెత్తిన పరిస్థితిని సొమ్ము చేసుకుని మితవాద శక్తులు తమ సామూహిక శక్తిని పెంచుకున్నాయి. న్యాయమైన, ఆరోగ్యకరమైన సంస్కరణలకు గట్టిగా బ్రేక్ వేసేందుకు ఈ శక్తిని అవి ఉపయోగించుకున్నాయి.

మత ప్రాతిపదికన ప్రజలను విభజించడం బిజెపి లక్ష్యం కాబట్టి, అది యుసిసి గురించి మాట్లాడుతుంది. ఈ విషయంలో చిత్తశుద్ధితో కూడిన ప్రయత్నం రెండు విధాలుగా జరగాల్సి వుంది. మొదటిది-అన్ని సామాజిక సమూహాలలో సంఘం నాయకత్వంలో సంస్కరణలు. రెండవది లింగ న్యాయం. యుసిసికి అంగీకారం తెలపడం లేదా వ్యతిరేకించడం కంటే కూడా యుసిసి ముసాయిదా కోసం పిలుపు ఇవ్వాల్సిన అవసరం ఉంది. ముస్లిం సమాజంలోని గొంతుకలు గుడ్డిగా చట్టపరమైన మార్పులను వ్యతిరేకించడం కంటే కూడా ముసాయిదా చూడమని కోరాలి.

వాస్తవానికి, గీతా ప్రెస్‌కు గాంధీ శాంతి బహుమతిని అందించిన బిజెపికి, మహిళా సాధికారత పట్ల ఎలాంటి ఆసక్తి లేదు. కానీ, యుసిసిని వ్యతిరేకిస్తూ ముస్లిం మత ఛాందస సంస్థలు, గొంతులు చించుకుంటాయనే విషయం మాత్రం వాటికి తెలుసు. ప్రజలను మతాల వారీగా విభజించి రానున్న లోక్‌సభ ఎన్నికల్లో బిజెపి లబ్ధి పొందేందుకు మాత్రమే ఈ యుసిసి ఉపయోగపడుతుంది. అన్ని రాజకీయ శక్తులు ఏకతాటిపై నిలిచి, యుసిసిపై తమ అభిప్రాయాల్ని వ్యక్తం చేయడానికి ముందు యుసిసి ముసాయిదా కోసం అడగాలి.

(వ్యాసకర్త మానవ హక్కుల కార్యకర్త)
("న్యూస్ క్లిక్ " సౌజన్యంతో)

★

కవిత్వం

నగ్న ప్రశ్న

తల్లీ! నిను దలంచి
నీ తరపున నగ్న ప్రశ్న
ధరణీ! నిను స్మరించి
ఆరని ఈ దగ్ధ ప్రశ్న
ఆమె దేహాన్ని, హృదయాన్ని
గాయపరుస్తూ ఉన్నప్పుడు
గుర్తుకు రాలేదా, అమ్మ
పాల గుండె చప్పుడు?
నగ్నంగా ఆమెను
నడిపిస్తున్నప్పుడు,
తలపు లోకి రాలేదా
అమ్మ వాళ్లకు అప్పుడు?
అమ్మతనానికి ఇచ్చిన
గౌరవం ఇదేనా?
జన్మ రుణం తీర్చుకునే
విధానం ఇదేనా?
మృగాలే సిగ్గుపడిన
మగాళ్లయిన వారు
మతం నుంచి, గతం నుంచి
ఏమి నేర్చుకున్నారు?
పాండవ ద్రౌపది ఆత్మ
ఉన్నదో! లేదో!?
వివస్త్రల ఆక్రందన
విన్నదో! లేదో!?
ధృతరాష్ట్ర, దుర్యోధన
ఏకాత్మపాలన
ఇక్కడ దుశ్శాసనుడు!
ఎక్కడమ్మా కృష్ణుడు!?
ఒకటేమిటి వాకపల్లి,
కాశ్మీరు, మణిపూరు!
ఉన్మాదుల ఉక్కు బూట్లు
తొక్కుతున్న కన్నీరు!
కులం, మతం, అధికారం
ముసుగుల్లో అవమానం!
ఎందుకింక దేశానికి
మాతృమూర్తి పేరు?
తల్లీ! నిను దలంచి..
ధరణీ! నిను స్మరించి..

**- నల్లి ధర్మారావు
సెల్ : 76609 67313**

మీ రచనలను పంపాల్సిన మెయిల్ :
editpageps@gmail.com

ఉపాధ్యాయుల కేడర్ అప్‌డేట్ చేయాలి

• పిడిఎఫ్ ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉపాధ్యాయుల కేడర్ స్ట్రేంత్ అప్‌డేట్ చేయాలని పిడిఎఫ్ ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్ల ప్రక్రియ పూర్తైనప్పటికీ విద్యాశాఖ 20 రోజుల సమయం పట్టిందని శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 117 జిఒ ప్రకారం బదిలీ అయిన పోస్టుల కేడర్ అప్‌డేట్ చేయలేదని, ఇది విద్యాశాఖ వైఫల్యమని విమర్శించారు. పిజిటి ప్రమోషన్ పోస్టులు, ఎంఇఒ-2 పోస్టులను తక్షణమే కేడర్ స్ట్రేంత్ అప్‌డేట్ చేసి ట్రెజరీలకు పంపాలన్నారు. ఇప్పటికే జూన్ జీతాలు అందక వేలాది మంది ఉపాధ్యాయులు అలమటిస్తున్నారని తెలిపారు. ఈ నెల 25లోపు అప్‌డేట్ చేయకపోతే జులై నెల వేతనాలు కూడా ఉపాధ్యాయులకు అందే పరిస్థితి ఉండదని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే కేడర్ స్ట్రేంత్ అప్‌డేట్ చేసి జీతాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని విద్యాశాఖను డిమాండ్ చేశారు.

బ్రెజిల్‌లో పిఎం, కమ్యూనిటీ కిచెన్స్

• ఆమోదం తెలిపిన లూలా

బ్రసీలియా : ప్రజలకు నాణ్యమైన ఆహారం అందించేందుకు గాను ఆహార సేకరణ కార్యక్రమం (పిఎఎ)తోపాటు కమ్యూనిటీ కిచెన్స్ కార్యక్రమాలను ప్రారంభించనున్నట్లు బ్రెజిల్ అధ్యక్షుడు లూలా డ సిల్వా ప్రకటించారు. ఆహార ఉత్పత్తుల కొనుగోళ్లలో కనీసం 30 శాతం చిన్న రైతుల నుంచి సేకరించాలని నిర్ణయించారు. గురువారం ప్లానాల్టో ప్యాలెస్‌లో జరిగిన కార్యక్రమంలో ఈ మేరకు ప్రకటించారు. బ్రెజిలియన్ ప్రజలకు నాణ్యమైన ఆహారం, ఆరోగ్యం, విద్యపై ప్రభుత్వం పెట్టుబడి పెడుతోందని ఖర్చు చేయడం లేదని ఆయన ట్వీట్ చేశారు. ఈ కార్యక్రమాల ద్వారా ప్రజలు తమకు అవసరమైన కేలరీలు, మాంసకృత్తులను హక్కుగా పొందుతారని తెలిపారు. పిల్లలు తగినంత ఆహారాన్ని పొందుతారని, దేశంలో ఆకలి చావులను నివారించవచ్చని లూలా ట్వీట్ చేశారు. తమ ప్రభుత్వం ప్రజల జీవితాలను మెరుగుపరిచేందుకు యత్నిస్తోందని తెలిపారు. కమ్యూనిటీ కిచెన్లను ఏర్పాటు చేయడంతోపాటు చిన్న, మధ్య తరహా గ్రామీణ రైతులకు సహాయం చేయడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. కుటుంబ రైతుల విక్రయాల్లో పెరుగుదల ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమం అమలులో కనీసం 50 శాతం మహిళలు పాల్గొనవచ్చని పేర్కొన్నారు. కుటుంబ వ్యవసాయం ద్వారా 2,48,000 టన్నుల ఆహారాన్ని అందించే సామర్థ్యాన్ని కలిగి ఉన్నట్లు వ్యవసాయ అభివృద్ధి మంత్రిత్వ శాఖ తెలిపింది.

HDB FINANCIAL SERVICES

హెచ్‌డిబి ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్.

నమోదిత కార్యాలయం: రాధిక, 2వ అంతస్తు, లా గార్డెన్ రోడ్, నవరంగ్‌పుర, అహ్మదాబాద్-09.
శాఖ కార్యాలయం: #76-8-10/1, ఫ్లాట్ నెం.4, భవానీ టవర్స్, స్వాతి థియేటర్ రోడ్డు, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వెనుక, భవానీపురం, విజయవాడ-520012.

(అనుబంధం IV) - స్వాధీనత నోటీసు
రూల్ 8(1) చూచుట (స్థిరాస్తి కొరకు)

ఏదైతే, మెస్సర్స్. హెచ్‌డిబి ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్ యొక్క అధీకృత అధికారైన దిగువసంతకందారుడు, సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ యాక్ట్, 2002 క్రింద మరియు యొక్క సెక్షన్ 13(2) & ఆర్/డబ్ల్యూ రూల్ 8 & 9 సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 నిబంధనల ప్రకారం, 16 జనవరి, 2023 తేదీన డిమాండ్ నోటీసు జారీ చేయబడింది. ప్రత్యేక ఐడి నం.5774011 ద్వారా లింకు చేయబడిన లోను ఎ/సి నంలు.14670507, 3650818, పిలువబడిన దరఖాస్తుదారుడు/సహ-దరఖాస్తుదారులు/హామీదారులు, 1. రామాంజనేయ బైండింగ్ వర్క్స్, 2. వీరిశెట్టి జయలక్ష్మి, 3. వీరిశెట్టి మహేశ్వరరావు, అందరి నివాసం : డో.నం.8-13-121/2, నెహ్రూ నగర్, 12వ లైన్, గుంటూరు-522001, ఆంధ్రప్రదేశ్. పేర్కొన్న నోటీసు అందిన తేదీ నుండి 60 రోజులలోపు నోటీసులో పేర్కొన్న మొత్తాన్ని చెల్లించాలని తెలుపడమైనది.

దరఖాస్తుదారుడు/సహ-దరఖాస్తుదారులు/హామీదారుడు, మొత్తాన్ని తిరిగిచెల్లించుటలో విఫలమైనారు, దరఖాస్తుదారుడు/సహ-దరఖాస్తుదారులు/హామీదారుడు మరియు సాధారణ ప్రజానీకానికి ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమేమనగా ఆర్/డబ్ల్యూ రూల్ 8 మరియు 9 చదువుతూ సదరు చట్టం సెక్షన్ 13(4) క్రింద అతని అధికారాలను నిర్ణయించి అధ్యాయనం చేస్తూ దిగువ వివరించిన ఆస్థిని 17 జులై, 2023వ తేదీన దిగువసంతకందారుడు స్వాధీనపరుచుకున్నాడు.

ముఖ్యంగా దరఖాస్తుదారుడు/సహ-దరఖాస్తుదారులు/హామీదారుడు మరియు సాధారణ ప్రజానీకాన్ని హెచ్చరించడమేమనగా సదరు ఆస్థితో ఎలాంటి లావాదేవీలు జరుపరాదు మరియు ఏవైనా లావాదేవీలు మెస్సర్స్ హెచ్‌డిబి ఫైనాన్సియల్స్ లిమిటెడ్‌కు 13.01.2023 నాటికి రూ.76,51,570/- (డెభై ఆరు లక్షల యాభై ఒక వేల ఐదు వందల డెభై రూపాయలు మాత్రమే) మరియు దానిపిమ్మట వడ్డీ చెల్లించి జరుపవచ్చు.

దరఖాస్తుదారుడు/సహ-దరఖాస్తుదారులు/హామీదారుడు జాగ్రత్త వహించవల్సింది ఏమనగా సెక్యూర్డ్ అస్సెట్స్‌ను విడిపించుకొనుటకు మీకు లభించిన సమయం మేరకు చట్టం యొక్క సెక్షన్ 13 యొక్క సబ్ సెక్షన్ (8) నిబంధనలను అహ్వానించడమైనది.

స్థిరాస్తి వివరణ: గుంటూరు జిల్లా, గుంటూరు సబ్ రిజిస్ట్రీ, గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ ఏరియా, నెహ్రూ నగర్, 12వ లైన్ వద్ద ఉన్న ఆస్తి మొత్తం ఆ ముక్క మరియు పార్శిల్ స్థలం పై డో.నం.415/బి లో కొలిచే 500.0 చ.గ.లు. క్రింది విధమైన హద్దులు: సరిహద్దులు: ఉత్తరం: బి.సీత మహాలక్ష్మి మిగిలిన ఆస్తి 90.0 అ.లు., దక్షిణం: బి.వెంకట నరసింహం మరియు ఇతరుల ఆస్తి 90.0 అ.లు., తూర్పు: మున్సిపల్ రోడ్డు (నెహ్రూ నగర్, 12వ లైన్), పడమర: బి.అచ్చమ్మ మరియు పి సుబ్బారావు మరియు ఇతరుల ఆస్తి 50.0 అ.లు.

తేది: 17.07.2023
ప్రదేశం : విజయవాడ
సం/- అధీకృత అధికారి
హెచ్‌డిబి ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్.

రిషి సునాక్‌కు ఎదురుదెబ్బ

ఉప ఎన్నికల్లో 2 ఎంపి స్థానాల్లో ఓటమి

లండన్ : బ్రిటన్‌లో రిషి సునాక్ నాయకత్వంలోని అధికార కన్జర్వేటివ్ పార్టీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. మొత్తం మూడు పార్లమెంట్ స్థానాలకు జరిగిన ఉప ఎన్నికల్లో రెండు చోట్ల ఓటమి పాలైంది. కుంభకోణాలు, అధిక ద్రవ్యోల్బణంతో కన్జర్వేటివ్ పార్టీ రెండు స్థానాల్లో మెజారిటీని కోల్పోయింది. ఉత్తర ఇంగ్లాండ్‌లోని సెల్బీ-అయిన్‌స్టీ సీటులో లేబర్ పార్టీ గెలుపొందింది. గతంలో ఇక్కడ కన్జర్వేటివ్ పార్టీ భారీ మెజార్టీతో గెలుపొందింది. మరో స్థానమైన సోమర్‌సెట్ - ఫ్రోమ్‌ను లిబరల్ డెమొక్రటిక్ పార్టీ గెలుచుకుంది. కన్జర్వేటివ్ పార్టీ ఉక్స్‌బ్రిడ్జ్-సౌత్ రూయిస్లిప్ సీటును మాత్రం దక్కించుకుంది. గతంలో ఇది బ్రిటన్ మాజీ ప్రధాని బోరిస్ జాన్సన్ గెలిచిన స్థానం. ఇటీవల ఆయన ఎంపి పదవికి రాజీనామా చేయడంతో ఉప ఎన్నికలు నిర్వహించారు. ఈ ఫలితాలతో రిషి సునాక్ నాయకత్వంపై ఒత్తిడి పెరగవచ్చని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. వచ్చే ఏడాది జరగనున్న సాధారణ ఎన్నికల్లో కన్జర్వేటివ్ పార్టీకి సవాళ్లు ఎదురుకావచ్చని భావిస్తున్నారు. రిషి సునాక్ అధికారం చేపట్టిన తొమ్మిది నెలల్లో పార్టీలోని పలువురు నేతలు వివాదాలు, కుంభకోణాల్లో చిక్కుకున్నారు. అధిక ద్రవ్యోల్బణం ఆర్థిక పరిస్థితిని మరింతగా దిగజార్చింది. ఆయా సాధారణ ఎన్నికల్లో కెయిర్ స్టార్మర్ నేతృత్వంలోని లేబర్ పార్టీ నుండి అధికార పార్టీకి గట్టి పోటీ తప్పదని విశ్లేషకులు పేర్కొంటున్నారు.

ఉప ఎన్నికల్లో విజయం సాధించిన ఎంపి మాథర్‌ను అభినందిస్తున్న లేబర్‌పార్టీ నాయకులు కైర్ స్టార్మర్, ఏంజెలా రేనర్

HDB FINANCIAL SERVICES

హెచ్‌డిబి ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్

రిజిస్టర్డ్ ఆఫీసు: రాధికా, 2వ అంతస్తు, లా గార్డెన్ రోడ్డు, నవ్‌రంగపుర, అహ్మదాబాద్-380009,
శాఖ: #76-8-10/1, ఫ్లాట్ నెం. 4, భవాని టవర్స్, స్వాతి థియేటర్ రోడ్డు, యునియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పక్కన, భవానిపురం, విజయవాడ-520012.

డిమాండ్ నోటీసు

సెక్యూరిటైజేషన్ మరియు ఫైనాన్షియల్ అసెట్స్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్ట్ యాక్ట్,2002 యొక్క సెక్షన్ 13(13)తో చదువుతూ యు/ఎస్ 13(2) నోటీసు.

మీరు, కింద పేర్కొన్న రుణగ్రహీత/ తనఖాదారుకి, కంపెనీ మీకు వ్యతిరేకంగా ఫైనాన్షియల్ ఆస్తుల సెక్యూరిటీ మరియు రీకన్‌స్ట్రక్షన్ మరియు సెక్యూరిటీ ఇంట్రెస్ట్ చట్టం, 2002 అమలు కింద ప్రొసీడింగ్‌ను ప్రారంభించిందని మరియు రిజిస్టర్డ్ ద్వారా మీకు చట్టంలోని 13(2) కింద నోటీసు పంపబడిందని మీకు తెలియజేస్తున్నాము. పోస్ట్ యాక్ రుణగ్రహీతల బకాయిలు బట్వాడా చేయబడలేదు. అందువవల్ల మీరు నోటీసు తీసుకుని, ఈ పబ్లికేషన్ తేదీ నుండి 60 రోజులలోపు వడ్డీతోపాటు పేర్కొన్న ఖాతాకు వ్యతిరేకంగా పేర్కొన్న బకాయి రుణ మొత్తాన్ని చెల్లించవలసిందిగా కోరుతున్నారు. లేని పక్షంలో కంపెనీ మీ పై చర్య తీసుకుంటుంది. చట్టంలోని సెక్షన్ 13లోని సబ్ సెక్షన్ (4) కింద పేర్కొన్న సెక్యూరిటీని ఆసక్తులు మరియు ఖర్చులతో దాని బకాయిలను గ్రహించడం ద్వారా కంపెనీకి అందుబాటులో ఉన్న మరే ఇతర నివారణకు పక్షపాతం లేకుండా ఈ నోటీసు మీకు అందించబడిందని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు.

క్ర. సం.	రుణగ్రహీతలు/సహ-రుణగ్రహీతలు/హామీదారులు/తనఖాదారుల పేర్లు:	ఎన్‌పిఎ తేది	బకాయి మొత్తం
1	శ్రీ నాగేశ్వరి గోల్డ్ వర్క్స్, డో.నం.11-57/1-27, షాప్ నం.1, 12 కొట్ల కాంప్లెక్స, చాకలి సందు, శివాలయం ఎస్‌టి విజయవాడ-520002, ఆంధ్రప్రదేశ్. మరియు ఇక్కడ కూడా: డో.నం.1-1155, డో.నం.283/ఎ1, వార్డు నం.1, మూల్యాంకనం నం.1023001504, జిటి రోడ్డు, శ్రీనివాస మహల్ రోడ్డు, మంగళగిరి, గుంటూరు-522003. మరియు ఇక్కడ కూడా: డో.నం.1-1175, మున్సిపల్ వార్డు నం.1, మూల్యాంకనం నం.1023006775, డో.నం.276/బి1, బస్టాండ్ వద్ద జిటి రోడ్డు, మంగళగిరి, గుంటూరు-522503. 2. కంచర్ల శివ శంకర్, డో.నం.1-1175, పార్క్ రోడ్డు, 1వ లైన్, శ్రీనివాస మహల్ ప్రక్కన, మంగళగిరి గుంటూరు, గుంటూరు-522503, ఆంధ్రప్రదేశ్. 3. కంచర్ల వెంకట లక్ష్మి, డో.నం.1-1175, పార్క్ రోడ్డు, 1వ లైన్, శ్రీనివాస మహల్ ప్రక్కన మంగళగిరి, గుంటూరు, గుంటూరు-522503, ఆంధ్రప్రదేశ్.	05-05-2023 డిమాండ్ నోటీసు తేదీ Date: 15-05-2023 Loan Account No's: 6519237, 29998559	రూ॥ 85,30,076.94/- 11.05.2023 నాటికి భవిష్యత్ మరియు ఒప్పంద వడ్డీ వాస్తవికత వరకు కలిసి యాదృచ్ఛిక ఖర్చులు, ఖర్చు మరియు ఛార్జీలు మొదలైనవి.

సెక్యూరిటీల యొక్క షెడ్యూల్ 1: ఎపి, గుంటూరు జిల్లా, మంగళగిరి ఎస్ఆర్ఓ అధికార పరిధిలో మంగళగిరి గ్రామం వద్ద ఉన్న మున్సిపల్ వార్డు నం.1, ఆర్.సి.సి. రూఫ్ భవనం కలిగి ఉన్న గ్రౌండ్ తో మరియు 1వ అంతస్తుల నిర్మాణం 60 చ.గ.లు. లేదా 50.16 చ.మీ.లు. బేరింగ్ డో.నం.1-1175, డో.నం.276/బి1, హద్దులు: ఉత్తరం: పసుపులేటి నరసింహారావు ఆస్తి, దక్షిణం: మున్సిపల్ బజార్, తూర్పు: మున్సిపల్ బజార్, పడమర: అప్పికటల వెంకటేశ్వర్లు ఆస్తి. సెక్యూరిటీల షెడ్యూల్ 2 : ఎపి, గుంటూరు జిల్లా, మంగళగిరి ఎస్ఆర్ఓ అధికార పరిధిలో మంగళగిరి గ్రామం వద్ద ఉన్న పాత ఆర్.సి.సి. రూఫ్ భవనం నిర్మాణ పరిధిలో 105 చ.గ.లు. లేదా 87.79 చ.మీ.లు. ఉన్న డో.నం.1-1155, డో.నం.283/ఎ1ఎ, మున్సిపల్ వార్డు నం.1, హద్దులు: ఉత్తరం: షేక్ బీబీ జాన్ ఆస్తి 28.8 అ.లు., దక్షిణం: మున్సిపల్ బజార్ 28.8" అ.లు., తూర్పు: మున్సిపల్ బజార్ 33.6" అ.లు., పడమర: ఉమ్మడి గల్లీ బజార్ 32.6" అ.లు.

తేది: 22.07.2023, ప్రదేశం: విజయవాడ
సం/-అధీకృత అధికారి, హెచ్‌డిబి ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్.

ఇంగ్లండ్‌లో రైల్వే కార్మికుల సమ్మె

లండన్ : ఇంగ్లండ్‌లో రైల్వే కార్మికులు సమ్మెకు దిగారు. గురువారం జరిగిన సమ్మెలో 20 వేలకు పైగా రైల్వే కార్మికులు పాల్గొన్నారు. వేతనాలు పెంచాలని డిమాండ్‌తో పాటు ఉద్యోగాలు, సేవలను కాపాడుకునేందుకు కార్మికులు ఈ సమ్మెకు దిగారు. దాదాపు 2 వేల ఉద్యోగాలను తొలగిస్తామని, సుమారు వేయి టికెట్ కార్యాలయాలను మూసివేస్తామని రైల్వే ఉన్నతాధికారులు ప్రకటించారు. ఇందుకు వ్యతిరేకంగా కార్మికులు సమ్మెకు దిగారు. శనివారంతో పాటు ఈ నెల 29న కూడా సమ్మెకు పిలుపునిచ్చారు.

సెప్టెంబరు 4 వరకూ ఫ్యాక్ట్ చెక్ యూనిట్‌కి నోటిఫికేషన్ ఇవ్వం

• బాంబే హైకోర్టుకు తెలిపిన కేంద్రం

ముంబయి : ఇటీవల సవరించిన ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటి) నిబంధనల ప్రకారం 'ఫ్యాక్ట్ చెక్ యూనిట్ (ఎఫ్‌సియు)'కు సెప్టెంబరు 4 వరకూ నోటిఫికేషన్ జారీ చేయబోమని బాంబే హైకోర్టుకు కేంద్రప్రభుత్వం శుక్రవారం తెలిపింది. ఈ ఏడాది ఏప్రిల్‌లో సవరించిన ఐటి నిబంధనలకు వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్లపై జస్టిస్ గౌతమ్ పటేల్, జస్టిస్ నీలా గోఖలేతో కూడిన ధర్మాసనం విచారించింది. ఎడిటర్స్ గిల్డ్ ఆఫ్ ఇండియా, అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ మ్యాగజైన్ ఈ పిటిషన్లు వేశాయి. ఈ నిబంధనలు ఏకపక్షం, రాజ్యాంగ విరుద్ధంగా ఉన్నాయని పిటిషనర్లు తెలిపారు. పౌరుల ప్రాథమిక హక్కులపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతాయని పేర్కొన్నారు. ఈ విచారణకు కేంద్రం తరుపున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా తన వాదనలు వినిపించారు. ఆగస్టు 2 నుంచి ఆర్టికల్ 370పై సుప్రీంకోర్టు విచారణ ప్రారంభించనుందని, అందుకోసం తాను కొన్ని సన్నాహాలు చేయాల్సి ఉన్నందున విచారణను వాయిదా వేయాలని కోరారు. సెప్టెంబరు 4 వరకూ ఎఫ్‌సియుకు కేంద్రం నోటిఫికేషన్ జారీ చేయదని తెలిపారు. దీంతో విచారణను ఆగస్టు 31, సెప్టెంబరు 1వ తేదీలకు వాయిదా వేసింది.

28కి లక్ష్మింపేట కేసు వాయిదా

ప్రజాశక్తి- వంగర (విజయనగరం జిల్లా)

మండలంలోని లక్ష్మింపేట కేసును శ్రీకాకుళం కోర్టు జడ్జి ఎస్ఎం ఫణికుమార్ ఈనెల 28వ తేదికి వాయిదా వేశారు. ఈ మేరకు ఆయన లక్ష్మింపేట ప్రత్యేక కోర్టులో శుక్రవారం విచారణ చేపట్టారు. 80 మంది నిందితులకుగాను, 67 మంది హాజరు కాగా, ఒకరు గైర్హాజరయ్యారు. మిగతా 12 మంది మృతి చెందారు. రాజాం రూరల్ సిఐ హెచ్.ఉపేంద్రరావు, వంగర ఎస్ఐ ఆర్.జనార్దనరావు ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. 2012 జూన్ 12న లక్ష్మింపేట ఘటన జరిగిన తరువాత గ్రామంలో ప్రత్యేక కోర్టు ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి ఇంతవరకు కూడా సుమారుగా 30, 40 రోజుల వ్యవధిలో వాయిదాలుండేవి. ఈసారి మాత్రం వారం రోజుల వ్యవధిలో వాయిదా వేయడం గమనార్హం. దీంతో, కేసు వేగవంతం చేస్తున్నట్లు ఉందని పలువురు అభిప్రాయ పడుతున్నారు.

'సమతా'కు తృటిలో తప్పిన ముప్పు

ప్రజాశక్తి - పార్వతీపురం

హజరత్ నిజాముద్దీన్ నుంచి విశాఖ వస్తున్న సమత సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌కు పెను ప్రమాదం తృటిలో తప్పింది. శుక్రవారంర రాత్రి పార్వతీపురం టౌన్ స్టేషన్ నుంచి పార్వతీపురం స్టేషన్‌కు వస్తుండగా మార్గమధ్యలో ఇంజన్ నుంచి బోగీలు విడిపోయాయి. లోకో పైలట్ విషయాన్ని గ్రహించి తిరిగి ఇంజన్‌ను బోగీ వైపుతీసుకెళ్లి జోడించారు. దీంతో రైలు గంటన్నర నిలిచిపోయింది.

ట్రిపుల్ ఐటిలో ఆడిటోరియం ప్రారంభం

ప్రజాశక్తి- నూజివీడు రూరల్ (ఏలూరు జిల్లా)

నూజివీడు ట్రిపుల్ ఐటీలో స్టూడెంట్స్ యాక్టివిటీ కేంద్రంలో ఆధునీకరించిన చిన్న ఆడిటోరియాన్ని ఎంఎల్‌ఎ మేకా వెంకగ ప్రతాప్ అప్పారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్‌జియుకెటి ఎమిటస్ ఆచార్యులుగా పనిచేస్తున్న కె.వియన్నారావు రచించిన భవిష్యత్తు విద్య అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి డైరెక్టర్ ఆచార్య జివిఆర్.శ్రీనివాసరావు, పరిశోధన విభాగాధిపతి ఆచార్య జి.మోహనరావు, ప్రవేశాల కన్వీనర్ ఆచార్య గోపాల రాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నేత, ఐఎఎస్‌ల నివాసాలపై ఇడి దాడులు

రాయ్‌పూర్ : మనీలాండరింగ్ కేసుకు సంబంధించి శుక్రవారం ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) కాంగ్రెస్ నేత, పిసిసి కోశాధికారి రాంగోపాల్ అగర్వాల్ నివాసంతోపాటు పలువురు ఐఎఎస్ అధికారుల నివాసాలపై దాడులు నిర్వహించింది. రాయ్‌పూర్‌లో ఐఎఎస్ అధికారులు సాహు, అగర్వాల్, కోర్బాలోని కోర్బా మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ప్రభాకర్ పాండే నివాసాల్లో దాడులు నిర్వహించినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. బొగ్గు గనులు, మద్యం కుంభకోణంపై విచారణ జరుపుతున్నట్లు ఇడి పేర్కొంది. ఛత్తీస్‌గఢ్‌లో రూ.2,000 కోట్ల మద్యం కుంభకోణానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో గత కొన్ని రోజులుగా ఇడి దర్యాప్తు చేపడుతున్న సంగతి తెలిసిందే.

స్వాధీనత ప్రకటన

1	1. అనిల్ కుమార్ పుజల, డో.నం.7-172, డో.నం.56/బి1, మూల్యాంకనం నం.1134, బ్లాక్ నం.7, గోరంట్ల గ్రామ పంచాయతి, అను చికెన్ సెంటర్, ఆంజనేయ స్వామి గుడి రోడ్డు వద్ద, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522034, 2. మంగమ్మ పూజల, డో.నం.7-172, డో.నం.56/బి1, మూల్యాంకనం నం.1134, బ్లాక్ నం.7, గోరంట్ల గ్రామ పంచాయతి, అను చికెన్ సెంటర్, ఆంజనేయ స్వామి గుడి రోడ్డు వద్ద, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522034, 3. ఎస్.వి.ఎలక్ట్రానిక్స్ అండ్ సెక్యూరిటీ సిస్టమ్స్, డో.నం.7-172, డో.నం.56/బి1, మూల్యాంకనం నం.1134, బ్లాక్ నం.7, గోరంట్ల గ్రామ పంచాయతి, అను చికెన్ సెంటర్, ఆంజనేయ స్వామి గుడి రోడ్డు వద్ద, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522034, 4. శివ నాగేశ్వరి అంగజాల, డో.నం.7-172, డో.నం.56/బి1, మూల్యాంకనం నం.1134, బ్లాక్ నం.7, గోరంట్ల గ్రామ పంచాయతి, అను చికెన్ సెంటర్, ఆంజనేయ స్వామి గుడి రోడ్డు వద్ద, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522034, 5. అనిల్ కుమార్ పూజల, ఫ్లాట్ నం.3సి-303, 2వ అంతస్తు, బొమ్మరిల్లు అపార్ట్‌మెంట్, ఐడి హాస్పిటల్ ఎదురు, అమరావతి రోడ్డు, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522034. 6. మంగమ్మ పూజల, ఫ్లాట్ నం.3సి-303, 2వ అంతస్తు, బొమ్మరిల్లు అపార్ట్‌మెంట్, ఐడి హాస్పిటల్ ఎదురు, అమరావతి రోడ్డు, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522034. 7. ఎస్ వి ఎలక్ట్రానిక్స్ అండ్ సెక్యూరిటీ సిస్టమ్స్, ఫ్లాట్ నం.3సి-303, 2వ అంతస్తు, బొమ్మరిల్లు అపార్ట్‌మెంట్, ఐడి హాస్పిటల్ ఎదురు, అమరావతి రోడ్డు, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522034. 8. శివ నాగేశ్వరి అంగజాల, ఫ్లాట్ నం.3సి-303, 2వ అంతస్తు, బొమ్మరిల్లు అపార్ట్‌మెంట్, ఐడి హాస్పిటల్ ఎదురు, అమరావతి రోడ్డు, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522034. 9. మంగమ్మ పూజల, హౌ.నం.7-172, ఆకుల వారి వీధి, గోరంట్ల, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522034. 10. శివ నాగేశ్వరి అంగజాల, డో.నం.6-229ఎ, అమరావతి మెయిన్ రోడ్డు, గోరంట్ల, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522034. 11. ఎస్ వి ఎలక్ట్రానిక్స్ అండ్ సెక్యూరిటీ సిస్టమ్స్, 5-66, సాయి బాబా రోడ్డు, విద్యానగర్, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522007. 12. అనిల్ కుమార్ పూజల, కేరాఫ్. ఎస్.వి.ఎలక్ట్రానిక్స్ అండ్ సెక్యూరిటీ సిస్టమ్స్, 4-5-66, సాయి బాబా రోడ్డు, విద్యానగర్, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522007. లోన్ ఎకౌంట్ నం.: LNVIJLAP-02190019933, LNVIJLAP-02190020072 & LNVIJLAP-09200073262	09-07-2023	17.07.2023	రూ.23,27,253.86/- (ఇరవై మూడు లక్షల ఇరవై ఏడు వేల రెండు వందల యాభై మూడు రూపాయల ఎనభై ఆరు పైసలు మాత్రమే) 12.07.2023 వరకు బాకీ ఉన్న ప్రిన్సిపల్, బకాయిలు (పెరిగిన ఛార్జీలతో సహా) మరియు వడ్డీ.

స్థిరాస్తి యొక్క వివరణ) తనఖా ఆస్తులు: ఆంధ్రప్రదేశ్-522034, గుంటూరు జిల్లా, గుంటూరు ఉపజిల్లా, గోరంట్ల గ్రామం మరియు గ్రామ పంచాయతి వద్ద ఉన్న ఆస్తి మొత్తం ఆ ముక్క మరియు పార్శిల్ సైట్ విస్తీర్ణం 200 చ.గ.లు. లేదా 167.23 చ.మీ.లు. మరియు అందులో ఆర్‌సిసి రూఫ్ నిర్మాణాలు, విభజన నం.56/బి1, డో.నం.7-712, మూల్యాంకనం నం.1134, బ్లాక్ నం.7, హద్దులు: తూర్పు: ఎర్రంశెట్టి సాంబశివరావు ఆస్తి, పడమర: రోడ్డు, ఉత్తరం: దామరాజు హనుమంతరావు ఇతరులకు అమ్మిన ఆస్తి, దక్షిణం: వల్లెల సుబ్బారావు ఆస్తి.

వడ్డీ మరియు ఖర్చు, ఛార్జీలు, ఖర్చులతో పాటు సదరు మొత్తాన్ని ఈ నోటీసు ప్రచురించిన తేదీ నుండి 60 రోజుల వ్యవధిలో చెల్లించవలసిందిగా ఇక్కడ పేర్కొన్న రుణగ్రహీతలను మేము ఇందు మూలంగా పిలుస్తున్నాము. విఫలమైనయెడల రుణగ్రహీతలు, తనఖాదారులు మరియు హామీదారుల యొక్క సెక్యూర్డ్ అసెట్స్‌ను స్వాధీనం చేసుకోవడంతో సహా అన్ని లేదా ఏదైనా ఒకటి లేదా అంతకంటే ఎక్కువ సెక్యూర్డ్ అసెట్స్‌కు వ్యతిరేకంగా ఈ చట్టం యొక్క నిబంధనల ప్రకారం అవసరమైన చర్యలు తీసుకునే స్వేచ్ఛ మాకు ఉంటుంది.

దయచేసి SARFAESI చట్టంలోని సెక్షన్ 13(13) ప్రకారం, కంపెనీ యొక్క ముందస్తు వ్రాతపూర్వక అనుమతి లేకుండా పైన పేర్కొన్న సెక్యూర్డ్ అసెట్స్‌లను అమ్మకం, లీజు చేయకుండా మీరందరూ నిషేధించబడ్డారు. మీ ద్వారా ఏదైనా ఉల్లంఘన జరిగితే SARFAESI చట్టంలోని పేర్కొన్న సెక్షన్ యొక్క సెక్షన్ 29 మరియు/లేదా దీనికి సంబంధించి ఏదైనా ఇతర చట్టపరమైన నిబంధనల కింద నిర్దేశించిన శిక్షా నిబంధనలను అమలు చేయాల్సి వస్తుంది.

దయచేసి సెక్షన్ 13లోని సబ్ సెక్షన్ (8) ప్రకారం, ఎబిహెచ్ఎఫ్ఎల్ యొక్క బకాయిలు అన్ని ఖర్చులు, ఛార్జీలు మరియు ఎబిహెచ్ఎఫ్ఎల్ ద్వారా అమ్మకానికి లేదా బదిలీకి నిర్ణయించిన తేదికి ముందు ఎప్పుడైనా ఎబిహెచ్ఎఫ్ఎల్ కి టెండర్ చేయబడితే, సెక్యూర్డ్ అసెట్ ఎబిహెచ్ఎఫ్ఎల్ ద్వారా విక్రయించబడదు మరియు ఎబిహెచ్ఎఫ్ఎల్ ద్వారా సెక్యూర్డ్ అసెట్‌ని బదిలీ చేయడం లేదా విక్రయించడం వంటి తదుపరి చర్యలు తీసుకోబడదు.

ప్రదేశం: గుంటూరు
తేది: 22.07.2023

సం/- అధీకృత అధికారి
(ఆదిత్య బిర్లా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్)

ప్రజాశక్తి
www.prajasakti.com

ఆరని మణిపూర్ మంటలు

మణిపూర్ మంటలు చల్లారడం లేదు. అమానవీయ ఘటనలు ప్రతిరోజూ వెలుగుచూస్తూనే ఉన్నాయి. తాజాగా ఓ కుకీ వ్యక్తి తలనరికి వేలాడదీసిన వీడియో వెలుగుచూసింది. మూక ఘాతుకం నుంచి తన భార్యను కాపాడలేకపోయానంటూ కార్గిల్ యుద్ధవీరుడు కన్నీరుపెట్టుకున్నాడు.

సిఎం తక్షణమే తప్పుకోవాలి

- సిపిఎం పొలిట్‌బ్యూరో డిమాండ్
- దేశవ్యాప్తంగా నిరసనలకు పిలుపు

న్యూఢిల్లీ : మణిపూర్ ముఖ్యమంత్రి తక్షణమే రాజీనామా చేయాలని సిపిఎం పొలిట్‌బ్యూరో డిమాండ్ చేసింది. మణిపూర్‌లో జరిగిన సంఘటనలను నిరసిస్తూ, మణిపూర్ మహిళా బాధితులకు, ప్రజలకు సంఘీభావంగా దేశవ్యాప్తంగా నిరసన కార్యాచరణ చేపట్టాలని, ముఖ్యమంత్రి రాజీనామాకై డిమాండ్ చేయాలని సిపిఎం తన శాఖలకు పిలుపునిచ్చింది. ఈ మేరకు పొలిట్‌బ్యూరో ఒక ప్రకటన చేసింది. మణిపూర్‌లో ఇద్దరు గిరిజన మహిళలను వివస్త్రలను చేసి, ఊరేగించిన ఘటనతో దేశం యావత్తు రగిలిపోయింది. పైగా వారిలో ఒక మహిళపై సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు, ఆమెను కాపాడేందుకు వెళ్లిన ఆమె కుటుంబ సభ్యుల ఇద్దరిని హత్య చేశారు. సంఘటన జరిగిన రెండు వారాల్లోపే బాధిత కుటుంబాలు అత్యంత ధైర్యసాహసాలతో ఎఫ్‌ఐఆర్ నమోదు చేసినప్పటికీ పోలీసులు ఇంతవరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. అంటే ఈ ఘాతుకానికి పాల్పడిన నేరస్తులకు రక్షణ కల్పించడానికి మణిపూర్‌లోని బిజెపి ప్రభుత్వం ప్రత్యక్షంగా సాయపడుతోందని పొలిట్‌బ్యూరో విమర్శించింది. రెండున్నర మాసాలుగా రాష్ట్రం మండుతోంది. అయినా ముఖ్యమంత్రిని, రాష్ట్ర ప్రభుత్వాన్ని కేంద్ర ప్రభుత్వం, బిజెపి అగ్ర నాయకత్వం సమర్థిస్తూ వస్తోంది. నెల తరబడి మౌనం పాటిస్తూ వచ్చిన ప్రధాని చిట్టచివరకు చేసిన ప్రకటన జరిగిన సంఘటనను, మణిపూర్‌లో సుదీర్ఘంగా చెలరేగుతున్న హింసాకాండను, పైగా ముఖ్యమంత్రి పక్షపాత పాత్రను చాలా చిన్నది చేసేలా ఉందని పొలిట్‌బ్యూరో విమర్శించింది. డబుల్ ఇంజన్ ప్రభుత్వం జవాబుదారీతనం అనే సూత్రాన్ని తుడిచిపెట్టి సమాధి చేసిందని ఆ ప్రకటన విమర్శించింది. బిజెపి ప్రభుత్వ సుపరిపాలన వాదనపై ఇది అత్యంత గ్రాఫిక్ వ్యాఖ్యానమని పేర్కొంది.

హర్యానాలో ఆందోళన చేస్తున్న మహిళా సంఘాల నాయకులు, కార్యకర్తలు

3 సార్లు ఫిర్యాదు చేసినా స్పందన లేదు : రేఖా శర్మ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

మణిపూర్ అల్లర్ల నేపథ్యంలో మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలపై అధికారుల నుంచి స్పందన లేదని జాతీయ మహిళా కమిషన్ (ఎన్‌డబ్ల్యుసి) ఛైర్‌పర్సన్ రేఖాశర్మ తెలిపారు. గత మూడు నెలల్లో మూడు సార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా, స్పందన కరువైందని పేర్కొన్నారు. మే 4న ఇద్దరు మహిళలను నగ్నంగా ఊరేగించిన ఘటనపై దేశవ్యాప్తంగా ఆందోళనలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో శుక్రవారం నాడిక్కడ ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో రేఖా శర్మ మాట్లాడారు. ఈ ఘటనకు సంబంధించిన జూన్ 12న జాతీయ మహిళా కమిషన్‌కు ఫిర్యాదు వచ్చినా, ఎందుకు పట్టించుకోలేదని విలేకరులు ఆమెను ప్రశ్నించారు. తనకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని, జులై 19న సామాజిక మాధ్యమాల్లో వీడియోలు వైరల్ కావడంతో సుమోటోగా స్వీకరించి.. వివరణ ఇవ్వాల్సిందిగా ఆ రాష్ట్ర అధికారులకు ఆదేశాలు జారీ చేశామని రేఖాశర్మ చెప్పారు. మణిపూర్‌లో పలువురు మహిళలపై జరుగుతున్న ఆకృత్యాల గురించి తనకు ఫిర్యాదులు అందినట్లు ఆమె అంగీకరించారు. 'మణిపూర్‌లో మహిళలపై హింసకు సంబంధించి ఆ రాష్ట్రం నుంచి మాత్రమే కాకుండా.. ఇతర రాష్ట్రాలు, విదేశాల నుంచి కూడా లేఖలు వచ్చాయి. మూడు సార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా, ఎలాంటి స్పందన లేదు. తాజా ఘటనకు సంబంధించిన వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో సుమోటోగా స్వీకరించాం.. అధికారులను వివరణ కోరాం' అని రేఖా శర్మ తెలిపారు. మే 18, మే 29, జూన్ 19 తేదీల్లో అధికారులకు రాసిన లేఖలను రేఖాశర్మ మీడియాకు చూపించారు.

శాంతిని నెలకొల్పండి

విద్యార్థి, యువజన సంఘాల ఆందోళన

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

నెల తరబడి అల్లర్లు చెలరేగుతున్న మణిపూర్‌లో కేంద్ర ప్రభుత్వం తక్షణమే శాంతిని నెలకొల్పాలని డిమాండ్ చేస్తూ, కుకీ మహిళలను అమానుషంగా హింసించడాన్ని నిరసిస్తూ దేశ రాజధాని ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద విద్యార్థి, యువజన సంఘాలు ఆందోళన చేపట్టాయి. ఎస్‌ఎఫ్‌ఐ, డివైఎఫ్‌ఐ సంయుక్తంగా నిర్వహించిన ఈ ఆందోళనలో మణిపూర్ స్థానికులు కూడా పాల్గొన్నారు. డివైఎఫ్‌ఐ ఆలిండియా అధ్యక్షులు, రాజ్యసభ ఎంపి ఎఎ రహీమ్ మాట్లాడుతూ మోడీ పాలనలో ఏ మహిళకూ భద్రత లేదని, మణిపూర్ ప్రజలకు భద్రత కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని విమర్శించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలను పునరుద్ధరించేందుకు ప్రధాని, కేంద్ర ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎస్‌ఎఫ్‌ఐ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విపి సాను, మయూఖ్ బిస్వాస్, జెఎన్‌యుఎస్‌యు అధ్యక్షురాలు ఐషీ ఘోష్ తదితరులు మాట్లాడారు. మణిపూర్ దారుణాలను నిరసిస్తూ త్రిపుర, ఉత్తరప్రదేశ్, హర్యానా తదితర రాష్ట్రాల్లోనూ పెద్దఎత్తున ఆందోళనలు నిర్వహించారు.

వ్యక్తి తలనరికి వేలాడదీసిన వీడియో వైరల్

మణిపూర్‌లో మరో షాకింగ్ సంఘటన వెలుగులోకి వచ్చింది. ఓ వ్యక్తి తలనరికి కంచెకు వేలాడదీసిన వీడియో క్లిప్ తాజాగా వైరల్‌గా మారింది. ఈ దారుణ సంఘటన జులై 2న బిష్ణుపూర్ జిల్లాలో చోటుచేసుకుంది. అర్ధరాత్రి వేళ జరిగిన ఘర్షణల్లో కుకీ వర్గానికి చెందిన నలుగురిని మైతీ వర్గానికి చెందిన వారు దారుణంగా చంపారు. డేవిడ్ థీక్ అనే వ్యక్తి తల నరికి.. ఆ ప్రాంతంలో వెదురు కర్రలతో చేసిన కంచెకు తలను వేలాడదీశారు.

దేశాన్ని రక్షించాను.. నా భార్యను కాపాడుకోలేకపోయా..

- కార్గిల్ యుద్ధ వీరుడి ఆవేదన

మణిపూర్‌లో మహిళల్ని నగ్నంగా ఊరేగించిన ఘటన ఎంత ఆవేదన కలిగిస్తోందో.. ఈ బాధిత మహిళల్లో ఒకరు దేశాన్ని రక్షించే సైనికుడి భార్య అన్న విషయం కూడా అంతే ఆవేదన కలిగిస్తోంది. కార్గిల్ యుద్ధంలో పోరాడి దేశాన్ని రక్షించుకోగలిగాను కానీ.. అవమాన భారం నుంచి తన భార్యను రక్షించలేకపోయానని ఆ సైనికుడు ఆక్రందన వ్యక్తం చేస్తున్నారు. సుమారు మూడు గంటల పాటు ఈ నరకయాతన కొనసాగిందని, తన భార్య ప్రాణాలతో బయటపడినా.. తీవ్ర మానసిక క్షోభ, భయాందోళనలను ఇప్పటికీ అనుభవిస్తోందని తెలిపారు. 'కార్గిల్ యుద్ధ సమయంలో ముందు వరసలో ఉండి పోరాటం చేశాను. ఇప్పుడు యుద్ధభూమి కంటే నా స్వగ్రామాన్ని భయంకరంగా భావిస్తున్నాను' అని మీడియాతో ఆవేదన వ్యక్తం చేశారు. రిటైర్మెంట్ తరువాత తన భార్యను, గ్రామాన్ని ఇంటిని, తోటి గ్రామస్తులను రక్షించుకోలేకపోయానని తెలిపారు. ప్రస్తుతం ఈ దంపతులు ఒక సహాయక శిబిరంలో తలదాచుకుంటున్నారు. ఆ రోజు దుండగులు తమ తలపై గురిపెట్టి బలవంతంగా దుస్తులు తొలగించారని, గుంపు ముందు నృత్యం చేయించారని బాధిత మహిళ తెలిపింది.

ఆ దారుణానికి ముందు... హత్యలు.. లూటీలు..

ఎఫ్‌ఐఆర్‌లో అభియోగాలు

ఇంఫాల్, న్యూఢిల్లీ : మణిపూర్‌లో ఒక గూండాల మూక ఇద్దరు గిరిజన మహిళల్ని వివస్త్రలను చేసి ఊరేగించిన దారుణ సంఘటన మే 4న జరగ్గా, దేశవ్యాప్త ఆందోళనల నేపథ్యంలో శుక్రవారం సైకుల్ పోలీస్ స్టేషన్‌లో ఎఫ్‌ఐఆర్ నమోదు చేశారు. ఈ ఎఫ్‌ఐఆర్ నకలును కొన్ని మీడియా సంస్థలు సంపాదించాయి. దీని ప్రకారం ఆ రోజున మహిళలను నగ్నంగా ఊరేగించడానికి ముందు ఈ గూండాల మూక గ్రామాన్ని పూర్తిగా లూటీ చేయడంతోపాటు హత్యలు, ఇళ్లను తగులబెట్టడం వంటి దుశ్చర్యలకు పాల్పడింది. నగ్నంగా ఊరేగించడానికి మహిళను రక్షించడానికి ఆమె సోదరుడు ప్రయత్నించగా, అతన్ని దారుణంగా హత్య చేశారు. ఎఫ్‌ఐఆర్ ప్రకారం కాంగ్‌పోక్పి జిల్లాలోని సైకుల్ పోలీస్ స్టేషన్‌కు దక్షిణంగా 68 కిలోమీటర్ల దూరంలో ఉన్న గ్రామంలోకి సుమారు 900 నుంచి వెయ్యిమందితో ఉన్న సాయుధ గూండాల మూక మే 4న సుమారు మధ్యాహ్నం 3 గంటల సమయంలో ప్రవేశించింది. వీరి చేతిలో ఎకె రైఫిల్స్, ఎస్ఎల్ఆర్, ఐఎన్ఎస్ఎఎస్, 303 రైఫిల్స్ వంటి అత్యాధునిక ఆయుధాలు ఉన్నాయి. గూండాల మూక ప్రవేశించడంతో గ్రామంపై విరుచుకుపడింది. విధ్వంసం సృష్టించింది. అన్ని చరాస్తులను లూటీ చేసి ఒకచోట నేల మీద వేసి తగులబెట్టింది. ఇళ్లలోని నగదు, ఫర్నీచర్, ఎలక్ట్రానిక్ వస్తువులు, ఆహార ధాన్యాలు ఇలా అన్ని వస్తువులను తగులబెట్టారు. ఈ దాడితో భయపడి ఐదుగురు గ్రామస్తులు సమీప అడవిలోకి పారిపోయారు. వారిని పోలీసులు రక్షిస్తే వారి వద్ద నుంచి కూడా ఆ గ్రామస్తుల్ని ఈ మూక ఎత్తుకెళ్లింది. ఈ ఘటనకు సంబంధించిన వీడియో ఆధారంగా ఇప్పటివరకూ నలుగుర్ని పోలీసులు అరెస్టు చేశారు. ఈ నలుగురిలో ఒకరి ఇంటిని స్థానిక ప్రజలు దహనం చేసి, నిప్పు అంటించారు. తౌబాల్ జిల్లాలోని పేచీ అవాంగ్‌లో ఉన్న నిందితుని ఇంటిపై ఈ దాడి జరిగినట్లు పోలీసులు చెప్పారు.

నలుగురు నిందితులకు 11 రోజుల పోలీస్ కస్టడీ

నిందితులుగా ఉన్న నలుగురికి స్థానిక కోర్టు 11 రోజుల పోలీస్ కస్టడీ విధించింది.

శ్రీలంకలో తమిళులకు గౌరవప్రదమైన జీవితం కల్పించండి

: విక్రమసింఘేకు మోడీ విజ్ఞప్తి

న్యూఢిల్లీ : శ్రీలంక 13వ సవరణను అమలు చేసి, రాష్ట్ర ఎన్నికలను నిర్వహించాలని ఆ దేశ అధ్యక్షులు రణిల్ విక్రమసింఘేకు భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ శుక్రవారం విజ్ఞప్తి చేశారు. 13వ సవరణతో శ్రీలంకలో తమిళులకు గౌరవప్రదమైన జీవితం లభిస్తుందని మోడీ పేర్కొన్నారు. రెండు రోజుల పర్యటన నిమిత్తం రణిల్ విక్రమసింఘే గురువారం న్యూఢిల్లీకి చేరుకున్నారు. ఢిల్లీ విమానాశ్రయంలో కేంద్ర విదేశాంగశాఖ సహాయమంత్రి వి. మురళీధరన్ స్వాగతం పలికారు. శుక్రవారం ఢిల్లీలోని హైదరాబాద్ హౌస్‌కి చేరుకున్న విక్రమ్‌సింఘేకు ప్రధాని నరేంద్రమోడీ సాదరంగా స్వాగతం పలికారు. ద్వైపాక్షిక సంబంధాలపై సమావేశమయ్యారు. ఈ సందర్భంగా విదేశాంగ మంత్రిత్వశాఖ అధికార ప్రతినిధి అరిందమ్ బాగ్చి 'ఈ ఏడాది రెండు దేశాలు దౌత్య సంబంధాలకు 75 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా.. దీర్ఘకాలంగా ఇరు దేశాల మధ్య ఉన్న సంబంధాలను సమీక్షించి, రాబోయే రోజుల్లో ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలపర్చుకోవడానికి ఈ సమావేశం దోహపడతుంది' అని ట్వీట్ చేశారు. కాగా, 13వ సవరణ అనేది 30 ఏళ్ల క్రితం నాటి శ్రీలంక చట్టం, ఈ చట్టం అమలుతో 9 రాష్ట్రాలకు అధికార వికేంద్రీకరణ జరుగుతుంది. ఈ చట్టం ఇంకా అమల్లోకి రాలేదు. ప్రధానమంత్రి మోడీని కలిసే ముందు కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్‌తోనూ, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ ధోవల్‌తోనూ శ్రీలంక అధ్యక్షులు భేటీ అయ్యారు.

గౌతం అదానీ భేటీ

శ్రీలంక అధ్యక్షుడు రణిల్ విక్రమ్ సింఘెతో అదానీ గ్రూప్ అధిపతి గౌతం అదానీ భేటీ అయ్యారు. "కొలంబో పోర్టు వెస్ట్ కంటైనర్ టెర్మినల్ అభివృద్ధి, 500 మెగావాట్ విండ్ ప్రాజెక్ట్, గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్ట్ గురించి చర్చించాం" అని అదానీ ట్వీట్ చేశారు. ప్రధాని మోడీ మద్దతుతో శ్రీలంకలో విద్యుత్, పోర్టుల అభివృద్ధి తదితర ప్రాజెక్టులను అదాని గ్రూపు చేపడుతోందనే విమర్శలు ఉన్నాయి.

ఇజ్రాయిల్ కాల్పుల్లో

పాలస్తీనా యువకుడి మృతి

- మరో ముగ్గురికి తీవ్రగాయాలు

నబ్లూస్ : ఆక్రమిత వెస్ట్ బ్యాంక్‌పై ఇజ్రాయిల్ సైన్యం దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. శుక్రవారం ఉదయం ఇజ్రాయిల్ సైన్యం జరిపిన కాల్పుల్లో 19 ఏళ్ల పాలస్తీనీయుడు మరణించాడు. మరో ముగ్గురు పాలస్తీనీయులు తీవ్రంగా గాయపడ్డారు. వెస్ట్‌బ్యాంక్‌లోని నబ్లూస్ నగరంలో ఒక ప్రార్థనా స్థలానికి సమీపంలో ఈ ఘటన జరిగింది. మృతుడ్ని బద్రా అల్ మస్రీగా గుర్తించారు. కొన్ని దశాబ్దాల నుంచి వెస్ట్‌బ్యాంక్‌లో ఇజ్రాయిల్ సైన్యం దాడులకు పాల్పడుతున్నా.. కొన్ని నెలలు నుంచి ఇది తీవ్రంగా మారింది. ఈ ఏడాదిలోనే 150 మందికిపైగా పాలస్తీనా పౌరులు ఇజ్రాయిల్ సైన్యం చేతిలో ప్రాణాలు కోల్పోయారు. 1967లో వెస్ట్‌బ్యాంక్‌ను ఇజ్రాయిల్ ఆక్రమించుకుంది.

వేతనాలను పెంచాలని కోరుతూ

ఇంగ్లండ్ వ్యాప్తంగా కన్సల్టెంట్ల 48గంటల సమ్మె

లండన్ : ఇంగ్లండ్‌లో వేలాదిమంది ఎన్‌హెచ్‌ఎస్ కన్సల్టెంట్ డాక్టర్లు గురువారం 48గంటల సమ్మెను ప్రారంభించారు. వేతన పెంపుపై ప్రభుత్వం నుండి అపహాస్య రీతిలో ప్రతిపాదన వచ్చిన నేపథ్యంలో వారు సమ్మెకు దిగారు. బ్రిటీష్ మెడికల్ అసోసియేషన్ (బిఎంఎ)కి చెందిన 24వేలమంది సభ్యులు శనివారం ఉదయం 7గంటల వరకు సమ్మె కొనసాగించనున్నారు. పారిశ్రామిక కార్యాచరణకు దిగేందుకు అనుకూలంగా 86శాతం మంది సభ్యులు గత నెలలో ఓటు వేయడంతో ఈ సమ్మెను చేపట్టారు. సెంట్రల్ లండన్‌లో బిఎంఎ ప్రధాన కార్యాలయంలో గురువారం ర్యాలీ జరిగింది. కన్సల్టెంట్స్ కమిటీ ఛైర్మన్ డాక్టర్ విశాల్ శర్మ హాజరయ్యారు. ఏడు మాసాల్లో ఒకే ఒక్కసారి ఆరోగ్య మంత్రి స్టీవ్ బార్క్లే డాక్టర్లతో భేటీ అయ్యారని, వేతన పెంపుపై తదుపరి చర్చలు జరిపేందుకు తిరస్కరించారని డాక్టర్ శర్మ తెలిపారు. ఆరు శాతం వేతనాలు పెంచుతామని ప్రభుత్వం పేర్కొంది. వాస్తవిక ప్రాతిపదికన చూసినట్లైతే తాము ఇంటికి తీసుకెళ్లే వేతనాలు గత 14 ఏళ్లలో మూడో వంతుకు పడిపోయాయని డాక్టర్లు చెబుతున్నారు. 1970ల తర్వాత మొదటిసారిగా కన్సల్టెంట్లు సమ్మె చేస్తున్నారని శర్మ తెలిపారు.

ప్రభుత్వ వైఖరి పట్ల డాక్టర్లు చాలా ఆగ్రహంతో వున్నారని చెప్పారు. ఇంతటి కార్యాచరణకు దిగాలని తామెన్నడూ అనుకోలేదని, కానీ ప్రభుత్వ వైఖరి వల్ల చేపట్టాల్సి వచ్చిందని చెప్పారు. సమ్మెకు దిగకుండా పరిష్కార మార్గాన్ని కనుగొనేందుకు ప్రభుత్వానికి ఏడు మాసాల గడువున్నా ప్రభుత్వం, మంత్రులు ఎలాంటి చర్యలు చేపట్టలేదని విమర్శించారు. ఈ వారంలో జూనియర్ డాక్టర్లు కూడా ఐదు రోజులు వాకౌట్ చేశారు. ఎన్‌హెచ్‌ఎస్ చరిత్రలోనే ఇది సుదీర్ఘమైనది.

లండన్‌లో ఆందోళన చేస్తున్న వైద్యులు

బ్రిజ్ భూషణ్‌కు బెయిల్‌పై ఐద్వా ఆందోళన

న్యూఢిల్లీ : రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌కు ఢిల్లీ కోర్టు గురువారం బెయిల్ మంజూరు చేయడంపై ఐద్వా ఒక ప్రకటనలో తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. మహిళల పట్ల బ్రిజ్ భూషణ్ ఎంత బహిరంగంగా లైంగిక వేధింపులకు పాల్పడ్డారో ఐదుగురు మహిళా రెజ్లర్ల ఎఫ్ఐఆర్‌లు తెలియజేస్తున్నాయని, పైగా దేశ విదేశాల్లో వారిని లైంగికంగా వేధించారని ఆ ప్రకటన పేర్కొంది. ఎఫ్ఐఆర్ నమోదైనా కొద్ది కాలం క్రితం వరకు బ్రిజ్ భూషణ్‌ను అరెస్టు చేయలేదని పేర్కొంది. బెయిల్‌ను ప్రాసిక్యూషన్ వ్యతిరేకించకపోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోందని ఐద్వా పేర్కొంది. పైగా సాక్షులను ప్రభావితం చేయరాదంటూ ఒక షరతును విధించాలని ప్రాసిక్యూషన్ చెప్పిందని తెలిపింది. కానీ నిజానికి ఈ షరతుకు కట్టుబడి వుండే అవకాశాలు అస్సలు వుండవని, గతంలోని బెదిరింపులు, వేధింపులను దృష్టిలో పెట్టుకుంటే ఈ విషయం తేటతెల్లమవుతుందని ఐద్వా పేర్కొంది.

ముస్లిం పర్సనల్ లా సమీక్షపై జాతీయ మహిళా కమిషన్‌కు లేఖ

ఇటీవల జాతీయ మహిళా కమిషన్ కేవలం ముస్లిం పర్సనల్ లాపై మాత్రమే సమీక్ష జరపడం పట్ల ఐద్వా ఆందోళన వ్యక్తం చేసింది. ఈ మేరకు జాతీయ మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ రేఖా శర్మకు లేఖ రాసింది. ఇతర పర్సనల్ లాల్లోని అసమానతలను పట్టించుకోకుండా కేవలం ముస్లిం పర్సనల్ లాపైనే దృష్టి పెట్టడాన్ని ఆ లేఖ విమర్శించింది. యుసిసిపై సలహాలు, సూచనలు అందజేయాల్సిందిగా ఇటీవల లా కమిషన్ కోరిన నేపథ్యంలో జాతీయ మహిళా కమిషన్ ఈ సమీక్ష జరిపింది. ముస్లిం పర్సనల్ లాని సంస్కరించాల్సి వుందంటూ మోడీ ప్రభుత్వం జరుపుతున్న ప్రచారానికి అనుగుణంగానే ఈ చర్య వుందని విమర్శించింది.

రాహుల్ గాంధీ పరువు నష్టం కేసులో...

ప్రతివాదులకు సుప్రీం నోటీసులు

- విచారణ ఆగస్టు 4కి వాయిదా

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

పరువు నష్టం కేసులో గుజరాత్ కోర్టు ఇచ్చిన తీర్పుపై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ దాఖలు చేసిన పిటిషన్ విచారణను సుప్రీంకోర్టు ఆగస్టు 4కు వాయిదా వేసింది. ప్రతివాదులు బిజెపి ఎమ్మెల్యే పూర్ణేష్ ఈశ్వరభాయ్ మోడీ, గుజరాత్ ప్రభుత్వానికి సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. సూరత్ కోర్టు తీర్పును సమర్థిస్తూ గుజరాత్ హైకోర్టు తీర్పు ఇచ్చింది. దీన్ని సవాల్ చేస్తూ రాహుల్‌గాంధీ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌ను శుక్రవారం సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బిఆర్ గవాయ్, జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా ధర్మాసనం విచారణ జరిపింది. పరువు నష్టం కేసు దాఖలు చేసిన పూర్ణేశ్ మోడీకి, గుజరాత్ రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణ ఆగస్టు 4 జరుగుతుందని తెలిపింది.

విచారణ సందర్భంగా జస్టిస్ గవాయ్ మాట్లాడుతూ, తన తండ్రికి, సోదరునికి కాంగ్రెస్ పార్టీతో అనుబంధం ఉందని, తాను ఈ విచారణ నుంచి తప్పుకుంటానని అన్నారు. తన తండ్రి కాంగ్రెస్ సభ్యుడు కాకపోయినప్పటికీ, ఆ పార్టీతో ఆయనకు అనుబంధం ఉందని అన్నారు. సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్విని ఉద్దేశించి మాట్లాడుతూ "సింఘ్వి మీకు కాంగ్రెస్‌తో నలభయ్యేళ్లకుపైగా అనుబంధం ఉంది. మా సోదరుడు ఇంకా రాజకీయాల్లో ఉన్నారు. ఆయన కాంగ్రెస్‌లో ఉన్నారు. నేను ఈ పిటిషన్‌పై విచారణ జరపాలని కోరుకుంటున్నారా? నిర్ణయం తీసుకోండి" అన్నారు.

రాహుల్‌గాంధీ తరపున వాదనలు వినిపిస్తున్న అభిషేక్ మను సింఘ్వి మాట్లాడుతూ, తమకు ఎటువంటి అభ్యంతరం లేదని అన్నారు. ప్రతివాదుల తరపు సీనియర్ న్యాయవాది మహేష్ జఠ్మలానీ కూడా తమకు ఎటువంటి అభ్యంతరం లేదని తెలిపారు. దీంతో విచారణ ప్రారంభమైంది. సింఘ్వి వాదనలు వినిపిస్తూ రాహుల్ గాంధీ 111 రోజుల నుంచి బాధపడుతున్నారని, ఓ పార్లమెంటు సెషన్‌ను కోల్పోయారని, మరో సెషన్‌ను కోల్పోబోతున్నారని ధర్మాసనానికి తెలిపారు. వయనాడ్ లోక్‌సభ నియోజకవర్గం ఎన్నికలు త్వరలో జరగబోతున్నాయని చెప్పారు. లోక్‌సభ సభ్యత్వానికి రాహుల్‌గాంధీని అనర్హుడిని చేయడాన్ని తాత్కాలికంగా నిలిపేయాలని కోరారు. దీనిపై సుప్రీంకోర్టు స్పందిస్తూ, ప్రతివాదుల వాదనలను కూడా తాము వింటామని, తాత్కాలిక ఉపశమనాన్ని మంజూరు చేయలేమని తెలిపింది. రాహుల్ అభ్యర్థనను నిరాకరిస్తూ గుజరాత్ హైకోర్టు వంద పేజీలకుపైగా సుదీర్ఘమైన తీర్పును ఇచ్చిందని వ్యాఖ్యానించింది. ఇలాంటివి గుజరాత్ కోర్టుల్లోనే ప్రత్యేకంగా చూస్తున్నామని ధర్మాసనం పేర్కొంది.

డబుల్ ఇంజిన్ దారుణాలపై నిరసనాగ్రహాలు

మొదటి పేజీ తరువాయి

వాయిదా పడింది. ఆ తరువాత సభ తిరిగి ప్రారంభమైనప్పటికీ పరిస్థితుల్లో ఏ మార్పు రాలేదు. ప్రతిపక్ష సభ్యుల ఆందోళనతో సభను సోమవారానికి వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ ప్రకటించారు.

రాజ్యసభలో రూల్ నెంబర్ 267 కింద చర్చకు ప్రతిపక్షాల పట్టు

ఇతర సభా కార్యక్రమాలన్నీ రద్దు చేసి రూల్ 267 కింద మణిపూర్ సమస్యపై పూర్తిస్థాయిలో చర్చించాలని ప్రతిపక్షాలు ముక్త కంఠంతో డిమాండ్ చేస్తున్నాయి. నిబంధన 176 కింద తక్కువ సమయం చర్చకు కేటాయించనున్నట్లు కేంద్రం ప్రకటించింది. కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ 'మణిపూర్ ఘటన చాలా తీవ్రమైనదని, మణిపూర్‌లో ఘటన యావత్ దేశం సిగ్గుతో తలదించుకునేలా చేసిందని ప్రధాని స్వయంగా చెప్పారు. మణిపూర్ అంశంపై చర్చించాలని ప్రభుత్వం కోరుతోంది. అయినా ప్రతిపక్షాలు చర్చ జరగకుండా గందరగోళం సృష్టిస్తున్నాయి. ఈ అంశంపై చర్చకు ప్రతిపక్షాలు సీరియస్‌గా లేవని భావిస్తున్నా' అని పేర్కొన్నారు. ఈ అంశంపై చర్చకు కేంద్రం సిద్ధమేనని, ఈ ఘటనపై కేంద్ర హోం మంత్రి ప్రకటన చేస్తారని పార్లమెంటరీ వ్యవహారాల సహాయ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ చెప్పారు. ప్రతిపక్షాలు పార్లమెంట్‌లో చర్చించాల్సిన ఇతర అంశాలను పక్కన పెట్టి.. మణిపూర్ అంశంపై మాత్రమే చర్చ జరగాలని డిమాండ్ చేస్తున్నాయని తెలిపారు.

రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే మాట్లాడుతూ " మేం రూల్ 267 ప్రకారం నోటీసు ఇచ్చాం. కాబట్టి పార్లమెంట్‌లో చర్చించాల్సిన ఇతర అంశాలను పక్కకు పెట్టి, మణిపూర్ ఘటనపై చర్చ జరగాలి. ఈ అంశంపై కేవలం అరగంట చర్చ సరిపోదు. మణిపూర్ సిఎం తక్షణమే రాజీనామా చేయాలి. అక్కడ రాష్ట్రపతి పాలనకు డిమాండ్ చేస్తున్నాం" అని తెలిపారు. మరోవైపు కేంద్ర మంత్రి అర్జున్ రామ్ మేఘవాల్ మాట్లాడుతూ.. "ప్రతిపక్షాలు ప్రధాని పార్లమెంట్‌కు వచ్చి ప్రకటన చేయాలని డిమాండ్ చేస్తున్నాయి. ఉద్దేశపూర్వకంగానే తమ నిర్ణయాన్ని మార్చుకుంటూ చర్చకు అవకాశం కల్పించడంలేదు" అని అన్నారు.

ప్రతిపక్షాల ఆందోళన నడుమ మధ్యాహ్నం 2.30 గంటలకు వాయిదా పడింది. అనంతరం ప్రారంభమైన సభలో కూడా ఎటువంటి మార్పు రాలేదు. దీంతో సభ సోమవారానికి వాయిదా పడింది. 1990 నుండి 2016 వరకు 11 సార్లు వివిధ చర్చల కోసం ఈ నిబంధనను వినియోగించినట్లు పార్లమెంటరీ రికార్డులు చూపిస్తున్నాయి. చివరిసారిగా 2016లో అప్పటి ఛైర్మన్ హమీద్ అన్సారీ "పెద్ద నోట్ల రద్దు" పై చర్చకు అనుమతించారు. తనకు ముందు రాజ్యసభ ఛైర్మన్‌గా వ్యవహరించిన వెంకయ్యనాయుడు ఆరేళ్ల పదవీ కాలంలో ఈ నిబంధనను అమోదించలేదని ప్రస్తుత ఛైర్మన్ జగదీప్ ధన్‌ఖర్ పేర్కొన్నారు.

పార్లమెంటులో ఆంధ్రప్రదేశ్

పిఎం కిసాన్‌కు 2.34 కోట్ల మంది రైతుల దూరం

- కేంద్ర మంత్రి నరేంద్ర సింగ్ తోమర్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కేవలం నాలుగు నెలల్లోనే 2,34,59,262 మంది రైతులు పిఎం కిసాన్‌కు దూరమయ్యారని కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి నరేంద్ర సింగ్ తోమర్ తెలిపారు. రాజ్యసభ ఆర్‌జెడి ఎంపి మనోజ్ కుమార్ ఝా అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖిత పూర్వక సమాధానం ఇచ్చారు. 2022-23లో ఏప్రిల్-జులైలో 10,45,68,304 మంది రైతులు పిఎం కిసాన్ లబ్ధిదారులు కాగా, 2022-23 డిసెంబరు-మార్చి నాటికి 8,11,09,042 మంది తగ్గారని తెలిపారు. అంటే నాలుగు నెలల్లో 2,34,59,262 మంది ఈ పథకానికి నోచుకోలేదని అన్నారు.

మెడికల్ కోర్సులకు కేంద్రీకృత కౌన్సిలింగ్ ప్రతిపాదన లేదు

మెడికల్ అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సులకు కేంద్రీకృత కౌన్సిలింగ్ నిర్వహించే ప్రతిపాదన ఏదీ లేదని కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ తెలిపారు. ఎంపిలు గడ్డం రంజిత్ రెడ్డి, మాలోత్ కవిత అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖితపూర్వక సమాధానమిచ్చారు. వివిధ కోటాల కింద సీట్లు కేటాయించే విధానంలోనూ మార్పు లేదని పేర్కొన్నారు. అండర్ గ్రాడ్యుయేట్ కోర్సుల్లో కేవలం 15 శాతం సీట్లే అఖిల భారత కోటాలో ఉంటాయని వెల్లడించారు.

ఎయిమ్స్ పేర్లు మార్చే ప్రతిపాదన లేదు

ఆంధ్రప్రదేశ్‌తో పాటు దేశంలోని 20 ఎయిమ్స్ పేర్లు మార్చే ప్రతిపాదన ఏదీ లేదని కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ తెలిపారు. స్వాతంత్ర్య సమరయోధులు, స్థానిక యోధుల పేర్లను ఎయిమ్స్‌కు కేంద్ర ప్రభుత్వం పెట్టాలనుకునేది నిజమేనా అని శ్రీకాకుళం ఎంపి రామ్మోహన్‌నాయుడు అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి శుక్రవారం లిఖితపూర్వక సమాధానమిచ్చారు.

2018 నుంచి ఈ ఏడాది జులై 23 వరకు దేశవ్యాప్తంగా వివిధ హైకోర్టుల్లో 604 మంది న్యాయమూర్తులను నియమించగా అందులో 158 మంది జనరల్ కేటగిరి, 72 మంది ఒబిసి, 18 మంది ఎస్‌సి, 9 మంది ఎస్‌టి, 34 మంది మైనారిటీ వర్గానికి చెందినవారని కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ తెలిపారు. మరో 13 మంది న్యాయమూర్తులు తమ వివరాలు ఇవ్వలేదని ఆయన పేర్కొన్నారు. హైదరాబాద్ ఎంపి అసదుద్దీన్ ఒవైసి అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖితపూర్వక సమాధానమిచ్చారు. రాజ్యాంగంలోని 124, 127, 224 ఆర్టికల్స్ ప్రకారం హైకోర్టు, సుప్రీంకోర్టు న్యాయమూర్తుల నియామకాల్లో ఏ వర్గానికి, కులానికి రిజర్వేషన్లు కల్పించలేదని కేంద్ర మంత్రి పేర్కొన్నారు. 2020 నుంచి ఈ ఏడాది జులై 15 వరకు సుప్రీంకోర్టు 1,07,651 కేసులు విచారణను ముగించిందని మరో ప్రశ్నకు సమాధానం ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు 96,7500, తెలంగాణ హైకోర్టు 1,12,280 కేసుల విచారణను ముగించిందని కేంద్ర మంత్రి వెల్లడించారు.

2018-2023 వరకు ఆంధ్రప్రదేశ్‌లో 6,502 మంది పిల్లలు అదృశ్యం కాగా, అందులో 4,682 మంది పట్టుబడ్డారని, తెలంగాణలో 1,591 మంది తప్పిపోగా, 1,243 మందిని పట్టుకోగలిగామని కేంద్ర మహిళా శిశుఅభివృద్ధి శాఖ మంత్రి స్మృతి ఇరానీ తెలిపారు. లోక్‌సభలో అడిగిన ఓ ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖితపూర్వక సమాధానమిచ్చారు.

ఎపిలో 6,435, తెలంగాణలో 8,540 మెడిసిన్ సీట్లు

ఆంధ్రప్రదేశ్‌లో 6,435, తెలంగాణలో 8,540 మెడిసన్ సీట్లు ఉన్నాయని కేంద్ర ఆరోగ్యశాఖ సహాయ మంత్రి భారతి ప్రవీణ్ పవర్ తెలిపారు. లోక్‌సభలో ఒక ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. ఎపిలో 18 ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో 3,235 సీట్లు ఉన్నాయని, 19 ప్రైవేట్ కాలేజీల్లో 3,200 సీట్లు ఉన్నాయని తెలిపారు. తెలంగాణలో 28 ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో 3,890 సీట్లు, 28 ప్రైవేట్ కాలేజీల్లో 4,650 సీట్లు ఉన్నాయని పేర్కొన్నారు.

ఎపి హైకోర్టు తరలింపు ప్రతిపాదనేదీ కేంద్రం వద్ద పెండింగ్‌లో లేదు

ఆంధ్రప్రదేశ్ హైకోర్టు తరలింపు కేంద్ర ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో లేదని కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ తెలిపారు. శుక్రవారం లోక్‌సభలో ఎంపి తలారి రంగయ్య అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు తరలింపు పూర్తిస్థాయి ప్రతిపాదనేదీ ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో లేదని తెలిపారు. హైకోర్టు తరలింపు గురించి రాష్ట్ర ప్రభుత్వం, అక్కడి హైకోర్టు చర్చించి నిర్ణయం తీసుకోవాలని, అందుకు సంబంధించిన పూర్తి స్థాయి ప్రతిపాదనలు కేంద్ర ప్రభుత్వానికి సమర్పించాల్సి ఉంటుందని అన్నారు.

వివేకా హత్య కేసులో వెలుగులోకి కీలక సాక్ష్యాలు

మొదటి పేజీ తరువాయి

తర్వాత మళ్లీ వచ్చారు. బాబాయ్ ఇక లేరనే విషయాన్ని జగన్ నిలబడే మాకు చెప్పారు.

అవినాష్ ఫోన్ చేసి కృష్ణమోహన్‌కి ఫోన్ ఇవ్వమన్నారు : అటెండర్ నవీన్

ఆ రోజు ఉదయం 6.30 గంటలకు అవినాష్‌రెడ్డి ఫోన్ చేసి జగన్ ఉన్నారా? అని అడిగారు. కృష్ణమోహన్‌రెడ్డి, అజేయ కల్లం, ఉమ్మారెడ్డి తదితరులతో సమావేశంలో ఉన్నారని చెప్పాను. కృష్ణమోహన్‌రెడ్డికి వెంటనే ఫోన్ ఇవ్వమని అవినాష్ చెప్పారు. సమావేశ గదికి వెళ్లి అవినాష్ లైన్‌లో ఉన్నారని కృష్ణమోహన్‌రెడ్డికి ఫోన్ ఇచ్చాను. అవినాష్, కృష్ణమోహన్‌రెడ్డి ఏం మాట్లాడుకున్నారో నేను వినలేదు.

ఆ విషయం జగన్‌కు ఎవరు చెప్పారో గుర్తులేదు : ఉమ్మారెడ్డి

'సమావేశంలో ఉన్నప్పుడు ఎవరో యువకుడు వచ్చి వివేకా మరణించారని జగన్‌కు చెప్పారు. ఆయన ఎవరో నాకు గుర్తులేదు. కాసేపటికే సమావేశం ముగిసింది'

మీకోసం

చపాతీలు తెల్లగా, మెత్తగా ఉండాలంటే పిండిలో రెండు చెంచాల పాలు, ఒక చెంచా బియ్యం పిండి, కాస్త నూనె వేసి చల్లని నీటితో కలపాలి.

జీవన సౌరభం

ప్రతి అవకాశంలోనూ కొన్ని అడ్డంకులు, ప్రతి అడ్డంకి వెనుకా కొన్ని అవకాశాలు ఉంటాయి.

మన జాతీయ జెండా కథ

పిల్లలూ, ఈ రోజు జులై 22. మన జాతీయజెండాను ఆమోదించిన రోజు. స్వాతంత్ర్యం రాకముందు కూడా జాతీయ జెండాకు అనేక రూపాలు అమల్లో ఉండేవి. అవేంటో తెలుసుకుందామా

స్వాతంత్ర్యానికి ముందు 40 ఏళ్ల కిందట మొదటిసారి భారతీయ జెండాను ఆవిష్కరించారు. 20వ శతాబ్దం ప్రారంభంలో భారత స్వాతంత్ర్య ఉద్యమానికి నాయకత్వం వహించిన అతి కొద్ది మంది మహిళల్లో ఒకరైన భికైజీ పటేల్ కామా జాతీయ జెండాను ఆవిష్కరించారు.

ప్రస్తుతం మనకు తెలిసిన జాతీయ జెండా మొదటి రూపం కాదు. జాతీయ జెండా మొదటి వెర్షన్‌ను 1904లో రూపొందించారు. స్వామి వివేకానంద శిష్యురాలు భగినీ నివేదిత పసుపు - ఎరుపు రంగుతో జాతీయ జెండాను రూపొందించారు. జెండా మధ్యలో వజ్రతో బెంగాలీ భాషలో 'వందేమాతరం' అని రాసి ఉండేది.

కోల్‌కత్తాలోని పార్సీ బగన్ (ప్రస్తుతం గిరీష్ పార్క్)లో 1906, ఆగస్టు 7న తొలిసారి భారత జెండాను ఆవిష్కరించారు. ఆ జెండా ఆకుపచ్చ, పసుపు, ఎరుపు రంగుల్లో ఉండేది. ఎగువ ఆకుపచ్చ రంగులో సగం తెరిచిన ఎనిమిది తెల్ల తామర పువ్వులు కూడా ఉండేవి. దిగువ ఎరుపు భాగంలో నెలవంక, సూర్యుడు ఇస్లాం, హిందూ మతాలను ప్రతిబింబించేలా ఉండేవి. దేవనాగిరి లిపిలో పసుపు మధ్యలో ఉన్న ప్యానెల్‌పై 'వందే మాతరం' అని రాసి ఉండేది.

1907లో హోంరూల్ ఉద్యమం సందర్భంగా బాలగంగాధర్ తిలక్ కొత్త జెండాకు రూపకల్పన చేశారు. ఈ జెండా ఎరుపు, ఆకుపచ్చ గీతలతో ఉండేది. ఎడమ వైపు ఎగువన యూనియన్ జాక్ ఏడు నక్షత్రాలపై ఉండేది. కుడివైపు పైభాగంలో చంద్ర నక్షత్రం ఉండేది.

ఆ తరువాత కూడా జాతీయ జెండాలకు అనేక వెర్షన్లు వచ్చాయి. వాటిపై చాలా వరకు ఏకాభిప్రాయం రాలేదు. చరఖా లేదా స్పిన్నింగ్ వీల్‌తో తెల్లటి గీతతో కూడిన జాతీయ జెండాను మహాత్మా గాంధీ ప్రతిపాదించారు. ఈ స్పిన్నింగ్ వీల్‌ను దేశ స్వాతంత్ర్య పోరాటానికి ప్రాతినిధ్యంగా గాంధీ మార్చారు. ఈ జెండానే తరువాతి కాలంలో ఆధునిక త్రివర్ణ పతాకానికి నమూనాగా పనిచేసింది.

1931లో భారత జాతీయ జెండాలో చారిత్రక మార్పు చోటుచేసుకుంది. కాంగ్రెస్ కమిటీ సమావేశంలో చేసిన తీర్మానంలో భారత త్రివర్ణ పతాకాన్ని ఆమోదించారు. ఈ త్రివర్ణ పతాకంలో పైభాగంలో కుంకుమపువ్వు, మధ్యలో తెలుపు, దిగువన ఆకుపచ్చ రంగు ఉండేది. తెల్లటి రంగు మధ్యలో నీలి రంగు స్పిన్నింగ్ వీల్ ఉండేది.

ప్రస్తుత త్రివర్ణ పతాకాన్ని 1947 జులై 22న ఆమోదించారు. జెండా మధ్యలో తెల్లటి రంగుపై చరఖాకు బదులు అశోకుని ధర్మ చక్రాన్ని ఏర్పాటు చేశారు. దీనిని రాజ్యాంగ సభ ఆమోదించడంతో జాతీయ పతాకంగా మారింది. ఈ జెండా రూపకర్త మన రాష్ట్రానికి చెందిన పింగళి వెంకయ్య.

నేను గీసిన బొమ్మ

షేక్ మహవీన్,
8వ తరగతి,
అరవింద హైస్కూలు, కుంచనపల్లి.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

శ్మశానాన్ని ఉద్యానవనంగా మార్చేశాడు..

పక్షుల కిలకిలరావాలతో.. పిల్లల ఆటపాటలతో ఆ ప్రాంతమంతా ఆహ్లాదంగా ఉంది. అక్కడే ఓ పెద్దాయన మొక్కలకు నీళ్లు పోస్తూ ఉన్నాడు. రంగు రంగుల పూలతో సువాసనలు వెదజల్లుతున్న ఓ పూలమొక్క పక్కన అప్పడే భూమిని చీల్చుకుని వస్తున్న లేత మొక్కలకు నీళ్లు పోస్తూ.. ఆ పెద్దాయన కాసేపు మౌనంగా నిలబడ్డాడు. ఎందుకంటే అక్కడ అతని పెద్ద కొడుకును సమాధి ఉంది. అది పార్కో, తోటో కాదు; నందనవనం లాంటి శ్మశానవాటిక. తమిళనాడు కడలూరుకు సమీపంలో థిట్టకూడిని అనుకుని ఉన్న అరంగర్ గ్రామంలో ఉందా శ్మశానం. ఆ నీళ్లు పోసే పెద్దాయన 70 ఏళ్ల అర్జునన్. ముళ్ల కంపలతో, చెత్త చెదారంతో భీతిల్లే వాతావరణంతో ఉండే ఆ శ్మశానాన్ని అతడే నందనవనంలా మార్చాడు.

అర ఎకరా విస్తీర్ణంలో ఉన్న ఆ శ్మశాన వాటిక షెడ్యూల్ వర్గానికి చెందినది. చుట్టుపక్కల ఉన్న రెండు సెటిల్‌మెంట్లకు చెందిన 500 కుటుంబాల చివరి మజిలీ అది. అదే ప్రాంతానికి చెందిన అర్జునన్ పెద్ద కొడుకు 1990లో చనిపోయాడు. కొడుకు మృతి నుండి కోలుకోలేక రోజూ అక్కడికి వెళ్లి వచ్చేవాడు. కొన్నేళ్లపాటు అలా వెళ్లాడు. 'దట్టమైన ముళ్ల కంపలతో ఉన్న ఆ ప్రాంతంలో ముళ్లు గుచ్చుకోకుండా ఏ ఒక్క రోజూ వెళ్లలేదు. అలా చాలా సంవత్సరాలు గడిచిపోయాయి. 2007లో అతడికి ఆ ప్రాంతాన్ని శుభ్రం చేయాలన్న ఆలోచన వచ్చింది. అయితే అది అంత తేలికైన విషయం కాదు. పంచాయతీ పెద్దలతో పాటు నా కుటుంబం ఆమోదం పొందడం చాలా కష్టమైంది' అంటున్న అర్జునన్ ఆ తరువాత ఐదేళ్లపాటు పూర్తిగా శ్మశానానికే అంకితమయ్యాడు. దాన్ని శుభ్రం చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నాడు. దీనికోసం అతనేమీ ప్రతిఫలం ఆశించలేదు. స్వచ్ఛంద సేవ చేశాడు. సొంతంగా ఖర్చు పెట్టాడు. శ్మశానం చుట్టూ కొబ్బరిచెట్లు, మామిడి చెట్లు, జామ, నిమ్మ, కొలంజి, సీతాఫలం, సపోటా, ఉసిరి వంటి పండ్ల చెట్లు, టేకు, ఎర్రచందనం, జామాయిల్ వంటి కలప మొక్కలను నాటాడు.

ఇన్నేళ్లలో వేల అరటిచెట్లను సాగు చేశాడు. వీటితో పాటు పూల మొక్కలను పెంచాడు. మూలికా మొక్కలను నాటాడు. 2012 నాటికి కొబ్బరి మొక్కలు కాపుకు వచ్చాయి. అప్పుడు ఊరందరికీ అక్కడ విందు భోజనం పెట్టాడు.

కుటుంబం దూరం పెట్టినా..

ఉద్యానవనంలా మారిన శ్మశానాన్ని చూసి గ్రామస్తులు ఆశ్చర్యపోయారు. అర్జునన్ నిస్వార్థ సేవకు ప్రతిఫలంగా అతనిని సముచితంగా గౌరవించి సత్కరించారు. విందుకు హాజరైన గ్రామపెద్దలకు ఆ రోజు శ్మశాన బాధ్యతలను అప్పగించి బతుకుతెరువు కోసం పని వెతుక్కుంటూ కేరళ వెళ్లిపోయాడు అర్జునన్. కొన్ని నెలల తరువాత తిరిగివచ్చిన అతడికి ఆ శ్మశానం మళ్లీ యథాస్థితిలో కనబడింది. పూలమొక్కలు ఎండిపోయి, విచ్చలవిడిగా పిచ్చిమొక్కలు పెరిగి కనిపించాయి. ఎంతో అందంగా సిద్ధం చేసిన ప్రాంతాన్ని మళ్లీ అలా చూసేసరికి అర్జునన్ తట్టుకోలేకపోయాడు. చేస్తున్న పనికి స్వస్తి చెప్పి శ్మశాన పనిలోనే నిమగ్నమవ్వాలనుకున్నాడు. అయితే ఈసారి అతని నిర్ణయాన్ని కుటుంబం వ్యతిరేకించింది. ఇంటికి వెళ్లలేని పరిస్థితిలో కుటుంబం నుండి దూరంగా వచ్చేసి శ్మశానానికి దగ్గరగా ఓ అద్దె ఇంట్లో నివసిస్తున్నాడు.

ఉద్యానవనంలా..

రోజువారీ ఖర్చుల కోసం అడపాదడపా కూలిపనులకెళ్తూ మిగిలిన సమయమంతా శ్మశాన పనులకే కేటాయిస్తున్నాడు. 'నేను ఈ ప్రాంతంలో కూరగాయలు కూడా పండిస్తున్నాను. గ్రామస్తులు ఏ అభ్యంతరం లేకుండా వీటిని తీసుకుంటున్నారు. అలాగే ఇక్కడ పండిన పండ్లను దేవాలయానికి, ఇతర ఉత్సవాలకు ఇస్తుంటాను' అని చెబుతున్న అర్జునన్ కృషికి ఫలితంగా ఆ శ్మశానం క్రమంగా ఓ ఉద్యానవనంగా మారిపోయింది. పిల్లలు ఆ ప్రాంతాన్ని పార్కులా వినియోగిస్తున్నారు. స్కూలు ముగిసిన తరువాత అక్కడి చెట్ల కింద ఆడుకుంటున్నారు. కొంతమంది స్కూలు పిల్లలు వారాంతాల్లో బృందాలు బృందాలుగా వచ్చి అక్కడే వండుకుని తింటుంటారు. ఇటీవలె అర్జునన్ చేస్తున్న ఈ సేవను గుర్తించిన అధికారులు అతనిని ప్రశంసలతో ముంచెత్తారు. దీంతో రాష్ట్ర నలుమూలల నుండి ఆ శ్మశాన ఉద్యానవనాన్ని చూసేందుకు ప్రజలు తరలివస్తున్నారు. వయసు మీదపడుతున్నా ఎటువంటి ప్రతిఫలం ఆశించకుండా అర్జునన్ చేస్తున్న సేవలో తమవంతుగా భాగమయ్యేందుకు ఇప్పుడు చుట్టుపక్కల గ్రామస్తులు కూడా అతనితో చేయి కలుపుతున్నారు.

పాదాల ఆరోగ్యం కోసం ...

వర్షాకాలంలో సాధారణంగా తడి కారణంగా షూల నుంచి దుర్వాసన వస్తుంటుంది. షూల అపరిశుభ్రతతో పాటు పాదాల నుంచి వచ్చే దుర్గంధం కూడా దీనికి కారణం కావొచ్చు. ఇంట్లో వుండే వస్తువులతోనే ఈ చెడు వాసనను నియంత్రించవచ్చు.

పాదాల శుభ్రత ఇలా ... : వెడల్పాటి బకెట్లో సగం వరకు నీటిని తీసుకోవాలి. ఆ నీటిలో బేకింగ్ సోడా వేసి బాగా కలపాలి. తర్వాత ఆ నీటిలో పాదాలను పది నిమిషాల పాటు ఉంచాలి. తర్వాత కాళ్లను బయటకు తీసి కాటన్ గుడ్డతో అరికాళ్లు, కాలి వేళ్లను బాగా తుడవాలి. ఇలా రోజూ చేస్తే పాదాల వాసన క్రమంగా తగ్గుతుంది.

- ఒక బకెట్‌లో పాదాలు మునిగేంత వరకు గోరువెచ్చని నీటిని పోసి, ఒక టేబుల్ స్పూన్ బేకింగ్ సోడా, అదే మొత్తంలో నిమ్మరసం వేసి బాగా కలపాలి. తర్వాత ఈ నీటిలో పాదాలను 10 నిమిషాల పాటు ఉంచాలి. ఇలా వారానికి రెండు సార్లు చేస్తే సమస్య తగ్గుతుంది.
- పాదాలు మునిగేంత నీళ్లను తీసుకుని ఏదైనా నూనె (యూకలిప్టస్, లెమన్ గ్రాస్, పిప్పరమెంటు, ఎసెన్షియల్ ఆయిల్ మొదలైనవి) ఐదు నుంచి ఆరు చుక్కలు వేయాలి. ఆ నీటిలో కనీసం 10 నిమిషాల పాటు పాదాలను ఉంచాలి. తర్వాత పాదాలను బయటికి తీసి బాగా తుడుచుకోవాలి.
- ఒక బకెట్ గోరువెచ్చని నీటిలో ఒక కప్పు ఎప్సమ్ సాల్ట్ మిక్స్ చేసి అందులో పాదాలను ఉంచాలి. ఇలా వారానికి రెండుసార్లు చేయాలి.
- ఒక బకెట్ గోరువెచ్చని నీటిలో అరకప్పు వెనిగర్ వేసి పాదాలను 15 నిమిషాల పాటు ఉంచాలి. ఇలా వారానికి 2-3 సార్లు చేస్తే ఉపయోగకరం.
- రోజుకు కనీసం రెండుసార్లు పాదాలను సబ్బుతో శుభ్రం చేసుకున్నా దుర్వాసన సమస్య తగ్గుతుంది.
- రోజూ సాక్స్ మార్చాలి. ఉతక్కుండా పదే పదే ఉపయోగించొద్దు. అలాగే సాక్స్ తడిగా ఉన్నా ఉపయోగించకండి.

షూల శుభ్రత ఇలా ... : రసం పిండేసిన నిమ్మకాయ, నారింజ తొక్కలను రాత్రంతా బూట్లలో వేసి ఉంచితే వాటి నుంచి వచ్చే దుర్వాసన తొలగిపోతుంది.

- వర్షంలో ప్రయాణించి వచ్చిన తరువాత తడిసిన బూట్లలో కొంచెం బేకింగ్ సోడా వేసి రాత్రి అంతా అలా ఉంచేయాలి. ఉదయానికి బూట్లు పొడిగా, దుర్వాసన రహితంగా ఉంటాయి.
- తడిగా ఉన్న బూట్లలో న్యూస్ పేపర్‌ని వేసి రాత్రి అంతా ఉంచినా తేమ, దుర్వాసన ఉండదు.
- బూట్లలోని చెడు వాసనను తొలగించడానికి టాల్కమ్ పౌడర్ కూడా బాగా పనిచేస్తుంది. బూట్ల లోపలి భాగంలో పౌడర్ చల్లి రాత్రంతా ఉంచితే ఇది బూట్లలోని తడిని గ్రహించి, చెడు వాసనను అరికడుతుంది.

ఇటలీలో వరుణ్, లావణ్యల వివాహం?

హీరో వరుణ్ తేజ్, హీరోయిన్ లావణ్యల త్రిపాఠి త్వరలోనే ఏడడుగులు వేయనున్నారు. జూన్ 9న నాగబాబు కుమారుడు వరుణ్ తేజ్, లావణ్యల ఎంగేజ్‌మెంట్ జరిగిన విషయం తెలిసిందే. చిరు, అల్లు కుటుంబాలతోపాటుగా పలువురు సెలబ్రిటీలు హాజరై కాబోయే దంపతులను ఆశీర్వదించారు. ఈ ఏడాదిలోనే గ్రాండ్ వెడ్డింగ్ ఉంటుందని టాక్ వినిపించింది. ప్రస్తుతం 'గాండీవధారి అర్జున' సినిమాలో వరుణ్ నటిస్తున్నాడు. చాలా వరకు షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ మూవీ ఆగస్టు 25న గ్రాండ్‌గా రిలీజ్ చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ముందురోజు అంటే 24నే వరుణ్, లావణ్యల పెళ్లి జరగనుందని తెలుస్తోంది. ఇటలీలో డెస్టినేషన్ వెడ్డింగ్ జరగనుందని ప్రచారం జరుగుతోంది.

దసరా బరిలో 'భగవంత్ కేసరి'

నందమూరి బాలకృష్ణ లీడ్ రోల్‌లో అనీల్ రావిపూడి డైరెక్షన్‌లో వస్తున్న సినిమా భగవంత్ కేసరి. షైన్ స్క్రీన్స్ బ్యానర్‌లో సాహు గారపాటి హరీష్ పెద్ది ఈ సినిమా నిర్మిస్తున్నారు. సినిమాలో కాజల్ అగర్వాల్, శ్రీ లీల నటిస్తున్నారు. దసరా కానుకగా రిలీజ్ ఉంటుందని చర్చలు జరుగుతున్నాయి. కాజల్ హీరోయిన్‌గా నటిస్తుండగా శ్రీ లీల బాలయ్య కూతురిగా నటిస్తుందని సమాచారం. బాలీవుడ్‌లో 1992లో వచ్చిన ఖుదా గవా సినిమాకు భగవంత్ కేసరికి దగ్గర పోలికలు ఉన్నట్టుగా సినీవర్గాల్లో చర్చలు జరుగుతున్నాయి.

సంక్రాంతికి 'కల్కి 2898 ఎడి'

ప్రభాస్ హీరోగా సైన్స్ ఫిక్షన్ నేపథ్యంలో రూపొందుతోన్న చిత్రం 'కల్కి 2898 ఏడీ'. ఈ చిత్రంలో బాలీవుడ్ నటుడు అమితాబ్ బచ్చన్, కోలీవుడ్ నటుడు కమల్‌హాసన్ నటించే అవకాశాలు ఉన్నట్లుగా సమాచారం. నాగ్ అశ్విన్ దర్శకత్వంలో వహిస్తున్నారు. ప్రభాస్‌కు జోడిగా దీపికా పదుకొణె నటిస్తోంది. వచ్చే సంక్రాంతికి ప్రేక్షకుల ముందుకు రానుంది.

ఆగస్టులోనే 'పేకమేడలు'

నటుడు రాకేష్ వర్రే తన స్వీయ నిర్మాణంలో క్రేజీ యాంట్స్ ప్రొడక్షన్స్ పతాకంపై 'పేకమేడలు' చిత్రాన్ని నిర్మిస్తున్నారు. హీరోగా చేసిన చిత్రం 'ఎవ్వరికీ చెప్పొద్దు'. తాజాగా ఆయన తన సొంత బ్యానర్‌పై 'నా పేరు శివ', 'అందగారం' వంటి చిత్రాల్లో నిర్మించారు. నటుడు వినోద్ కిషన్, నటి అనూష కృష్ణ. దర్శకుడు నీలగిరి మామిళ్ళ. నూతన దర్శకుడితో పాటు 50 మంది నూతన నటీనటులు, ఎంతో ప్రతిభావంతులైన సాంకేతిక నిపుణులను పరిచయం చేస్తున్నారు. 'పేకమేడలు' చిత్ర పోస్టర్, మోషన్ పోస్టర్‌ని చిత్రబందం ఇటీవల విడుదల చేసింది. ఈ చిత్రాన్ని ఆగస్టులో విడుదలకు సన్నాహాలు చేస్తున్నారు.

ప్రమోషన్‌లో 'సర్కారు నౌకరి'

ప్రముఖ గాయని సునీత తనయుడు ఆకాష్ కథానాయకుడిగా పరిచయం అవుతున్న చిత్రం 'సర్కారు నౌకరి' భావనా వళపండల్ కథానాయిక. గంగమనేని శేఖర్ దర్శకత్వం వహిస్తున్నారు. ప్రముఖ దర్శకుడు కె.రాఘవేంద్రరావు నిర్మాణంలో ఆయన సంస్థ ఆర్.కె.టెలీ షో పతాకంపై ఈ చిత్రం రూపొందుతోంది. ఈ సినిమాకు సంబంధించిన ప్రమోషన్ సాంగ్‌ను ఇటీవల విడుదల చేశారు. ఈ చిత్రం త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది.

విశ్వక్‌సేన్ సినిమాల తాజా అప్డేట్



విశ్వక్‌సేన్ వరుసగా తన 10, 11 ప్రాజెక్ట్స్‌తో బిజీగా ఉన్నారు. తాజాగా ఈ సినిమాలపై అప్డేట్స్‌ని అందించారు. 'నా పదో చిత్రం రెండో షెడ్యూల్‌ని పూర్తి చేశాం. అలాగే దర్శకుడు రవితేజతో చేస్తున్న 11వ సినిమా కూడా 50 శాతం పూర్తయ్యింది. ఈ రెండు సినిమాల కోసం ప్రతి నెలలో 25 రోజులు షూటింగ్ చేస్తున్నాను. ఈ సినిమాలకి మ్యూజిక్ బాగా వచ్చింది. ఈ విషయం మీతో షేర్ చేసుకోవాలి అనిపించింది. అందుకే పోస్ట్ చేస్తున్నా' అంటూ తన ఇన్‌స్టాగ్రామ్‌లో విశ్వక్‌సేన్ పోస్ట్ చేశారు.

'తంగలాన్'లో మాళవిక

హీరోయిన్ మాళవికా మోహనన్ 'పేట' చిత్రంతో కోలీవుడ్‌లో నటించారు. ఆ తర్వాత 'మాస్టర్', 'మారన్' వంటి చిత్రాల్లో నటించింది. ప్రస్తుతం చియాన్ విక్రమ్ నటిస్తున్న 'తంగలాన్' చిత్రంలో అలరించనున్నారు. టాలీవుడ్‌లోనూ ప్రభాస్, మారుతి కాంబినేషన్‌లో తెరకెక్కుతోన్న చిత్రంలో ఆమె ఓ హీరోయిన్‌గా నటిస్తోంది.

కదం తొక్కిన కుర్రాళ్లు

- ఎసిసి ఎమర్జింగ్ ఆసియాకప్ ఫైనల్లో భారత్-ఎ
- బ్యాటింగ్‌లో యశ్ ధుల్, బౌలింగ్‌లో నిషాంత్ సింధు మెరుపులు
- సెమీస్‌లో బంగ్లాదేశ్-ఎపై సంచలన విజయం
- ఫైనల్లో పాకిస్తాన్-ఎతో ఢీ

కొలంబో: ఎసిసి ఎమర్జింగ్ ఆసియాకప్‌లో భారత యువ క్రికెటర్లు అదరగొట్టారు. స్వల్ప లక్ష్యాన్ని బంగ్లాదేశ్-ఎ ముందు ముంచినా.. ఆ లక్ష్యాన్ని బంగ్లా బ్యాటర్స్ ఛేదించకుండా నిలువరించిన తీరు వర్ణనాతీతం. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన భారత్-ఎ జట్టు 49.1ఓవర్లలో 211పరుగులకు ఆలౌట్ కాగా.. ఛేదనలో బంగ్లాదేశ్-ఎను 34.2 ఓవర్లలో 160పరుగులకే పరిమితం చేసి 51పరుగుల తేడాతో విజయం సాధించింది. ఛేదన బంగ్లాదేశ్‌కు ఓపెనర్లు అద్భుత ఆరంభాన్నిచ్చారు. మహ్మద్(38), హసన్(51) కలిసి తొలి వికెట్‌కు 70పరుగుల గట్టి పునాదిని వేశారు. బంగ్లా జట్టు తొలి వికెట్ కోల్పోయిన అనంతరం భారత స్పిన్నర్లు నిషాంత్ సంధు(5/20), మానవ్(3/32) సమిష్టిగా చెలరేగారు. దీంతో బంగ్లాదేశ్ బ్యాటర్స్‌కు కష్టాలు తప్పలేదు. రెండో వికెట్‌ను 94పరుగుల వద్ద కోల్పోయిన బంగ్లా ఆ తర్వాత వరుసగా వికెట్లు కోల్పోయి ఓటమిపాలైంది. దీంతో బంగ్లాదేశ్ జట్టును 34.2ఓవర్లలో 160పరుగులకు ఆలౌటైంది. ఈ గెలుపుతో భారత్-ఎజట్టు 8వ ఎసిసి ఎమర్జింగ్ ఆసియాకప్ టైటిల్‌పై కన్నేశారు. అంతకుముందు టాస్ ఓడి తొలిగా బ్యాటింగ్‌కు దిగిన భారతజట్టుకు శుభారంభం దక్కలేదు. పాకిస్తాన్‌పై చెలరేగిన సాయి సుదర్శన్(21) త్వరగా పెవీలియన్‌కు చేరాడు. అభిషేక్ శర్మ(34) రాణించినా.. కెప్టెన్ యశ్ ధుల్(66) మినహా మిగతా బ్యాటర్ నిరాశపరిచారు. భారత్-ఎ జట్టు ఓ దశలో 137పరుగులకే 7వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ఆ దశలో కెప్టెన్ యశ్ ధుల్ కెప్టెన్సీ ఇన్నింగ్స్ ఆడాడు. దీంతో భారతజట్టు 211పరుగుల గౌరవప్రద స్కోర్ చేయగల్గింది. మెహిదీ, తంజిమ్, రఖీబుల్‌కు రెండేసి, రిపోన్, సైఫ్, సర్కార్‌కు ఒక్కో వికెట్ దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ యశ్ ధుల్‌కు లభించింది.

పాకిస్తాన్-ఎ ఘన విజయం

తొలి సెమీస్‌లో పాకిస్తాన్-ఎ జట్టు శ్రీలంక-ఎపై 60పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన పాక్ జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 322పరుగుల భారీస్కోర్‌ను నమోదు చేసింది. యూసుఫ్(88), మహ్మద్(52) అర్ధసెంచరీలతో రాణించారు. లాహిరు, మధుశన్, కరుణరత్నేకు రెండేసి, సాహన్, దునిత్‌కు ఒక్కో వికెట్ దక్కాయి. ఛేదనలో శ్రీలంక జట్టు 45.4ఓవర్లలో 262పరుగులకు ఆలౌటైంది. అర్షాద్ ఇక్బాల్‌కు ఐదు, ముబాసిర్, ముఖీమ్‌కు రెండేసి వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అర్షాద్ ఇక్బాల్‌కు లభించింది. ఆదివారం జరిగే ఫైనల్లో టైటిల్‌కై భారత్-ఎ, పాకిస్తాన్-ఎ తలపడనున్నాయి.

సెమీస్‌కు సాత్విక్-చిరాగ్

కొరియా ఓపెన్ సూపర్-300

సియోల్: కొరియా ఓపెన్ సూపర్- 300 బ్యాడ్మింటన్ టోర్నీ పురుషుల డబుల్స్ సెమీఫైనల్లోకి 3వ సీడ్ సాత్విక్ సాయిరాజ్ రంకిరెడ్డి-చిరాగ్ శెట్టి సెమీఫైనల్లోకి దూసుకెళ్లారు. శుక్రవారం జరిగిన క్వార్టర్‌ఫైనల్లో చిరాగ్-సాత్విక్ 21-14, 21-17తో 5వ సీడ్ జపాన్‌కు చెందిన టకురో హోకీ-యుకో కొబయాషిపై వరుససెట్లలో గెలిచారు. ఈ మ్యాచ్‌ను భారత షట్లర్ల బృందం కేవలం 40నిమిషాల్లోనే ముగించింది. తొలి గేమ్‌ను సునాయాసంగా గెలిచిన భారత జోడీ.. రెండో గేమ్‌లో ఓ దశలో 16-13 ఆధిక్యతలో నిలిచారు. ఆ తర్వాత జపాన్ జోడీ రాణించి 16-16పాయింట్లతో సమం చేయగా.. ఆ తర్వాత వరుసగా పాయింట్లు సాధించి సాత్విక్-చిరాగ్ జోడీ మ్యాచ్‌ను ముగించింది. సెమీస్‌లో చిరాగ్-సాత్విక్ జోడీ చైనాకు చెందిన 2వ సీడ్ లియాంగ్-ఛాంగ్‌తో తలపడనున్నారు.

బెయిర్‌స్టో(99నాటౌట్)

ఇంగ్లండ్ 592ఆలౌట్

275 పరుగుల ఆధిక్యత యాషెస్ సిరీస్ నాల్గో టెస్ట్

మాంచెస్టర్: యాషెస్ సిరీస్ నాల్గో టెస్ట్‌లో ఆతిథ్య ఇంగ్లండ్ జట్టు పట్టు బిగించింది. ఓవర్ నైట్ స్కోర్ 4 వికెట్ల నష్టానికి 384 పరుగులతో శుక్రవారం మూడోరోజు ఆటను కొనసాగించిన ఇంగ్లండ్ జట్టు 107.4ఓవర్లలో 592పరుగులకు ఆలౌటైంది. రూట్(84), బ్రూక్(61), స్టోక్స్(51), బెయిర్‌స్టో(99నాటౌట్) అర్ధసెంచరీలతో మెరిసారు. దీంతో ఇంగ్లండ్ జట్టుకు 275పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యత లభించింది. హేజిల్ వుడ్‌కు ఐదు, స్టార్క్, గ్రీన్‌కు రెండేసి దక్కాయి. అనంతరం ఆస్ట్రేలియా మూడోరోజు ఆట ముగిసే సమయానికి రెండో ఇన్నింగ్స్‌లో 4వికెట్ల నష్టానికి 113పరుగులు చేసింది.

భారత్ 438ఆలౌట్

500వ మ్యాచ్‌లో శతకం కొట్టిన కోహ్లి

ట్రినిడాడ్: వెస్టిండీస్‌తో జరుగుతున్న రెండోటెస్ట్‌లో టీమిండియా తొలి ఇన్నింగ్స్‌లో 438పరుగులు చేసింది. విరాట్ కోహ్లి(121) సెంచరీకి తోడు, జడేజా(61), అశ్విన్(56) అర్ధ సెంచరీలతో రాణించారు. రన్ మెషిన్ విరాట్ కోహ్లి 500వ అంతర్జాతీయ మ్యాచ్‌లో శతకం, టెస్టు కెరీర్‌లో 29వ సెంచరీని పూర్తి చేసుకున్నాడు. మొత్తం 179బంతులు ఎదుర్కొన్న కోహ్లి గాబ్రియెల్ వేసిన 90.2వ బంతిని బౌండరీకి తరలించి సెంచరీని పూర్తి చేసుకున్నాడు. ఓవర్‌నైట్ స్కోర్ 4వికెట్ల నష్టానికి 288పరుగులతో శుక్రవారం రెండోరోజు ఆటను కొనసాగించిన భారత్‌ను కోహ్లి, జడేజా కలిసి 5వ వికెట్‌కు 159పరు గులు జతచేశారు. 206 బంతులను ఎదుర్కొన్న కోహ్లి 11ఫోర్లతో 121పరుగులు చేసి దురదృష్ట వశాత్తూ రనౌటయ్యాడు. కెరీర్‌లో టెస్టుల్లో కోహ్లి రనౌట్ కావడం ఇది మూడోసారి మాత్రమే. భారతజట్టు లంచ్ విరామ సమయానికి 108 ఓవర్లలో 6వికెట్ల నష్టపోయి 373పరుగులు చేసింది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68